ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
31-3-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 59 పేజీలు: 8+16 వెల: 6.50

సహజీవన జంటలకూ కుటుంబహోదా
తమిళనాట నామినేషన్ల జోరు
5

# ఆహార కల్తీకి అడ్డుకట్ట

## ఈగల్, హైడ్రా తరహాలో కొత్త వ్యవస్థ

### పంట మార్పిడిపై రైతులకు అవగాహన
### కెసిఆర్ వల్లే నాకు గుర్తింపు.. ఆయన లేకపోతే నా మంచి పనులు తెలిసేవి కావు
### 50% సీట్లు పెంచితే దక్షిణాదికి అన్యాయం
### కౌన్సిల్‌లో మీడియాతో సిఎం రేవంత్


సోమవారం మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్. చిత్రంలో మంత్రి ఉత్తమ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి30:** ఈగల్,హైడ్రా లాగే ఆహార కల్తీని నియంత్రించడానికి ఒక వ్యవస్థను తీసుకొస్తామని, దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను తీసుకొస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎక్కడైనా ఉత్పత్తిదారుడే వస్తువు ధరను నిర్ణయిస్తారని, కానీ ఒక రైతు పండించిన పంటకు మాత్రం ఆ అవకాశం లేదని, రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు దోపిడీకి పాల్పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువ, ప్రజల ఆకలిని సొమ్ము చేసుకునే వాళ్ళను నియంత్రించడానికి ఆనాడు కాంగ్రెస్ పకడ్బందీ చట్టం తీసుకొచ్చిందని గుర్తు చేశారు.సోమవారం శాసనమండలిలోని తన ఛాంబర్‌లో మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన ముఖ్యమంత్రి పలు కీలక అంశాలపై మాట్లాడారు. రూపాయి కిలో బియ్యం పథకం విజయభాస్కర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని, కాకపోతే అది అంతగా ప్రజల్లోకి వెళ్లలేదు ఆ తరువాత ఎన్టీరామారావు ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్లారు అది విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లిందని చెప్పారు. రేషన్ బియ్యం పంపిణీపై ప్రజల్లో మంచి స్పందన వచ్చింది నలభై ఏళ్లుగా ఇదే పథకం కొనసాగుతోంది.. ఆనాటి నుంచి దొడ్డు బియ్యమే ఇస్తూ వచ్చారు. దొడ్డు బియ్యం తినేవారు లేక ఆ బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చే మాఫియా పెరిగిపోయిందన్నారు. దొడ్డు బియ్యం ఇవ్వడం ప్రభుత్వానికి ఖర్చు తప్ప.. పేదలకు ఉపయోగపడటం లేదని గ్రహించాం అందుకే పేదలకు తినగలిగే సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించి సన్నబియ్యం పథకం ప్రారంభించామని చెప్పారు. ఇందుకోసం రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించి సన్నవడ్లు పండించాలని ప్రోత్సహించామని పేర్కొన్నారు. >>2

తెలంగాణ అసెంబ్లీ నిరవధిక వాయిదా 2


సోమవారం గన్‌పార్కు వద్ద ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు

## బిఆర్ఎస్ ఎమ్మెల్సీల సస్పెన్షన్

### మండలిలో వెల్‌లోకి వెళ్లి ఆందోళన చేసిన సభ్యులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 30:** శాసనమండలిలో మొదటిసారి ఎమ్మెల్సీ సస్పెన్షన్ ఘటన సోమవారం చోటుచేసుకుంది. మంత్రి పొంగులేటి బంధువులకు సంబంధించిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ అక్రమాలపై సభాసంఘం వేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ సభ్యులు శాసనమండలిలో ఆందోళన చేపట్టారు. మండలి >>2

## ఖర్గ్ ద్వీపాన్ని ధ్వంసం చేస్తాం

### ఇరాన్‌ను హెచ్చరించిన ట్రంప్
### అణు ఒప్పందం నుంచి వైదొలిగే దిశగా ఇరాన్
### కువైట్ విద్యుత్, జలశుద్ధికేంద్రాలపై ఇరాన్ దాడులు



**టెహ్రాన్ /టెల్‌అవీవ్ /వాషింగ్టన్, మార్చి 30:** మధ్యప్రాచ్యంలో యుద్ధకాండ సమీప భవిష్యత్తులో ఆగేటట్లు కనిపించడంలేదు. రోజుకోరకంగా కొత్త హెచ్చరికలు, కొత్త తరహా దాడులతో మొండిగా ముందుకుపోతున్నాయి. ఇరాన్‌ను ధ్వంసంచేయాలన్న లక్ష్యంతో ఇజ్రాయెల్, అమెరికాలు సంయుక్త దాడులుచేస్తుంటే ఇరాన్‌సైతం అమెరికా బేస్‌లనే లక్ష్యంగాచేసుకుని దాడులుచేస్తున్నది. అలాగే మిత్రదేశాల మౌలికవనరులను కూడా టార్గెట్‌చేయడంతో ఇపుడు ఇవన్నీ అమెరికావైపు చూస్తున్నాయి. నెలరోజులు దాటినా ఎక్కడా సంధి సంప్రదింపులు కనిపించడంలేదు. ఎవరికివారు షరతులు విధించుకున్నప్పటికీ చర్చలు >>2



## కాళేశ్వరంతో లక్షకోట్లు వృధా

డిజైన్‌లోపాలే వైఫల్యానికి కారణం
జల్‌జీవన్ నిధుల వినియోగంలో తెలంగాణ నిర్లక్ష్యం
2 రాజ్యసభలో కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్


గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నేతలు

## పొంగులేటిని బర్తరఫ్ చేయండి

గవర్నర్‌కు బిఆర్ఎస్ వినతిపత్రం
3 రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్‌కు ఆధారాలున్నాయి


అసెంబ్లీలో విందు ఆరగిస్తున్న సిఎం రేవంత్ తదితరులు 2

## సన్నబియ్యం ఘుమఘుమలు

అసెంబ్లీలో మధ్యాహ్నం విందు ఆరగించిన సిఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్, చైర్మన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

## నేడే ఆఖరు

మావోయిస్టులు పూర్తిగా లొంగిపోవాలి


లోక్‌సభలో కేంద్రహోంమంత్రి అమిత్‌షా

### లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా
### 'ఆపరేషన్ కగార్'కు గడువు నేటితో పూర్తి
### పోలీసుల అధీనంలో అబూజ్‌మడ్ సహా కీలక ప్రాంతాలు

**న్యూఢిల్లీ / హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** నక్సలిజం నిర్మూలనపై లోక్‌సభలో జరిగిన చర్చలో హోంమంత్రి అమిత్‌షా ఘాటైన వ్యాఖ్యలుచేసారు. మావోయిస్టులపై కేంద్రం వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదన్నారు. మావోయిస్టుల ఏరివేతకు మార్చి 31 డెడ్ లైన్ అని తెలిపారు. బస్తర్‌లో ప్రస్తుతం మావోలు లేరని మావోయిస్టు రహిత ప్రాంతంగా మారిందని వెల్లడించారు. బస్తర్‌లో ఆదివాసీలకు ప్రస్తుతం అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. అభివృద్ధి దిశగా బస్తర్ ప్రాంతం ముందుకెళ్తోందని తెలిపారు. మావోల లొంగుబాటుకు రేపే(మంగళవారం) ఆఖరి తేదీ అని అభివృద్ధి లేదంటూ ఆయుధాలు పట్టుకోవడం సరికాదని హితవుపలికారు అమిత్ షా. ఆయుధాలు వీడని వారి అంతు చూస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కాంగ్రెస్ హయాంలో విలీన ప్రాంతాలను నిర్లక్ష్యం చేశారని కాంగ్రెస్ పాలనలోనే గిరిజన ప్రాంతాలు ఎందుకు అభివృద్ధి చెందలేదని ప్రశ్నించారు. వారి పాలనలో బస్తర్ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని గిరిజనులను 60 ఏళ్లపాటు కాంగ్రెస్ విస్మరించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ నిర్వాకం వల్లే దేశంలో మావోయిజం పెరిగిందని కేంద్ర హోంమంత్రి ఆరోపించారు. మావోయిజం వల్ల 12 రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడిందని అమిత్ షాధ్వజమెత్తారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని.. తమ వల్లే నక్సల్స్ విముక్త భారత్ సాధ్యమవుతోందని లోక్‌సభ వేదికగా కేంద్ర మంత్రి ప్రకటించారు. మావోయిస్టుల ఏరివేతకు డెడ్ లైన్ మంగళవారంతో ముగియనుండగా పార్టీ అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి ఆయన సతీమణి రత్నా భాయి అలియాస్ సుజాత సహా ఆరుగురు కీలక నేతల ఆచూకీ ఇప్పటి వరకు తెలియరాలేదు. వీరితో పాటు ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్‌కు చెందిన మరో వంద మంది >>2

# గిగ్ వర్కర్లకు భద్రత

### అసెంబ్లీలో బిల్లుకు ఆమోదం
### వర్కర్లను వేధిస్తే అగ్రిగేటర్లకు జరిమానా
### కార్మిక మంత్రి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** గిగ్ వర్కర్ల హక్కులు, భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. గిగ్ వర్కర్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. గిగ్ వర్కర్ల బిల్లును కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అసెంబ్లీలో ప్రవేశపెట్టగా పూర్తిస్థాయిలో చర్చించిన తర్వాత సభ ఆమోదం తెలిపింది. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు రూ.50వేలపెనాల్టీ వేస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి హెచ్చరించారు. గిగ్ వర్కర్లతో స్వయంగా మాట్లాడి డ్రాఫ్ట్ బిల్లు సిద్ధం చేశామన్నారు. ఈ చట్టంతో కంపెనీలకు ఎలాంటి నష్టం ఉండదన్నారు. గిగ్ వర్కర్లకు ప్రత్యేకంగా సంక్షేమ నిధితోపాటు ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో గిగ్ పర్కర్లకు చట్టబద్ధ గుర్తింపు ఇవ్వడమే లక్ష్యంగా ఈ బిల్లును తీసుకొచ్చినట్లు చెప్పారు. వర్కర్ల హక్కులు, గౌరవం, జీవనోపాధిని కాపాడే విధంగా నిబంధనలు రూపొందించామన్నారు. గిగ్ వర్కర్లు రిజిస్ట్రేషన్ చేసుకుంటే యూనిక్ ఐడీ వస్తుందని చెప్పారు. స్విగ్గీ, జొమాటో ఇలా అన్ని కంపెనీలకు ఒకటే ఐడీ ఉంటుందన్నారు. గిగ్ వర్కర్స్ తమ సమస్యలు కమిటీకి చెప్పుకోవచ్చని అన్నారు. ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక అధికారులతో పాటు ప్లాట్ఫామ్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కాగా.. గిగ్ వర్కర్స్ బిల్లుపై చర్చలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. శాసనసభలో మంత్రి వివేక్ వెంకస్వామి గిగ్ వర్కర్స్ బిల్లును తేవడం సంతోషంగా ఉందన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్రలో గిగ్ వర్కర్స్‌తో సమావేశం నిర్వహించారని, లక్షల మంది గిగ్ వర్కర్లు ఈ బిల్లు కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ బిల్లు ఎవరికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. గిగ్ వర్కర్ల బిల్లు ఆమోదం పొందడంపై హైదరాబాద్ ఇన్చార్జి మంత్రిగా వర్కర్లకు శుభాకాంక్షలు తెలిపారు. సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ వివిధశాఖల్లో పనిచేస్తున్నఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, సింగరేణి కాంట్రాక్టు ఉద్యోగుల విషయంతోపాటు జర్నలిస్టుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలన్నారు.

**ముఖ్యాంశాలు:** గిగ్ కార్మికుల రిజిస్ట్రేషన్, పర్యవేక్షణకు సామాజిక భద్రత , సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తారు. ఇందులో మహిళలు, దివ్యాంగులకు ప్రాతినిధ్యం ఉంటుంది. ప్లాట్‌ఫాం ఆధారిత కార్మికులందరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యూఐడీ) కేటాయిస్తారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా వారికి అందుతాయి. అగ్రిగేటర్లు (సంస్థలు) జరిపే లావాదేవీల నుంచి 1శాతం నుంచి 2 వరకు నిధులను సేకరించి, వాటిని సంక్షేమ నిధికి జమ చేస్తారు. ఈ నిధిని కార్మికుల బీమా, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ , పెన్షన్, ప్రసూతి ప్రయోజనాలకు ఉపయోగిస్తారు. యాజమాన్యాలకు, కార్మికులకు మధ్య వచ్చే తగాదాలను పరిష్కరించేందుకు బలోపేతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తారు. ఇబ్బందుల నివారణకు ప్లాట్‌ఫాం స్థాయి కమిటీలు పనిచేస్తాయి.

## రూ. 7,590 కోట్లతో 1,835 కి. మీ రోడ్ల పనులు 2

బుల్లెట్ ట్రైన్స్ కోసం సెంటర్ పాయింట్‌గా భారత్ ఫ్యూచర్ సిటీ: అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి



## సెలెక్ట్ కమిటీకి 'విద్వేష ప్రసంగాల' బిల్లు

### ద్వేష పూరిత నేరాలు చేస్తే ఏడేళ్ల జైలు, రూ. 50 వేల జరిమానా
### భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం రాదు: మంత్రి పొన్నం
### ప్రజాస్వామ్యానికి డెత్ వారంట్ : ఏలేటి

**హైదరాబాద్, మార్చి30 ప్రభాతవార్త:** తెలంగాణ విద్వేషపూరితమైన ప్రసంగం ద్వేషపూరితమైన నేరాల నివారించు బిల్లు-2026ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిపాదనల మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సెలక్ట్ కమిటికి పంపుటకు ఆమోదం తెలిపారు. తెలంగాణ రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బిల్లుపై 14 మంది ఎమ్మెల్యేలు లేవనెత్తిన అనుమానాలకు వివరణ ఇస్తూ భావప్రకటన స్వేచ్ఛకు ఎట్టిపరిస్థితుల్లో భంగం కలగదని హామి ఇచ్చారు. సోషల్ మీడియాలో విద్వేష పూరిత ప్రకటనలు, ప్రసంగాలు సైతం పెరిగాయని ప్రభుత్వం భావిస్తోందనీ దీంతో ఇకపై సంఘం, సమూహం, సమావేశాల్లో ద్వేషపూరిత ప్రసంగాలు, రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు ఉండొద్దని ప్రభుత్వం నిర్ణయించిందనీ పొన్నం అన్నారు. మతం, కులం, లింగం ఇతర కారణాల వల్ల సమాజంలో విద్వేషం, అశాంతిని రేకెత్తించే ప్రసంగాలు, రచనలు లేదా సోషల్ మీడియా పోస్టుల నేరాలను నాన్ బెయిలబుల్ గా పరిగణించడం దీని ముఖ్య ఉద్దేశ్యమనీ వివరించారు. విద్వేష పూరిత ప్రసంగాలు మొదటి సారి రుజువు అయితే ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందనీ తెలిపారు. శిక్షతోపాటు రూ.50 వేలు జరిమానా విధిస్తామనీ ఇదే ఘటన మరోసారి పునరావృతమైతే జైలు శిక్ష పదేళ్లు, రూ. లక్ష జరిమానా విధిస్తారనీ చెప్పారు. ద్వేషపూరితమన ప్రసంగంకు స్పష్టమైన నిర్వచనం ఇవ్వలేదనే సభ్యుల సూచనలు పరిగణలోనికి తీసుకొని హడావిడిగా ఆమోదించడం కంటే సమగ్రంగా చర్చిండం మంచిదని ప్రభుత్వం భావించి సెలక్ట్ కమిటికి నివేదించడానికి తీర్మానం ప్రవేశపెడుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్‌తెలిపారు. కమిటి నివేదిక సమర్పించిన తరువాత దీనిపై తుది నిర్ణం తీసుకోనున్నామని తెలిపారు. మానవహక్కులను హరించే అంశాలు బిల్లులో లేవనీ కక్షసాధింపు కోసమో ఎవరికో అన్యాయం చేసే ఉద్దేశంతో ఈ బిల్లు తేలేదని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్యంలో విలువలు ఉండాలన్న ఉద్దేశంతోనే బైండోవర్ కేసులు ఎలాగైతే ఎమ్మార్వో, ఆర్‌డివో,జ్యుడిషియల్ అధికారి పరిధిలోనే నిందితులను విచారణచేసి నిందితులకు శిక్షలు నిర్ధారణ చేస్తారని మొదటిసారి చేసిన వారికి కఠిన శిక్షలు కఠినంగా ఉండవని మతం,కులం భాష,లింగబేధంతో విద్వేషపూరితమైన ప్రసంగం, ద్వేషపూరితమై నేరాలు అలవాటుగా,పునరావృతంగా చేసేవారిని >>2

## మండుతున్న ఎండలు



### 42 డిగ్రీలకు చేరుతున్న ఉష్ణోగ్రతలు
### అత్యధికంగా జగిత్యాలలో 41.9 డిగ్రీలు
### 30 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతుండటంతో ఎండలు మంటపెడుతున్నాయి. తీవ్రమైన వేడి, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 41 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరో 12 జిల్లాల్లో 40 నుండి 40.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. దీంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్టు తెలిపింది. గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోనే అత్యధికంగా జగిత్యాల జిల్లా కోరుట్లలో 41.9 డిగ్రీల మేర >>2

## గల్లీ గల్లీలో గ్యాస్ దొంగలు!


సోమవారం సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న ముఠాను పట్టుకున్న పోలీసులు

### సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న ముఠా అరెస్టు
### 414 డొమెస్టిక్ సిలిండర్లు స్వాధీనం
### ఏజెన్సీ నిర్వాహకుడితో పాటు పది మంది అరెస్టు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** మధ్య ప్రాచ్య యుద్ధం కారణంగా పెరిగిన గ్యాస్ ధరలతో పాటు వాటి అందుబాటు తక్కువగా వుండడాన్ని అనుకూలంగా మార్చుకున్న ఓ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు కొందరు ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులతో కలిసి ముఠాగా ఏర్పడి బ్లాక్ మార్కెట్‌కు తర లిస్తున్న వైనం ఇది. దీనిపై పక్కా సమాచారం అందుకున్న సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సదరు ఏజెన్సీ నిర్వాహకుడితో పాటు అతని ము ఠాలో వున్న పది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి కమర్షియల్, డొమెస్టిక్‌కు సంబంధించి 414 గ్యాస్ సిలిండర్లను పట్టుకున్నారు. దీనికి సం బంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ సోమవారం మీడియాకు వెల్లడించారు. నగర శివార్లలోని మామిడిపల్లిలో మెట్రో గ్యాస్ ఏజెన్సీని బంజారాహిల్స్‌కు చెందిన మహమ్మద్ అమీర్ (42)నిర్వహిస్తున్నాడు. దీనికి సంబంధించిన కార్యాలయం అఫ్జల్‌గంజ్‌లో >>2



ముంబయిలో సోమవారం ఎల్‌పిజి గ్యాస్ సిలెండర్ కోసం ఓ ఏజెన్సీ వద్ద బారులు తీరిన వినియోగదారులు

## అసెంబ్లీ నిరవధిక వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి30:** తెలంగాణ శాసనసభ నిరవధికంగా వాయిదా పడింది. మొత్తం 10 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు కొనసాగాయి. 82 గంటల 47 నిమిషాల పాటు బడ్జెట్ సమావేశాలు జరిగాయి. అసెంబ్లీ మూడు తీర్మానాలు చేసింది. 10 బిల్లులకు ఆమోదం తెలిపింది.ఒక బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపింది. ద్రవ్య వినిమయ బిల్లును అసెంబ్లీ ఆమోదించింది. మొత్తం 125 సభ్యుల ప్రసంగాలు జరిగాయి. ప్రస్తుతం అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులు 66 మంది, బీఆర్ఎస్ సభ్యులు 37 మంది, బిజెపి సభ్యులు 8 మంది, ఎంఐఎం సభ్యులు ఏడుగురు, సిపిఐ సభ్యులు ఒకరు ఉన్నట్లు సభలో స్పీకర్ ప్రకటించారు.

## ఎమ్మెల్సీల సస్పెన్షన్

>> చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ఎంత చెప్పినప్పటికీ వినకుండా ఆందోళన కొనసాగించడంతో బీఆర్ఎస్‌కి చెందిన 11 మంది ఎమ్మెల్సీను సస్పెండ్ చేస్తున్నట్టు మండలి చైర్మన్ ప్రకటించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు శాసనమండలి సమావేశం ప్రారంభం కాగానే శాసనసభలో ఆమోదం పొందిన బిల్లులను ప్రవేశ పెట్టాలని మంత్రులను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. దీంతో పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును మంత్రి సీతక్క తరపున ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశ పెడుతుండగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు రాఘవ కన్‌స్ట్రక్షన్ వ్యవహారంపై సభా సంఘం వేయాలని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. చైర్మన్ పోడియం వద్దకు చేరుకుని ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఇందుకు మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ.. ఈ అంశంపై సీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లుగా శాసనసభలో ముఖ్యమంత్రి స్పష్టం చేశారని, సభ సజావుగా సాగేందుకు బీఆర్ఎస్ సభ్యులు సహకరించాలని కోరారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా సభా కార్యక్రమాల నిర్వహణకు సహకరించాలని ఆందోళన విరమించాలని బీఆర్ఎస్ సభ్యులను పదే పదే కోరారు. పెద్దల సభ గౌరవాన్ని కాపాడాలని మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన విరమించకుండా చైర్మన్ పోడియం ముందు ఇదేమీ రాజ్యం, ఇదేమీ రాజ్యం.. దోపిడీ రాజ్యం అంటూ ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై హౌజ్‌కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. మంత్రి, చైర్మన్ మాటలను వినిపించుకోకుండా బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన కొనసాగిస్తూ.. బిల్లులకు చెందిన పత్రాలను చింపి పోడియం దగ్గర వేస్తూ నిరసన కొనసాగించారు. దీంతో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను మండలి నుంచి ఒకరోజు సస్పెండ్ చేస్తున్నట్లుగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. బీఆర్ఎస్ సభ్యులు సస్పెండ్ అయినప్పటికీ బయటికివెళ్లకుండా వెల్‌లోనే ఆందోళన కొనసాగిస్తుండటంతో చైర్మన్ ఆదేశాల మేరకు మార్షల్స్ రంగంలోకిదిగి సస్పెండైన సభ్యులను సభ నుంచి బయటికి మోసుకెళ్లారు. అనంతరం మంత్రులు శాసనసభలో ఆమోదం పొందిన బిల్లులను మండలిలో ప్రవేశ పెట్టారు. శాసనమండలిలో సస్పెండైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీల్లో మండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి, రవీందర్‌రావు, దేశపతి శ్రీనివాస్, ఎల్. రమణ, యాదవరెడ్డి, సుంకరి రాజు, నవీన్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్, వాణీదేవి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎం.కోటిరెడ్డి ఉన్నారు.

## గల్లీ గల్లీలో గ్యాస్ దొంగలు!

>> వుంది. అయితే మధ్య ఆసియా యుద్ధం కారణంగా గ్యాస్ సిలిండర్ల కొరత రావడం, అనేకచోట్ల బ్లాక్ మార్కెటింగ్ జరుగుతుండడంతో దీనిని అమీర్ తనకు అనుకూలంగా మార్చుకుని తన వద్ద పనిచేసే ఉద్యోగులతో పాటు మరికొందరు ప్రైవేటు వ్యక్తులతో కలిసి ఒక ముఠాను ఏర్పాటు చేశాడు. వీరంతా కలిసి కమర్షియల్, డొమెస్టిక్ సిలిండర్లను అధిక ధరలకు విక్రయించడం మొదలు పెట్టారు. వీటిని జంట నగరాలు, శివార్లలో అవసరం వున్న వారికిఇవ్వసాగారు. డొమెస్టిక్ సిలిండర్ రెండు వేల రూపాయలు, కమర్షియల్ సిలిండర్ మూడువేల రూపాయలకు అమ్ముతున్నారు. ఈ ముఠాలో బంజారాహిల్స్‌లోని షౌకత్‌నగర్‌కు చెందిన మహమ్మద్ యూసుఫ్ (32) (ఇతను గ్యాస్ డెలివరి బాయ్‌గా వున్నాడు), ఇదే ప్రాంతానికి చెందిన గ్యాస్ డెలివరి బాయ్‌లుగా వున్న మహమ్మద్ ఇస్మాయిల్ (27), రామారావు (42), లోక్ కుమార్ (24), దినసరి కూలీగా వున్న మహమ్మద్ సక్రుద్దీన్ (42), డ్రైవర్‌గా పనిచేస్తున్న మహమ్మద్ ముంతాజ్ అన్సారి (35), దినసరి కూలీగా వున్న మినార్ అనాజ్ అన్సారి(42), డ్రైవర్‌గా వున్న రాజేష్‌పాల్(36), బంజారాహిల్స్‌లోని దేవరకొండ నల్లపోచమ్మ దేవాలయ అధ్యక్షుడుగా వున్న రాంరాజ్ సింగ్ (54)లు వున్నారు. వీరంతా కలిసి కొన్ని రోజులుగా మామిడిపల్లి నుంచి కమిర్షియల్, డొమెస్టిక్ సిలిండర్లను బంజారాహిల్స్‌లోని స్మశానవాటికలో అక్రమంగా డంప్‌చేసి అక్కడి నుంచి బ్లాక్ మార్కెట్ చేయసాగారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి స్మశానవాటికపై దాడిచేసి మొత్తం పది మందిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా 47 కిలోల హెచ్‌పి గ్యాస్ సిలిండర్లు 30, 19 కిలోల హెచ్‌పి గ్యాస్ సిలిండర్లు 148, 19 కిలోల ఖాళీ హెచ్‌పి గ్యాస్‌సిలిండర్లు 192, ఐదు కిలోల హెచ్‌పి గ్యాస్ సిలిండర్లు 35, తొమ్మిది కిలోల ఖాళీ హెచ్‌పి గ్యాస్ సిలిండర్లు ఐదు, రెండు డిసిఎం వాహనాలు, ఒక బొలోరో వాహనం, టాటా ఏస్ వాహనాలు రెండు, మరో పది వాహనాలు జప్తు చేశారు.

## మండుతున్న ఎండలు

>> గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం, మంచిర్యాల జిల్లా కాశీపేట్, నల్లగొండ జిల్లా పెద్దఊర, నిజామాబాద్ జిల్లా భీమగల్‌లో 41.6 డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లా బేల, జిల్లా కేంద్రం ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో 41.5 డిగ్రీలు, నాగర్‌కర్నూల్ జిల్లా చరకొండ, నారాయణ్‌పేట్ జిల్లా మగనూర్‌లో 41.4 డిగ్రీలు, ఖమ్మం జిల్లా కొణిజెర్ల, నిర్మల్ జిల్లా భాన్సిలో 41.3 డిగ్రీలు, హన్మకొండ జిల్లా ఇనోలులో 41.2 డిగ్రీలు, భూపాలపల్లి జిల్లా ఘనపూర్, మహబూబాబాద్ జిల్లా సీరోలు, సూర్యాపేట్ జిల్లా నగరంలో 41.1, వికారాబాద్ జిల్లా బంటవరంలో 41 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. వీటితో పాటు, మరో 12 జిల్లాల్లో 40.1 డిగ్రీల నుండి 40.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు చోటు చేసుకున్నాయి. ఏప్రిల్ 5 వ తేదీ వరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. ముఖ్యంగా నిజామాబాద్, సిద్దిపేట, భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. కాగా గడిచిన 24 గంటల్లో కొత్తగూడెం, హైదరాబాద్, ములుగు, సూర్యాపేట, ఆసిఫాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్, ఆదిలాబాద్, మహబూబాబాద్, జనగామలో తేలికపాటి వర్షానికి అవకాశం ఉన్నట్లు తెలిపింది.

## అసెంబ్లీలో 'సన్నబియ్యం' ఘుమఘుమలు

### మధ్యాహ్నం విందు ఆరగించిన సిఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్, చైర్మన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 30:** రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా అసెంబ్లీ ఆవరణలోని డైనింగ్ హాల్‌లో ఆసక్తికర్త ఘటన చోటు చేసుకుంది. నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలకు సన్న బియ్యంతో ప్రత్యేక భోజనం ఏర్పాటు చేశారు. పేదల ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన సన్నబియ్యం పంపిణీ విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రేషన్ షాపుల ద్వారా సామాన్యులకు అందుతున్న అదే నాణ్యమైన బియ్యంతో వండిన పదార్థాలను ప్రజాప్రతినిధులందరికీ వడ్డించారు. ఈ విందులో సిఎం రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి స్వయంగా పాల్గొని, మంత్రులు, అధికార, ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి సన్న బియ్యం భోజనం చేశారు. అనంతరం వారు సన్నబియ్యం విందు భలే బాగుందంటూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కితాబిచ్చారు. పేదలకు అందుతున్న బియ్యం నాణ్యత ఏ విధంగా ఉందో ఈ సందర్భంగా ఆయన స్వయంగా పరిశీలించారు.

**రేవంత్‌రెడ్డి పక్కనే రాజగోపాల్‌రెడ్డి**

సన్నబియ్యం పంపిణీ ప్రారంభమై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి సిఎం రేవంత్‌రెడ్డి లంచ్ చేశారు. ఎమ్మెల్యేలతో ముచ్చటిస్తూ భోజనం చేశారు. ఇటీవల ప్రభుత్వంపై తరచూ విమర్శలు చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి రేవంత్ పక్కనే కూర్చోవడం గమనార్హం. దొడ్డు బియ్యం పేదలకు ఉపయోగపడం లేదని గ్రహించి సన్నబియ్యం పంపిణీని ప్రారంభించాం. ప్రస్తుతం 86శాతం మంది రేషనన లబ్దిదారులు ఈ బియ్యం పొందుతున్నారు అని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

## వారం - వర్జ్యం

31-03-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, రేవతి కార్తె
త్రయోదశి ఉ.6.56
పూర్వఫల్గుణి మ.3.23
వర్జ్యం : రా.10.52-రా.12.32
దు.ఉ.8.30-ఉ.9.19, 2) రా.11.15-రా.12.04
శుభసమయం: ఉ.5.30-ఉ.6.00
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** మీరు నిర్వహిస్తున్నా బాధ్యతలు పదవులపై న్యాయపరమైన వివాదాలు చెలరేగుతాయి. జీవిత భాగస్వామి సలహాలు పాటిస్తారు.

**వృషభం:** విదేశీ వ్యవహారాలు అనుకూలిస్తాయి. జీవితభాగస్వామి సహాయ సహకారాలు అందుకుంటారు.వస్త్రలాభం.

**మిథునం:** ఇంతవరకు మీరు సాధించిన స్థాయిని నిలబెట్టుకోవడానికి మరింత శ్రమిస్తారు. స్థిరాస్తులు కొనుగోలు.

**కర్కాటకం :** తల్లివైపు బంధువులు స్థితిని చక్కదిద్దవలసి వస్తుంది. రావలసిన ఋణాలు వాయిదాపడతాయి.

**సింహం:** సామాజిక కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందజేస్తారు. వృత్తి వ్యాపారాలు అనుకూలంగా వుంటాయి.

**కన్య :** కారణం లేని చికాకులు అప్రశాంతతకు గురిచేస్తాయి. స్త్రీలతో విభేదాలు రాకుండా జాగ్రత్తలు అవసరం.

**తుల :** ప్రతి చిన్నపని స్వయంగా నిర్వహించవలసి రావడం ఇబ్బందికరమౌతుంది. వ్యాపారస్థులకు మధ్యస్థంగా ఉంటుంది.

**వృశ్చికం:** ప్రభుత్వ పరమైన ఉత్తర్వులు, కాంట్రాక్టులు, మీ అంచనాలమేరకు కాకపోయినా కొంత వరకు ఫలిస్తాయి.

**ధనుస్సు:** మీరు కొన్న స్థిరాస్తుల విలువ అనూహ్యంగా పెరుగుతుంది. కోర్టుతీర్పులు అనుకూలంగా ఉంటాయి.

**మకరం:** మీ సంస్థలలోని భాగస్వాములు, కార్యాలయములోని సహోద్యోగులు, ఓర్పు లేనివారై ఉంటారు. ఇది మీకు ఇబ్బంది కలిగిస్తుంది.

**కుంభం:** ప్రజా సంబంధాలను పెంచుకోవడానికి చేసే ప్రయత్నాలు సూత్రప్రాయంగా ఉంటాయి.

**మీనం :** జీవితాశయం సాధించుకోవడానికి సమాజంలో ప్రతిష్ట నిలబెట్టు కోవడానికి ఎక్కువగా శ్రమిస్తారు.వాహనసౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆహార కల్తీకి అడ్డుకట్ట

>> రాష్ట్రంలో 3 కోట్ల 39 లక్షలు అంటే 86 శాతం తెలంగాణ ప్రజలు సన్నబియ్యం పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని వివరించారు. భవిష్యత్ లో ఇది 90 శాతం కూడా కావచ్చు అడిగిన ప్రతి వారికి రేషన్ కార్డు అందించాం, రైతులకు లాభం చేకూర్చడమే కాదు.. పేదల ఆకలి తీరుస్తున్నాం సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గిందని చెప్పారు. పౌరసరఫరాల మంత్రి, శాఖ సిబ్బంది నిరంతర పర్యవేక్షణతోనే ఇది సాధ్యమైందన్నారు. మార్చి 30తో సన్నబియ్యం పంపిణీకి ఏడాది పూర్తయిందని, ఈ సందర్భంగా శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులకు అసెంబ్లీలో భోజనం పెట్టామని చెప్పారు. దేశంలో రైతుల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ కనీస మద్దతు ధర చట్టం తెచ్చిందని, వరి ఒక్కటే కాదు.. ఇతర పంటలను ప్రోత్సహిస్తున్నాం.. వాణిజ్య పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం, పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు.

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని ఒక ప్రశ్నకు సమాధానంగా అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని ఒక ప్రశ్నకు సమాధానంగా వ్యాఖ్యానించారు. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. లక్ష్మణ్ ఎలా డాక్టర్ అయ్యారో అర్థం కావడం లేదని ఘాటుగా విమర్శించారు. నియోజకవర్గాల సంఖ్య పెరిగినా భౌగోళికంగా గ్యాప్ అలాగే ఉంటుందని, ఈ విషయంలో తెలంగాణను తెలివిగా మోసం చేస్తున్నారని ఆరోపించారు. సీట్ల పెంపు విషయంలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోందని అన్నారు. కేంద్రానికి కేవలం ఐదు ఉత్తరాది రాష్ట్రాల సీట్లు సరిపోతాయని, అదే జరిగితే దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సీట్ల పెంపులో ఈ వ్యత్యాసం కొనసాగితే భవిష్యత్తులో బండి సంజయ్, కిషన్ రెడ్డి వంటి నేతలకు రాజకీయంగా అవకాశాలు ఉండవని, దేశంలో నియంత పోకడలు పెరుగుతాయని సెటైర్లు వేశారు. నియోజకవర్గాల పునర్విభజన మేరకు 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని లెక్కలు వేసి చెప్పారు. రాజకీయంగా అవసరం ఉన్నప్పుడే సౌత్ ఇండియాను పట్టించుకోవడం లేదని.. ఇక నియోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవు పలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవు పలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం, దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే అది ఎంతకాలమో కొనసాగదన్నారు. మాది జాతీయ పార్టీ అయినా అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందన్నారు. మంగళవారం నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రజలందరికీ త్వరలో క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామని రేవంత్‌రెడ్డి ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. తెలంగాణలో పేదలకు సన్న బియ్యం ఇచ్చేందుకు కేంద్రం ఏటా 15వేల కోట్లు ఖర్చు పెడితే ప్రధాని మోడీ బొమ్మను పెట్టడానికి ఇబ్బందేమీ లేదన్నారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు.

పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు.తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు. అన్ని పథకాలు కలిపితేనే ప్రజాపాలన అని, రైతులకు అవగాహన కల్పించడంలో మీడియా కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500ల గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని.. రాష్ట్రం నుంచి రూపాయి తీసుకుని అందులో 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే సెస్ ఇస్తున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

## సెలెక్ట్ కమిటీకి 'విద్వేష ప్రసంగాల' బిల్లు

>> మాత్రమే నియంత్రించడమే బిల్ల ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఆర్టికల్ 19ప్రకారం రాజ్యాంగం ద్వారా సంక్రమించిన భావప్రకటన స్వేచ్ఛకు ఇది భంగం కలిగించదని, భావప్రకటన స్వేచ్ఛకు కూడా పరిమితులు రాజ్యాంగంలోకూడా ఉన్నాయని ఆయన ఎత్తిచూపారు. ప్రజాపాలన అంటూ తెలంగాణను పోలీసురాజ్యంవైపు నడిపిస్తున్నారని బిజెపి ఎల్‌పి లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలంగాణ విద్వేషపూరితమైన ప్రసంగం, ద్వేషపూరితమైన నేరాల బిల్లుపై చర్చ సందర్భంగా ధ్వజమెత్తారు. బిల్లులో విద్వేషంకు అస్పష్టమైన నిర్వచనం ఇచ్చారని ఇది రాజకీయ కక్షసాధింపుకు అధికారపార్టీ ఉపయోగించుకొంటుందని, ఎల్లకాలం మీరు అక్కడే ఉంటారని లేరు మీరు ఇటుమావైపు వచ్చినప్పుడు మీకు కూడా ఇబ్బంది పడుతారని ఆయన హెచ్చరించారు ప్రజాస్వామ్యం గొంతు నులిపివేసే చర్యగా ఈ బిల్లును ఆయన అభివర్ణించారు. అరెస్టుచేసిన పోలీసులు నేరం రుజువు చేయాల్సిన అవసరం లేదు అరెస్టు అయినవారే నిర్ధోషిగా రుజువు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందారు. కవులు, కళాకారుల సాంస్కృతిక కళారులపై దాడులు చేయడానికి భావప్రకటన స్వేచ్ఛపై నేరపూరితమైన రంగు పులమడానికి అవకాశం ఇస్తోందని వెంటనే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని సిపిఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు తెలిపారు. యుఎపిఎ వంటి నల్లచట్టాలకు తోడు ఇదొక చట్టం తయారవుతోందని వరవరరావు వంటి వాళ్ళు ఇప్పటికి ముంబాయి వదిలిపెట్టి రాని పరిస్థితి ఉందని ఎన్‌ఐఎ చంపిన ఒక వ్యక్తి సంతాసభకు వెళ్ళినవాళ్ళపై కూడా ఇటీవల నోటిసులు ఇచ్చారని రేపు హేతువాద దృక్పథంతో ఏదైనా అశాస్త్రీయ అంశాన్ని వ్యతిరేకించినా కూడా తప్పుగా చిత్రీకరణ చేస్తారని ఇది సరైనది కాదని అన్నారు.

## ఖర్గ్ ద్వీపాన్ని ధ్వంసం చేస్తాం

>> ప్రారంభం అనేది ఇప్పటికీ లేదు. ఇదిలా ఉంటే సోమవారం కూడా కువైట్ ఇంధన ప్లాంట్‌పై ఇరాన్ క్షిపణి దాడితో పెద్ద విఘాతం కలిగింది. విద్యుత్, జలశుద్ధి ప్లాంట్లపై దాడితో అక్కడ పనిచేస్తున్నభారతీయుడు మృతిచెందాడు. ఇపుడు ఇరాన్ రహస్యంగా అణుబాంబు తయారుచేస్తోందని, అందుకే నిల్వలు పెంచుకుంటున్నదని ముందునుంచీ ఆరోపిస్తున్న అమెరికా ఇపుడు ఇరాన్‌వదనద ఉన్న 400 కిలోల యురేనియం స్వాధీనంచేసుకోవాలన్న లక్ష్యంతో భూతల దాడులకు సన్నాహాలుచేస్తోంది. అందుకు ట్రంప్ మైండ్‌గేమ్ మళ్లీప్రారంభించారు. అలాగే ఇరాన్‌లోని భారజల ఉత్పతినత కేంద్రంపై క్షిపణులు దాడితో ఆ కేంద్రం పూర్తిగా ధ్వంసం అయింది. ఇదిలా ఉంటే హార్ముజ్ జలసంధిపై ట్రంప్ మళ్లీ తనవంతు హెచ్చరికలు ప్రారంభించారు. హార్ముజ్‌ను ప్రారంభించకపోతే ఖర్గ్ ద్వీపాన్ని నాశనంచేసేస్తామని హెచ్చరించారు. సత్వరమే ఒప్పందాలకు రావాలని, చర్చలకు రావాలని వ్యవధి తగ్గుతున్నకొద్దీ ఉద్రిక్తతలు మరింతపెరుగుతాయన్న హెచ్చరికలుచేయడంతో రెండుదేశాలమధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరిగేందుకు ఈ వ్యాఖ్యలు దోహదంచేస్తున్నాయి. ఇరాన్ అంతటా విస్తరించిన విద్యుత్ ఉత్పత్తికేంద్రాలు, చమురుబావులు, ఖర్గ్‌ద్వీపం పూర్తిగా తుడిచిపెట్టేస్తామని హెచ్చరించారు. అసలు అణుశుద్ధి పైనా రగడ ప్రారంభం కావడంతో అణు ఒప్పందంనుంచి వైదొలగడమే మంచిదన్న భావనలో ఉంది. ఇప్పటికీ ఇజ్రాయెల్ అటు లెబనాన్, ఇటు ఇరాన్‌లపై దాడులు చేస్తూనే ఉంది. మౌలికవనరులే లక్ష్యంగాచేస్తున్న దాడుల్లో అమాయక పౌరులు కూడా సమిధలైపోతున్నారు. ఇరాన్‌సైతం గల్ఫ్‌దేశాలపై చేస్తున్న దాడులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. చౌకబారు డ్రోన్లు, క్షిపణులతోనే సంపన్న దేశాలను ఇరాన్ గడగడలాడిస్తోంది. కువైట్‌లో జరిగిన దాడి ఈ తరహాలోనిదే కావడం గమనార్హం.



కోల్‌కతాలోని కబర్‌డంగాలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టిఎంసి మద్దతుదారులు

## నేడే ఆఖరు

>> వరకు మావోయిస్టుల ఆచూకీ కూడా పోలీసులకు లభించలేదు. ద శాబ్దాలుగా నక్సల్స్ ఖిల్లాగా వున్న అబూజ్‌మడ్, కర్రెగుట్టల సహా పలు ప్రాంతాలు గత జనవరి నెలలోనే పోలీసుల వశం కావడం భద్రతా బలగాలు సాధించిన పెద్ద విజయంగా చెప్పాలి. మరోవైపు నక్సల్స్ ఏరివేతకు చేబట్టిన ఆపరేషన్ కగార్ చివరి తేదీ మార్చి 31వ తేదీన ముగియనుండడంతో తదుపరి భద్రతా బలగాలు ఎలా వ్యవహరిస్తాయనే దానిపై ఆసక్తికరంగా మారింది. విశ్వసనీయ సమాచారం మేరకు కగార్ మరికొంత కాలం కొనసా గే వీలుందని తెలిసింది.

మార్చి 31వ తేదీ నాటికి దేశంలో మావోయిస్టులను లేకుండా చేస్తామని ప్రకటించిన కేంద్రం అందుకు అనుగుణంగా నక్సల్స్‌కు పట్టున్న ఛత్తీస్‌ఘ డ్ అటవీ ప్రాంతంలో వేల సంఖ్యలో భద్రతా బలగాలను మొహరించడం తెలిసిందే. పోలీసుల ఒత్తిడి ఫలించడంతో వందల సంఖ్యలో నక్సలైట్లు ఛత్తీస్‌ఘడ్‌తో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలుగు రాష్ట్రాల్లో లొంగిపోవడం, ఇది ఇంకా కొనసాగుతుండడం విదితమే. దీంతో పాటు ఛత్తీస్‌ఘడ్ లో ఇప్పటికీ ఎన్‌కౌంటర్లు జరుగుతూనే వున్నాయి. పోలీసులకు టార్గెట్‌గా వున్న ముఖ్య నేతల్లో హిడ్మా సహా పలువురు ఎన్‌కౌంటర్‌లో చనిపోగా మ ల్లోజుల, దేవా, పాపారావు సహా కీలక నేతలు అనేక మంది లొంగిపోయారు. లొంగిపోయిన నక్సలైట్ల సహకారంతో అజ్ఞాతంలో వున్న నక్సలైట్లతో పోలీసులు సంప్రదింపులు జరిపి వారిని కూడా లొంగిపోయేలా చేయడంలో చాలా వరకు సఫలమయ్యారు. ఇక తాజా విషయానికి నక్సల్స్ ఏరివే తకు మంగళవారం చివరి రోజు అవడంతో నక్సలైట్ల ప్రభావం వున్న ఛత్తీస్‌ఘడ్‌లో ఉత్కంఠ నెలకొంది. ఇదిలావుండగా ఆపరేషన్ కగార్ గడువు మంగళవారంతో ముగియనుండడంతో మావోయిస్టు అగ్రనేత గణపతి ఆయన సతీమణి రత్నా భాయి స హా మరో అగ్రనేత పుసునూరి నరహరి అలియాస్ సంతోష్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కమ్యూనికేషన్స్ విభాగం ఇంఛార్జి వర్త శేఖర్ అలి యాస్ మంగ్తు, మావోయిస్టు విద్యా విభాగం సభ్యురాలిగా వున్న నక్క సుశీల అలియాస్ రేలా, మరో నాయకురాలు రంగ బోయిన భాగ్య అలియాస్ రూపిల ఆచూకీ కోసం తెలంగాణ పోలీసులు తమకున్న సమాచారంతో గాలింపు చేబట్టారు. వీరంతా ఛత్తీస్‌ఘడ్‌లో వున్నారని వార్తలు వస్తున్నా దీనిపై ఆ రాష్ట్ర పోలీసులు స్పందించడం లేదు. ఇక గణపతి లొంగిపోనున్నారని రెండు నెలలుగా వార్తలు వస్తున్నా ఇది నిజం కాలేదు. గణపతి లొంగుబాటు కోసం అమెరికాలో వున్న ఆయన కుమారుడితో పాటు జగిత్యాలలో వున్న బంధువులు కూడా విజ్ఞప్తి చేసినా ప్రయోజనం కలగలేదు.

## కాళేశ్వరం పేరుతో లక్షకోట్లు వృధా

### ప్లానింగ్, డిజైన్ లోపాలే వైఫల్యానికి కారణం

### జల్‌జీవన్ నిధుల వినియోగంలో తెలంగాణ నిర్లక్ష్యం

### రాజ్యసభలో జలశక్తి మంత్రి సిఆర్‌పాటిల్

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తిశాఖమంత్రి సిఆర్ పాటిల్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం పేరుతో లక్ష కోట్ల ప్రజాధనం వృథా చేశారని స్పష్టం చేశారు. కాళేశ్వరం వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్ లోపాలే కారణమని తేల్చి చెప్పారు. ఈ మేరకు రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సోమవారం ఆయన లిఖితపూర్వక సమాధాన మిచ్చారు. కాళేశ్వం ప్రాజెక్టు లోపాలపై కేంద్ర బృందం అధ్యయనం చేస్తోందని చెప్పారు. జల్‌జీవన్ నిధుల వినియోగంలో తెలంగాణ ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. తెలంగాణ వద్ద జల్ జీవన్ మిషన్ నిధులు రూ. 873 కోట్లు ఉన్నాయని వీటిలో నుంచి ఈ మూడేళ్లలో రూ. 194 కోట్లే ఖర్చు చేశారని విమర్శించారు.

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన కింద గత మూడేళ్లలో తెలంగాణ ప్రభుత్వం నుంచి కొత్త సాగునీటి ప్రాజెక్టులకు ప్రతిపాదనలేవీ అందలేదని సీఆర్ పాటిల్ రాజ్యసభలో వెల్లడించారు. 99 ప్రాజెక్టులలో 71 పనులు చాలా కాలంగా నిలిచిపోయాయన్నారు. తెలంగాణకు చెందిన 11 ప్రాజెక్టులను పిఎంకెఎస్‌వై- ఎఐబిపి కింద చేర్చామన్నారు. కేంద్ర సహాయంగా రూ. 1,129.80 కోట్లు కేటాయించామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులకు మొత్తం రూ. 981.49 కోట్ల కేంద్ర సహాయం అందించిందని వెల్లడించారు.

## రూ. 7,590 కోట్లతో 1,835 కి. మీ రోడ్ల పనులు

### బుల్లెట్ ట్రైన్స్ కోసం సెంటర్ పాయింట్‌గా భారత్ ఫ్యూచర్ సిటీ

### శంషాబాద్ దగ్గరలో 500 ఎకరాలు ప్రభుత్వం కేటాయింపు

### అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్,మార్చి 30,ప్రభాతవార్త:** తెలంగాణలో రోడ్లను అభివృద్ధి పరచడానికి రూ. 7,590 కోట్లతో 1,835 కి. మీ రోడ్ల పనులు చేపట్టడం జరుగుతోపాటు,76 భారీ వంతెనల నిర్మాణం చేస్తామనీ ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ రూ. 13,051 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. గత 27 నెలలో 595 కి.మీ రోడ్లు, 51 వంతెనలు పూర్తి (రూ. 1,035 కోట్లు), తాజాగా మరో 323 కి.మీ రోడ్లు, 16 వంతెనలు పూర్తి (రూ. 485 కోట్లు) ఏప్రిల్‌నెలలో పూర్తికాబోతున్నాయని తెలిపారు.రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి కోసం హైబ్రిడ్ అన్యూటి మోడల్ అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ విధానం కింద 12,000 కి.మీ రోడ్ల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఫేజ్1లో 6,092 కి.మీ రోడ్లను సుమారు రూ. 13,006 కోట్ల వ్యయంతో 30 నెలల్లో నిర్మాణం, 15 సంవత్సరాల నిర్వహణ ఉంటుందని వివరించారు. ఈ విధానం ద్వారా మెరుగైన నాణ్యత, దీర్ఘకాలిక నిర్వహణ, పరిశ్రమల అభివృద్ధి మరియు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ - విజయవాడ 6లేన్ల విస్తరణ ,అమరావతి - బందరు పోర్టు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే,శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్, డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్,బుల్లెట్ ట్రైన్ కారిడార్లు(చెన్నై, పూణే, బెంగళూర్) లాంటి నగరాలను కలుపుతూ హై స్పీడ్ బుల్లెట్ ట్రైన్ కారిడార్ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు.బుల్లెట్ ట్రైన్స్ కోసం సెంటర్ పాయింట్ గా భారత్ ఫ్యూచర్ సిటీలో శంషాబాద్ దగ్గరలో 500 ఎకరాలు ప్రభుత్వం కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు.. ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనం నిర్మణం జరుగుతున్నది. కొత్త హైకోర్టు భవనాల నిర్మాణం ప్రస్తుతం పిల్లర్ల దశలో ఉండగా, పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు.




# ఇక రైళ్లలో మద్యం, పొగాకు ఉత్పత్తుల యాడ్స్ బంద్

## రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ

**న్యూఢిల్లీ, మార్చి 30:** రైల్వే స్టేషన్లు, రైళ్లలో ప్రయాణికులకు మెరుగైన వాతావరణాన్ని కల్పించే దిశగా కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మద్యం, పొగాకు ఉత్పత్తులు, సిగరెట్ల ప్రకటనలను రైల్వే స్టేషన్ల పరిధిలో గానీ, రైలు బోగీలపై కానీ ప్రదర్శించడాన్ని పూర్తిగా నిషేధిస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రైల్వే శాఖకు ఆదాయం కంటే ప్రజల ఆరోగ్యమే ముఖ్యమనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. అన్ని జోనల్ రైల్వే కార్యాలయాలు ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, తక్షణమే ఇటువంటి ప్రకటనలను తొలగించాలని రైల్వేశాఖ సూచించింది. రైల్వే శాఖకు ఇలాంటి వాణిజ్య ప్రకటనల ద్వారా ఏటా వందల కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతోంది. ఆదాయం కన్నా ప్రజా ఆరోగ్యానికి హాని కలిగించే, చట్టపరంగా అభ్యంతరకరంగా ఉన్న వస్తువుల ప్రచారాన్ని అరికట్టడం కోసం ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు రైల్వేశాఖ సూచించింది. ఇక నుంచి సిగరెట్లు, బీడీలు, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులతో పాటూ అన్నిరకాల మద్యపాన బ్రాండ్ల యాడ్స్ రైల్వే స్టేషన్‌ల లోని డిజిటల్ స్క్రీన్లు, హోర్డింగ్స్‌పై కనిపించవు. అయితే, ఈ నిషేధం కేవలం ప్రత్యక్ష ప్రకటనలకే మాత్రమే కాకుండా పరోక్షంగా ప్రదర్శించే సర్రోగేట్ అడ్వర్టైజింగ్‌పై కూడా ఉంటుందని రైల్వే శాఖ పేర్కొంది. రోజూ లక్షల మంది రైళ్లలో ప్రయాణం కొనసాగిస్తుంటారు. రైల్వే ప్రాంగణంలో హానికరమైన అలవాట్లను ప్రేరేపించే ఫొటోలు, వీడియోల ప్రదర్శన వల్ల వారిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని రైల్వేశాఖ అభిప్రాయపడింది. పొగాకు, గుట్కా వాడకం వల్ల రైల్వే ఫ్లాట్‌ఫామ్స్, రైళ్లలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుందని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. కొత్త రూల్స్‌ని ఉల్లంఘించే సదరు అడ్వర్టైజింగ్ ఏజెన్సీలపై రైల్వేశాఖ కఠిన చర్యలు తీసుకోనుంది. భారీ జరిమానాలు విధించడమే కాదు, ఆ ఏజెన్సీల కాంట్రాక్టులను రద్దు చేసే అధికారం జోనల్ అధికారులకు ఉంటుంది.

# శ్రీశైలంలో ఏపి అక్రమ నీటివినియోగం

## మంత్రి జూపల్లి నేతృత్వంలో నేడు డ్యామ్ వద్ద పాలమూరు ప్రజాప్రతినిధుల ధర్నా

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** శ్రీశైలం డ్యామ్ నుండి కేటాయింపులకు మించి నీటి వినియోగం చేపడుతున్న ఏపీ ప్రభుత్వ తీరుపై తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా మండిపడుతోంది. శ్రీశైలం లెఫ్ట్ పవర్ హౌస్ నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలని పలుమార్లు కోరినా ఏపీ ప్రభుత్వం కొనసాగిస్తూనే ఉందని తెలంగాణ నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుదుత్పత్తి కారణంగా శ్రీశైలంలో నీటి మట్టం తగ్గిపోతుండటంతో కల్వకుర్తి ఎత్తిపోతల పథకంపై తీవ్ర ప్రభావం పడుతోందని నీటిపారుదలశాఖ చెబుతోంది. ఏపి వైఖరి కారణంగా ప్రస్తుతం రిజర్వాయర్‌లో డెడ్‌స్టోరేజికి నీటిమట్టం పడిపోయిం దని, ఫలితంగా యాసంగి పంటలకు నీటి కొరత ఏర్పడే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈవిషయమై విద్యుదుత్పత్తిని నిలిపివేయాలని వారం రోజుల క్రితమే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా ఫోన్ చేసి విషయాన్ని తెలిపినా ఏపీ ప్రభుత్వం తన తీరు మార్చుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా.. ఏపి ప్రభుత్వ వైఖరిపై పాలమూరు ఎమ్మెల్యేలు ఛలో శ్రీశైలం కార్యక్రమానికి పిలుపు నిచ్చారు. శ్రీశైలం జలాల వినియోగంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై పాలమూరు ప్రజాప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో సుమారు 200 వాహనాల్లో శ్రీశైలం డ్యామ్ వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించనున్నారు.

# ఎప్‌సెట్‌కు 2,60,427 దరఖాస్తులు

## ఏప్రిల్ 4 వరకు దరఖాస్తు గడువు

## అపరాధ రుసుంతో మే 2 వరకు అవకాశం

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఈఏపి(ఎప్) సెట్-2026కి సంబంధించి ఇప్పటి వరకు 2,60,427 దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 4 వరకు అపరాధ రుసుం లేకుండా అవకాశం ఉందని ఎప్ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ కె విజయ్‌కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఇంజనీరింగ్‌కి 1,84,027 దరఖాస్తులు రాగా, అగ్రికల్చర్, ఫార్మసీకి 76,162 దరఖాస్తులు, రెండింటికి కలిపి 238 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఫిబ్రవరి 14న నోటిఫికేషన్ జారీ చేయగా.. ఫిబ్రవరి 19 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించడం ప్రారంభించారు. ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులను ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను స్వీకరించనున్నారు. అపరాధ రుసుం రూ. 10వేలతో పరీక్షకు రెండు రోజుల ముందు వరకు అనగా.. మే 2 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ. 500 కాగా.. ఇతరులకు రూ. 900గా నిర్ణయించారు. రెండు పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ. 1000 కాగా, ఇతరులకు రూ. 1800గా నిర్ణయించారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. రూ. 250 అపరాధ రుసుంతో ఏప్రిల్ 10 వరకు, రూ. 500తో ఏప్రిల్ 15 వరకు, రూ. 2500తో ఏప్రిల్ 20 వరకు, రూ. 5000 అపరాధ రుసుంతో ఏప్రిల్ 24 వరకు స్వీకరించనుండగా.. అపరాధ రుసుం రూ. 10వేలతో మే 2 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. అగ్రికల్చర్ పరీక్షలను మే 4, 5 తేదిల్లో నిర్వహించనుండగా.. మే 9 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ పరీక్షలను నిర్వహించనున్నారు.

# కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు పిటిషన్లపై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 30:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేపట్టిన మిలియన్ మార్చ్ సందర్భంగా నమోదైన పాత కేసుల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ కేసులను కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు సోమవారం విచారణ జరిపింది. 2011లో ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన మిలియన్ మార్చ్ సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు తాము శాంతియుతంగా నిరసన తెలిపామని, అయితే అప్పటి ప్రభుత్వం రాజకీయ కారణాలతో తమపై అక్రమ కేసులు నమోదు చేసిందని నిందితుల తరపు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. దశాబ్ద కాలం గడిచినా ఈ కేసుల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వీటిని తక్షణమే కొట్టివేయాలని వారు న్యాయస్థానాన్ని కోరారు.దీనిపై పూర్తి వివరాలతో కూడిన కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత పోలీసు అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అప్పటి ఘటనలకు సంబంధించిన ఎఫ్ఐఆర్ వివరాలు, ప్రస్తుత కేసు స్థితిగతులను నివేదిక రూపంలో సమర్పించాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ఏప్రిల్ 9కి వాయిదా వేసింది.

# గణపతి సహా అజ్ఞాత మావోయిస్టులు జనజీవనంలోకి రావాలి

## డిజిపి శివధర్‌రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** మావోయిస్టుల ఏరివేతకు కేంద్రం విధించిన డెడ్‌లైన్ మంగళవారంతో ముగుస్తుండడంతో అజ్ఞాతంలో ఉన్న వారిని జనజీవన స్రవంతిలోకి వచ్చేలా చేసేందుకు పోలీసు శాఖ మరో ప్రయత్నం చేబట్టింది. అనారోగ్యంతో బాధపడుతూ అజ్ఞాతంలో ఉన్న అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి సహా తెలంగాణకు చెందిన మరో ఐదుగురు ముఖ్యనేతలు వెంటనే లొంగిపోవాలని డిజిపి శివధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు పోలీసుల కృషి వల్ల ఇప్పటి వరకు 721 మంది నక్సలైట్లు లొంగిపోయి వారి కుటుంబాలతో సొంత గ్రామాలలో గౌరవంగా జీవిస్తున్నారని డిజిపి తెలిపారు. వీరికి సర్కారు పునరావాసం కల్పించిందని ఆయన తెలిపారు.

అజ్ఞాతంలో వున్న వారిలో తెలంగాణకు చెందిన గణపతితోపాటు జార్ఖండ్‌లో పనిచేస్తున్న అగ్రనేత పుసునూరి నరహరి అలియాస్ సంతోష్ (57), దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కమ్యూనికేషన్స్ విభాగం ఇన్‌ఛార్జి వర్త శేఖర్ అలియాస్ మంగ్తు (51), ఇదే విభాగంలో సభ్యురాలుగా వున్న గణపతి సతీమణి జోడెరత్న భాయి అలియాస్ సుజాత (68), మావోయిస్టు విద్యావిభాగం సభ్యురాలిగా వున్న నక్క సుశీల అలియాస్ రేలా (51), మరో నాయ కురాలు రంగబోయిన భాగ్య అలియాస్ రూపి (43) కీలక నేతలుగా ఉన్నారని డిజిపి తెలిపారు. ప్రభుత్వ పిలుపు మేరకు గణపతి లొంగిపోతే ఆయనకు సర్కారు సొంత ఖర్చులతో మెరుగైన వైద్యం అందిస్తుందని డిజిపి శివధర్‌రెడ్డి హామీ ఇచ్చారు.

మావోయిస్టుల కుటుంబీకులు అజ్ఞాతంలోవున్న తమవారిని జనజీవన స్రవంతిలో కలిసేలా కృషి చేయాలని ఆయన కోరారు. జనజీవన స్రవంతిలో కలిసే నక్సలైట్లకు సర్కారు అన్ని విధాల ఆదుకుంటుందని డిజిపి తెలిపారు.

# మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయండి

## గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించిన బిఆర్ఎస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 30:** తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై అక్రమ మైనింగ్, భూ కబ్జా ఆరోపణలు ఉన్నాయని, ఆయన్ను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం సోమవారం గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసి వినతిపత్రం సమర్పించారు. మంత్రికి సంబంధించిన అక్రమ మైనింగ్, భూ కబ్జాలపై ఆధారాలను గవర్నర్‌కు సమర్పించినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. మంత్రికి సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ ఆరోపించింది. జంట జలాశయాల పరిరక్షణ ప్రాంతాల్లో సైతం మైనింగ్ చేస్తోందని, దీనికి సంబంధించి కనీస అనుమతులు కూడా తీసుకోలేదని పేర్కొంది. ఈ అక్రమాల వల్ల ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో వివరించింది. ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తే, తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సస్పెండ్ చేశారే తప్ప ప్రభుత్వం స్పందించలేదని నేతలు అన్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు నోటీసులు ఇచ్చినట్లు ప్రభుత్వం సభలో అంగీకరించడమే అక్రమాలకు నిదర్శనమని వారు వెల్లడించారు.



గవర్నర్‌తో భేటీ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ వ్యవహారంపై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వద్దే హోం శాఖ ఉన్నందున సీఐడీ వంటి రాష్ట్ర ఏజెన్సీలపై తమకు నమ్మకం లేదన్నారు. పొంగులేటి మంత్రిగా కొనసాగితే విచారణను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని, కాబట్టి ఆయన్ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని కోరారు. అవినీతి ఆరోపణలపై విచారణ జరిపిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. దమ్ముంటే పొంగులేటి వ్యవహారంతో పాటు అమృత్ స్కామ్, ఫోన్ ట్యాపింగ్, సింగరేణి అక్రమాలపై కూడా విచారణకు ఆదేశించాలని సవాల్ విసిరారు. ఈ విషయంలో బీజేపీ మౌనంగా ఉండటాన్ని కూడా ఆయన విమర్శించారు.

# మద్యం మత్తులో విద్యార్థులపై కామాటి ప్రతాపం

## జగిత్యాల ఎస్టీ హాస్టల్‌లో ఘటన

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త:** వసతి గృహంలోని కామాటి మద్యం మత్తులో దండించడంతో విద్యార్థులు తీవ్ర నరకయాతన పడుతున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్టీ గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్‌లో అత్యంత అమానుష ఘటన వెలుగుచూసింది. హాస్టల్‌లో కూరగాయలు కోసే వ్యక్తి (కామాటి)గా పనిచేస్తున్న శ్రీనివాస్ విద్యార్థులను చీపురుతో దారుణంగా చితక బాదాడు. నిందితుడు శ్రీనివాస్ నాలుగు నెలలుగా విద్యార్థులను మానసిక, శారీరక వేధిం పులకు గురిచేస్తున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు పలుమార్లు ఈ వేధింపులపై తాము హాస్టల్ అధికారులకు, వార్డెన్‌కు ఫిర్యాదుచేసినా స్పందించలేదని ఆరోపిస్తున్నారు.

**AMARAVATI GROWTH AND INFRASTRUCTURE CORPORATION LTD**
Project Office, Rayapudi, Amaravati, Guntur Dist., AP-522237.

**EMPLOYMENT NOTIFICATION No.5/2026, Dt. 30.03.2026**

Notification is hereby issued for engagement of services in AGICL, Amaravati on Deputation/ Contract basis. Online application is available in the AGICL & APCRDA websites in careers tab and can be submitted from **31.03.2026 to 14.04.2026.** For further details pls visit https://agicl.org & https://crda.ap.gov.in.

| S.No. | Name of the post | No's of Posts |
|---|---|---|
| 1 | Chief Engineer (Electrical) | 1 |
| 2 | Superintending Engineer (Electrical) | 1 |
| 3 | Executive Engineer (Electrical) | 2 |
| 4 | Executive Engineer (Mechanical) | 1 |

Sd/- Managing Director, AGICL, Amaravati

గౌరవనీయ వాణిజ్య అప్పీలేట్ న్యాయస్థానం
చిరాంగ్, కాజల్‌గావ్ వద్ద
నిర్ణయించబడిన తేది: 06-04-2026
షోకాజ్‌కు నోటీసు
**Misc. (J) కేసు నం: 06 / 2026**
[Misc. అప్పీల్ నం. .......... ./2026 నుండి ఉత్పన్నమైనది]
[Misc. మధ్యవర్తిత్వ నం. 02/2020కి సంబంధించినది]
**పిటిషనర్-అప్పీలెంట్:-** ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్,
[బొంగైగావ్ రిఫైనరీ]
-Vs-
**ప్రతిపక్షం-ప్రతివాది:-** M/S ECI ఇంజనీరింగ్ & కన్‌స్ట్రక్షన్ కో. లిమిటెడ్.

వీరికి,
1. M/S ECI ఇంజనీరింగ్ & కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్,
రిజిస్టర్డ్ కార్యాలయం: ప్లాట్ నం. A-12 & 13,
పంచవటి టౌన్‌షిప్, మణికొండ, రాజేంద్రనగర్
మండలం (R.R. జిల్లా), హైదరాబాద్, తెలంగాణ, పిన్-500089.
2. M/S ECI ఇంజనీరింగ్ & కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్,
రిజిస్టర్డ్ కార్యాలయం: ప్లాట్ నం. 70, 3వ అంతస్తు,
అంశు కలర్స్, రోడ్ నం. 1, జూబ్లీ హిల్స్, హైదరాబాద్,
తెలంగాణ, పిన్-500033.

విషయం ఏమనగా, చిరాంగ్ కాజల్‌గావ్‌లోని వాణిజ్య న్యాయస్థానం-కం-సివిల్ న్యాయమూర్తి (సీనియర్ విభాగం) అయిన శ్రీమతి సయేదా సబీనా అఫ్జల్ జిన్నత్ గారు, Misc. మధ్యవర్తిత్వ నం. 02/2020లో తేది 04.06.2025న వెలువరించిన తీర్పు మరియు ఉత్తర్వులకు వ్యతిరేకంగా, పిటిషనర్-అప్పీలెంట్ ఈ అప్పీలును దాఖలు చేశారు. ఈ అప్పీలు దాఖలు చేయడంలో జరిగిన జాప్యాన్ని మన్నించవలసిందిగా కోరుతూ, పరిమితి చట్టంలోని సెక్షన్ 5తో కలిపి చదవాల్సిన ఆర్డర్ 41 రూల్ 3-A మరియు CPC లోని సెక్షన్ 151ల క్రింద ఒక పిటిషన్‌ను కూడా దీనితో పాటు దాఖలు చేసారు.

మీరు, వ్యతిరేక పక్షం... ప్రతివాదులైన మీరు, **06 ఏప్రిల్, 2026వ తేదీన ఉ.10.00 గం.లకు** ఈ కోర్టు ఎదుట స్వయంగా మరియు/లేదా మీరు నియమించిన న్యాయవాది/ప్లీడర్ ద్వారా హాజరు కావాలని, మరియు అప్పీలు దాఖలు చేయడంలో జరిగిన ఆలస్యాన్ని మన్నించమని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఎందుకు అనుమతించకూడదో కారణాలు చూపుతూ, ఏవైనా ఉంటే మీ వ్రాతపూర్వక అభ్యంతరాన్ని సమర్పించాలని ఇందుమూలంగా ఆదేశించడమైనది.

పైన పేర్కొన్న రోజు మరియు సమయంలో మీ తరఫున మీరు గానీ/మీ ప్లీడర్/న్యాయవాది గానీ హాజరు కాకుండా, ఏవైనా ఉంటే మీ వ్రాతపూర్వక అభ్యంతరాన్ని సమర్పించని పక్షంలో, ఈ విషయం ఏకపక్షంగా విచారించబడి, మీ గైర్హాజరీలోనే నిర్ణయించబడుతుందని గమనించగలరు.

**నా స్వహస్త మరియు కోర్టు ముద్రతో, ఈ 17వ మార్చి, 2026 తేదీన ఇవ్వబడినది.**

న్యాయమూర్తి, వాణిజ్య అప్పీలేట్
కోర్టు-కమ్-జిల్లా న్యాయమూర్తి, చిరాంగ్
ఆదేశానుసారం
**ప్రధాన పరిపాలనా అధికారి**
జిల్లా & సెషన్స్ జడ్జి కార్యాలయం
చిరాంగ్, కాజల్‌గావ్

# రోహిత్ సహా ముగ్గురు నిందితుల రెండో దఫా కస్టడీపై తీర్పు రిజర్వ్

## మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్‌లోని రోహిత్ రెడ్డి ఫాం హౌస్ డ్రగ్స్ కేసు వ్యవహారంలో అరెస్టయిన ముగ్గురు వ్యక్తుల రెండవ దఫా కస్టడీ పిటిషన్‌పై రాజేంద్రనగర్ కోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. దీనిపై రాజేంద్రనగర్ కోర్టు మంగళవారం తీర్పు వెలువరించనుంది. ఈ నెల 14వ తేదీ రాత్రి మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో గల రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీని ఈగల్ పోలీసులతో పాటు చేవెళ్ల పోలీసులు రట్టు చేయడం తెలిసిందే. ఈ సందర్భంగా 11 మంది పట్టుబడగా ఇందులో రోహిత్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్, ఢిల్లీకి చెందిన నమిత్ శర్మ, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవిలు డ్రగ్స్ తీసుకున్నట్లు తేలడం విదితమే. అయితే పోలీసులు దాడిచేసిన సమయంలో రితేష్ రెడ్డికి చెందిన లైసెన్స్ రివాల్వర్‌ను నమిత్ శర్మ తీసుకుని పోలీసులను భయపెట్టేందు కు గాలిలో నాలుగు రౌండ్లు కాల్పులు జరపడం సంచలనం రేపింది. పోలీసులపై కాల్పులు జరపాలని రోహిత్ రెడ్డి పురిగొల్పినట్లు వెల్లడయ్యింది. దీంతో రోహిత్ రెడ్డి తన ఫాం హౌస్‌లో అసాంఘీక కార్యకలాపాలకు స్థానం కల్పించినందుకు, తన లైసెన్స్ రివ్వార్‌ను మరో వ్యక్తికి ఇచ్చినందుకు రితేష్ రెడ్డిని, మరొకరి రివాల్వర్ చేత పోలీసులపై కాల్పులు జరిపినందుకు నమిత్ శర్మను పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్ సేవించిన ఎంపి మహేష్ కుమార్ యాదవ్ సహా అందరికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. కాగా పోలీసులు అరెస్టు చేసిన రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలు ప్రస్తుతం చంచల్‌గూడ జైల్లో వుండగా చేవెళ్ల పోలీసులు గత వారం మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఈ సందర్భంగా ముఖ్యమైన సమాచారం ఏదీ వీరు వెల్లడించక పోవడంతో మరోదఫా కస్టడీ కోరాలని నిర్ణయించడం తెలిసిందే. వీరిపై డ్రగ్స్ వాడడం, అక్రమం గా మాదకద్రవ్యా లు కలిగి వుండడంతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కాగా ఈ కేసులో రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలను మరింతగా విచారించేందుకు రెండవ దఫాగా ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని మొయినాబాద్ పోలీసులు రాజేంద్రనగర్‌లో దాఖలు చేసిన పిటిషన్‌పై రాజేంద్రనగర్ కోర్టులో సోమవారం వాదనలు ముగిశాయి. దీనిపై తీర్పు రిజర్వ్ చేసిన కోర్టు మంగళవారం నాడు తన నిర్ణయాన్ని చెప్పనుంది.

# హేట్ స్పీచ్ బిల్లు ప్రజాస్వామ్య గొంతును నొక్కేందుకే: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 30:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఇది ప్రజాస్వామ్య గొంతుకను నొక్కేందుకు ప్రభుత్వం ప్రయోగిస్తున్న ఒక క్రూరమైన ఆయుధం అని ఆయన అభివర్ణించారు. వాళ్లను విమర్శించే వారి నోళ్లు మూయించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈ బిల్లు గనుక చట్టరూపం దాల్చితే, రాజ్యాంగం పౌరులకు కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య వ్యవస్థ మూలాలకే పెను ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు, సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినా, దానికోసం తీసుకొస్తున్న ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని కేటీఆర్ విమర్శించారు. ఈ బిల్లు రూపకల్పనను పరిశీలిస్తే, అమలు యంత్రాంగం వాస్తవ ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఉంది. ఇది కచ్చితంగా అధికార దుర్వినియోగానికి దారితీస్తుంది అని ఆయన పేర్కొన్నారు. బిల్లులో పొందుపరిచిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం', 'సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు స్పష్టమైన న్యాయ నిర్వచనం, పరిమితులు లేవని ఆయన ఎత్తిచూపారు. ఈ పదజాలం ఉద్దేశపూర్వకంగానే అస్పష్టంగా ఉంచారని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఇలా చేశారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలను విమర్శిస్తే, వాటిని ఫేక్ న్యూస్‌గా ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం ఉందని కేటీఆర్ హెచ్చరించారు. ఇప్పటికే దేశంలో విద్వేష ప్రసంగాలను అరికట్టేందుకు ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) వంటి చట్టాలు బలంగా ఉన్నాయని గుర్తుచేశారు. ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని, అణచివేత ధోరణిని విడనాడి ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని డిమాండ్ చేశారు.

# అమెరికా విమానాలకు స్పెయిన్ గగనతలం మూసివేత



**మాడ్రిడ్, మార్చి 30:** ఇరాన్‌పై దాడులలో పాల్గొంటున్న అమెరికా యుద్ధ విమానాల కోసం తమ దేశం గగనతలాన్ని మూసివేసినట్లు స్పెయిన్ రక్షణ మంత్రి మార్గరీటా రోబెల్స్ ప్రకటించారు. ఇరుదేశాలు సంయుక్తంగా నిర్వహిస్తోన్న సైనిక స్థావరాలను పశ్చిమాసియా ఘర్షణల కోసం వినియోగించడాన్ని ఇప్పటికే స్పెయిన్ నిరాకరిం చింది. తాజాగా, గగనతలాన్ని మూసి వేస్తున్నట్లు ప్రకటించింది. ఇరాన్‌తో యుద్ధానికి సంబంధించిన చర్యల కోసం సైనిక స్థావరాల వినియోగం లేదా గగనతల వినియోగానికి తాము అనుమతిచ్చేది లేదని స్పష్టం చేశారు. ఏకపక్షంగా, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా ప్రారంభించిన యుద్ధంలో సహకరించకూడదని తమ ప్రభుత్వం నిర్ణయించుకుందని అన్నారు. కాగా, అమెరికా, ఇజ్రాయెల్ చేస్తోన్న యుద్ధాన్ని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నారు. ఇరాన్‌పై దాడులు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని ఆయన చెబుతున్నారు.

గౌరవనీయ వాణిజ్య అప్పీలేట్ న్యాయస్థానం
చిరాంగ్, కాజల్‌గావ్ వద్ద
నిర్ణయించబడిన తేది: 06-04-2026
షోకాజ్‌కు నోటీసు
**Misc. (J) కేసు నం: 05 / 2026**
[Misc. అప్పీల్ నం. .......... ./2026 నుండి ఉత్పన్నమైనది]
[Misc. మధ్యవర్తిత్వ సంఖ్య 01/2020కి సంబంధించినది]
**పిటిషనర్-అప్పీలెంట్:-** ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్,
[బొంగైగావ్ రిఫైనరీ]
-Vs-
**ప్రతిపక్షం-ప్రతివాది:-** M/S ECI ఇంజనీరింగ్ & కన్‌స్ట్రక్షన్ కో. లిమిటెడ్.

వీరికి,
1. M/S ECI ఇంజనీరింగ్ & కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్,
రిజిస్టర్డ్ కార్యాలయం: ప్లాట్ నం. A-12 & 13,
పంచవటి టౌన్‌షిప్, మణికొండ, రాజేంద్రనగర్
మండలం (R.R. జిల్లా), హైదరాబాద్, తెలంగాణ, పిన్-500089.
2. M/S ECI ఇంజనీరింగ్ & కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్,
రిజిస్టర్డ్ కార్యాలయం: ప్లాట్ నం. 70, 3వ అంతస్తు,
అంశు కలర్స్, రోడ్ నం. 1, జూబ్లీ హిల్స్, హైదరాబాద్,
తెలంగాణ, పిన్-500033.

విషయం ఏమనగా, Misc. మధ్యవర్తిత్వ నం 01/2020లో, శ్రీమతి సయేదా సబీనా అఫ్జల్ జిన్నత్, గౌరవ న్యాయమూర్తి, వాణిజ్య న్యాయస్థానం-కమ్-సివిల్ న్యాయమూర్తి (సీనియర్ డివిజన్), చిరాంగ్ కాజల్‌గావ్ వారిచే తేది 04.06.2025న వెలువరించబడి (సవరణలు మరియు దిద్దుబాట్ల అనంతరం తేది 02.07.2025న తుది తీర్పుగా ప్రకటించబడిన) తీర్పు మరియు ఉత్తర్వులకు వ్యతిరేకంగా పిటిషనర్-అప్పీలెంట్ ఒక అప్పీల్‌ను దాఖలు చేశారు.

ఈ అప్పీల్ దాఖలు చేయడంలో జరిగిన జాప్యాన్ని మన్నించమని కోరుతూ, పరిమితి చట్టంలోని సెక్షన్ 5తో కలిపి చదవాల్సిన సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 151 మరియు ఆర్డర్ 41 రూల్ 3-A కింద ఒక పిటిషన్‌ను కూడా దీనితో పాటు దాఖలు చేశారు.

మీరు, వ్యతిరేక పక్షం... ప్రతివాదులైన మీరు, **06 ఏప్రిల్, 2026వ తేదీన ఉ.10.00 గం.లకు** ఈ కోర్టు ఎదుట స్వయంగా మరియు/లేదా మీరు నియమించిన న్యాయవాది/ప్లీడర్ ద్వారా హాజరు కావాలని, మరియు అప్పీలు దాఖలు చేయడంలో జరిగిన ఆలస్యాన్ని మన్నించమని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఎందుకు అనుమతించకూడదో కారణాలు చూపుతూ, ఏవైనా ఉంటే మీ వ్రాతపూర్వక అభ్యంతరాన్ని సమర్పించాలని ఇందుమూలంగా ఆదేశించడమైనది.

పైన పేర్కొన్న రోజు మరియు సమయంలో మీ తరఫున మీరు గానీ/మీ ప్లీడర్/న్యాయవాది గానీ హాజరు కాకుండా, ఏవైనా ఉంటే మీ వ్రాతపూర్వక అభ్యంతరాన్ని సమర్పించని పక్షంలో, ఈ విషయం ఏకపక్షంగా విచారించబడి, మీ గైర్హాజరీలోనే నిర్ణయించబడుతుందని గమనించగలరు.

**నా స్వహస్త మరియు కోర్టు ముద్రతో, ఈ 17వ మార్చి, 2026 తేదీన ఇవ్వబడినది.**

న్యాయమూర్తి, వాణిజ్య అప్పీలేట్
కోర్టు-కమ్-జిల్లా న్యాయమూర్తి, చిరాంగ్
ఆదేశానుసారం
**ప్రధాన పరిపాలనా అధికారి**
జిల్లా & సెషన్స్ జడ్జి కార్యాలయం
చిరాంగ్, కాజల్‌గావ్

# లైబ్రరీ సెస్సు రూ.324.96 కోట్లు తక్కువ వసూలు

## శాసనసభలో కాగ్ నివేదికను ప్రవేశపెట్టిన ప్రభుత్వం

## పట్టణ, స్థానిక సంస్థల నిర్వహణపై సమీక్ష

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పట్టణ, స్థానిక సంస్థలు రూ.234.96 కోట్ల మేర లైబ్రరీ సెస్సును తక్కువ వసూలు చేయడంతో గ్రంథాలయ సంస్థలకు నిధులు సమకూర్చాలనే ఉద్దేశం నెరవేరలేదని కాగ్ అభిశంసించింది. కాగ్ నివేదికను ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టింది. భవననిర్మాణ అనుమతులు మంజూరు చేసేప్పుడు పర్యావరణ ప్రభావ రుసుము విధించడం, సేకరణపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని అక్షింతలు వేసింది. ఒక్క హైదరాబాద్ మహా నగరంలోనే పర్యావరణ ప్రభావిత రుసుము సంబంధించి రూ.2.29 కోట్లు కోల్పోయిందని సూచించింది.

మార్చి 2022తో ముగిసిన యేడాదికి సంబంధించి సామాజిక, ఆర్థిక, సాధారణ రంగాలు, భవన నిర్మాణరంగ కార్మికుల సంక్షేమంపై కాగ్ నివేదికను ప్రవేశపెట్టింది. ప్రభుత్వ నిర్వహణ లోపంతో రూ.కోట్ల నష్టం వచ్చిందని కాగ్ రిపోర్టు ఇచ్చింది.

2019-20, 2020-21 బడ్జెట్ సక్ర మంగా లేదని, 2021-22 బడ్జెట్ నిధుల కేటాయింపు, రాబడుల మధ్య 53 శాతం వ్యత్యాసం ఉందని కాగ్ తన రిపోర్టులో పేర్కొంది. బ్యాంకు లతో సమన్వయం, పర్యవేక్షణ లోపంతో ప్రజాధనం వృథా అయ్యిం దన్న కాగ్, 2023 నాటికి చెక్కులు, డ్రాఫ్టులు జమ చేయనందున రూ.52 కోట్ల నష్టం వాటిల్లిందని స్పష్టం చేసింది. స్వచ్ఛభారత్ నిధు లు 37 శాతం వినియోగించకుండా నిర్లక్ష్యం చేశారనికాగ్ అభిశంసించింది. మునిస్సిపల్ వ్యర్థాల విద్యుత్ తయారీ పర్యావరణ అనుమతుల ప్రకారం మూలధన వ్యయం సంత్సరానికి 34 కోట్ల, పునరావృత వ్యయంతో పర్యావరణ రక్షణకు ప్రత్యేకనిధిని ఏర్పాటు చేయడంలో విఫలమైందని పేర్కొన్నారు. మున్సిపల్ ఘన వ్యర్థాలను వేరుచేయడం సేకరణచేయడం తరలించడం లక్ష్యాన్ని చేరలేదని 313.20 కోట్ల మాత్రం జిహెచ్ఎంసి రాయితీ కోసం చెల్లించిందని ఎత్తిచూపింది. నిర్మాణాల కూల్చివేతల వ్యర్థాల నిర్వహణ సరిగాలేదని పేర్కొంది జీడిమెట్లలో 3,51,186 మెట్రిక్ టన్నులు, ఫతుల్లా గూడ కేంద్రంలో 7,11,300 మె.ట. కూల్చివేత వ్యర్థాలు పేరుకు పోయాయని పేర్కొంది.

వార్త

నీ అంతరాత్మ ప్రబోధం నీవు పాటిస్తే
నీకు స్వయం క్రమశిక్షణ ఉన్నట్టు లెక్క

- రోజర్

# వార్ధక్యానికి వరమౌనా?


భక్తితో కానీ భయంతో గానీ తమ బిడ్డలు వార్ధక్యంలో తమను చూసుకుంటారని ఎదురు చూసే తల్లిదండ్రులకు ఇప్పుడు నిరాశే మిగులుతోంది. వారి జీవన పరిస్థితులు భయంకర స్వప్నంలా మిగిలిపోతున్నాయి. అవసాన దశ అతి దుర్భరంగా మారుతోంది. ఇదేదో 'తరం మార్పు' తకరారుగా సరిపెట్టుకోలేము. అడ్డాల నాడు బిడ్డలు కానీ గెడ్డాలొచ్చాక బిడ్డలా? అనే లోకోక్తి ఆధునిక కాలానికి తగినట్లుగానే ఉంది. కొడుకులు తన బాధ్యతకు వదులుకుని వెళ్ళిపోతున్నారు. సమాజానికి వెరవడం లేదు. ఎవరెలా పోతే నాకేం? అనే ధోరణికి మారిపోతున్నారు. మానవ సంబంధాలు మృగ్యమైపోతున్నాయి. మళ్ళీ ఏదో ఒక నాటికి మనమూ వార్ధక్యాన్ని ఎదుర్కొంటామన్న ధ్యాసే లేదు. ఇలాంటి పరిస్థితుల్లో వృద్ధాప్యాన్ని జయించడమెలాగో చెబుతూనే కేంద్ర ప్రభుత్వం వృద్ధుల కోసం 2007లో కొన్ని చట్టాలు చేసింది. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఒక విన్నూత్నఆలోచనతో వృద్ధుల్ని రోడ్ మీద పడకుండా చేయగలిగే ఒక చట్టాన్ని ప్రతిపాదించడం విశేషం. మధ్య వయసులోనే తమకున్న ఆస్తుల్ని బిడ్డలకు బదిలీ చేసి వార్ధక్యం మీదపడి కాళ్లు లాగే సమయానికి చేయూతనిచ్చే కొడుకులు కనీస ఇంగితం మరచిపోయి తల్లితండ్రులను ఏ వృద్ధాశ్రమాల బయటో వదిలి వెళ్ళిపోతున్న ఉదంతాలు ఎన్నో వింటున్నాము. ఇలాంటి తరుణంలో కనీసం కొందరు తల్లితండ్రులకైనా ఈ చట్టం ఉపశమనం కలిగిస్తుంది. చట్టాలు చేయగానే సరికాదు. వాటిని అమలులో ఆచరణలో చిత్తశుద్ధితో వ్యవహరించగల యంత్రాంగాన్ని కూడా ఏర్పరచడం మేలు. అందులో భాగంగానే ప్రభుత్వం 'వృద్ధుల సంక్షేమ కమిషన్' ఏర్పాటు చేస్తోంది. కేవలం కుటుంబ విలువల పరిరక్షణకే ఈ బిల్లును ప్రవేశపెట్టినట్లు నిండు సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సగర్వంగా ప్రకటించారు. తల్లిదండ్రుల సంరక్షణకు ఒక మంత్రదండాన్ని ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి సభాముఖంగా స్పష్టం చేశారు. సంపాదన ఉన్నా లేకున్నా కలో గంజో తాగిన ప్రతివ్యక్తి తమ తల్లిదండ్రులను బాధ్యతగా చూసుకోవాలని ఆయన ఆకాంక్ష. ఇలాంటి బిల్లు ప్రవేశపెట్టిన తొలిరాష్ట్రంబహుశా ఇదేనేమో తల్లితండ్రుల సంరక్షణ, పోషణ, పర్యవేక్షణ బిల్లు పేరిట ఈ చట్టం రూపుదిద్దుకుంటోంది. సభాసదులంతా అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానించారు. కేంద్ర ప్రభుత్వ చట్టాల మేరకు తల్లిదండ్రులకు రూ.10 వేలకు మించి ఇచ్చే అవకాశం లేదు. ఈ కారణంతో తెలంగాణలో మరికొన్ని అదనపు ప్రతిపాదనలు చేశారు. పదివేల రూపాయలు లేదా నెలవారీ వేతనం 15శాతం తల్లితండ్రుల పోషణార్థం ఇవ్వాలన్న షరతులు విధించారు. తల్లిదండ్రుల అవసరాలు చూడని వ్యక్తిని సామాజికంగా బహిష్కరించినప్పుడే సమాజంలో మార్పు తీసుకు రాగలమన్నది సభ ఏకాభిప్రాయం. ప్రైవేట్ ఉద్యోగులకు ప్రజాప్రతినిధులకు కూడావర్తిస్తుంది. అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా వయోవృద్ధులకు ఆసరాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రత్యేక చట్టం తీసుకువచ్చింది. 'తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణ, జవాబుదారీ తనం, పర్యవేక్షణ చట్టం2026'లోభాగంగా 'వయోవృద్ధుల కమిషన్'ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇందులో ఒక ప్రధాన కమిషనర్, ఇద్దరు కమిషనర్లు ఉంటారు. ఈమేరకు టీఈ ఏఎంపీఎస్ బిల్లు2026 ను శనివారం ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. తల్లిదండ్రులను పట్టించుకోకుండా వదిలేసే ఉద్యోగుల వేతనాల నుంచి గరిష్ఠంగా రూ.10 వేల మేర కోత విధించి, తల్లిదండ్రుల పోషణ నిమిత్తం వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తారు. తల్లిదండ్రుల యోగక్షేమాలను చూడడం, వారికి సేవలు చేయడం పిల్లల బాధ్యత అని, ఇది భారతీయ కుటుంబ వ్యవస్థలో ప్రధానమైన అంశమని ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుత ఆధునిక సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ బల హీనమైపోతోందని, పిల్లలు తమ తల్లిదండ్రులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చూపుతున్న ఘటనలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలోనే కుటుంబ విలువల సంరక్షణకు అవసరమైన ప్రమాణాలను రూపొందించాల్సిన ఆవశ్యకతఏర్పడింది. తల్లిదండ్రుల యోగక్షేమాలను నిర్లక్ష్యం చేస్తున్న ఉద్యోగుల్లో నైతిక బాధ్యతను చట్టాన్ని తీసుకొస్తున్నట్లు స్పష్టం చేసింది. తల్లిదండ్రుల పోషణ కోసం ఉద్యోగి నెల వారి జీతం నుంచి 15 శాతం లేదా రూ.10 వేలు ఏది తక్కువైతే దానిని మినహాయించి తల్లిదండ్రులకు చెల్లించే ఏర్పాట్లు చేయనున్న ప్రభుత్వ జవాబుదారీకిది నిదర్శనం. ఇది కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా ప్రభుత్వ రంగ కార్పొరేషన్లు, పంచాయతీరాజ్ చట్టం, మునిసిపల్ చట్టం కింద పని చేసే సిబ్బంది, ప్రైవేటు సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, సిబ్బందికి కూడా వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తేదీ నుంచి ఆరునెలల్లోపు ఆయా శాఖలు, సంస్థలుతమ ఉద్యోగులకు సంబంధించిన నియమాలను సవరించుకోవాలని సూచించింది. తమ బాగోగులను పట్టించుకోని పిల్లలపై తల్లిదండ్రులు ఇద్దరు గానీ ఒక్కరు గానీ వారి పిల్లలు పనిచేసే శాఖ విభాగాధిపతికి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఆ అధికారి 60 రోజుల్లోగా ఫిర్యాదును పరిష్కరించాలి. అక్కడ పరిష్కారం కాకపోతే తల్లిదండ్రులు 'వయోవృద్ధుల కమిషన్‌ను ఆశ్రయించాలి. ఆస్తిలో సమాన వాటాదారుగా గుర్తింపబడిన కూతుర్ల బాధ్యతలు కూడా నిర్వచించడం అవసరం. ఏదిఏమైనా ప్రస్తుత సామాజిక కట్టుబాట్లు, వాటి ఉల్లంఘన వంటి విషయాల్లో తొలి అడుగులోనే కొడుకుల బాధ్యతను గుర్తింపచేయడం విశేషం. భక్తిలేని కన్నబిడ్డలకు భయం కలిగించినా, బాధ్యత నేర్పినా ముసలి తల్లిదండ్రులకిది శ్రీరామరక్షే.

చీకటిలో ఉన్నప్పుడు తచ్చాడి
వెలుగు కోసం ప్రయత్నించాలి గాని,
ఎవరో వెలుగును ప్రసాదిస్తారని
ఉన్న చోటనే ఉండకూడదు.




జె.ముర్రే

భయం వలన పొందే
ఆధిపత్యం కన్నా అభిమానంతో
పొందే బానిసత్వం మిన్న.



మహాత్మా గాంధీ

# ప్రజావాక్కు



## సీట్లు మారితే దేశ దిశ మారుతుందా?

**భారత**రాజకీయాల్లో ఇటీవల మళ్లీ ప్రాధాన్యం పొందుతున్న అంశం లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన. జనాభా మార్పులు, ప్రాతినిధ్య సమతుల్యత, ప్రాంతీయ అసమానతల వంటి అంశాల నేపథ్యంలో ఈ చర్చ వేడెక్కుతోంది. ముఖ్యంగా దక్షిణ భారతదేశం, ఉత్తర భారత దేశం మధ్య దీనివల్ల కలిగే లాభనష్టాలపై విస్తృతమైన చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో పునర్విభజన వల్ల ఎవరికి లాభం?" అనే ప్రశ్నకు సమగ్రంగా సమాధానం ఇవ్వడంఅవసరం. భారతదేశంలో చివరిసారిగా పెద్దస్థాయిలో పునర్విభజన 1971జనాభా గణన ఆధారంగా జరిగింది. తరువాత కుటుంబనియంత్రణవిధానాలను ప్రోత్సహించేందుకు, జనాభా ఆధారంగా స్థానాల పెంపు లేదా తగ్గింపును నిలిపివేశారు. ఈ ఫ్రీజ్ వ్యవస్థను 2026 వరకు కొనసాగించారు. ఇప్పుడు ఆగడువు ముగియబోతున్న నేపథ్యంలో, తాజా జనాభా గణాంకాల ఆధారంగా సీట్ల పునర్విభజన తప్పనిసరి అవుతోంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## కల్తీ పురుగు మందులు

**వ్యవసాయ** రంగంలో కల్తీపురుగుమందుల వాడకం రైతులకు పెనుశాపంగామారింది. దేశవ్యాప్తంగా సాగు వ్యయం పెరుగుతున్న తరుణంలో, నాణ్యత లేని మరియు నకిలీ మందుల వల్లరైతులు ఆర్థికంగాభారీగా నష్టపోతున్నారు. పంటలను తెగుళ్ల నుండి రకించుకోవడానికి అధిక ధరలు వెచ్చించి మందులు కొనుగోలు చేస్తున్నప్పటికీ, అవి ఆశించిన ఫలితాలను ఇవ్వకపోగా, పంటను మరింత దెబ్బతీస్తున్నాయి. కల్తీ మందుల ప్రభావం వల్ల పంట దిగుబడి తగ్గడమే కాకుండా, భూసారం కూడా దెబ్బతింటోంది. కల్తీ పురుగు మందుల వెనుక ఉన్న అక్రమ వ్యాపారాలు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్నాయి.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

## నిబంధనలను పాటించాలి

**వైద్యుల** ప్రెస్క్రిప్షన్ చీటీ లేకుండా మందులు కొనడం, అమ్మడం రెండూ నేరమే కానీ, తెలంగాణలో అన్ని జిల్లాల్లో మెడికల్ షాప్స్ ఈనిబంధనలను యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు. ఒక్కొక్క మందుల షాప్‌లో ఫార్మాసిస్ట్ లేదు. పర్యవేక్షణ లేదు.

- పి. జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా

## తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

**ప్రభుత్వ**పాఠశాలల్లో గ్రామీణప్రాంతాల్లో విద్యార్థిని విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ముఖ్య కారణాలు. బడి ఈడు పిల్లలు కలిగిన యువతరం గ్రామాల్లో ఉండడంలేదు. ఎందుకంటే గ్రామాల్లో వారికిఉపాధి లభించడంలేదు. గుజరాత్ మోడల్ గ్రామాలని స్మార్ట్ గ్రామాలని పేరుతో గ్రామాల్లో సిమెంట్ పరుపులు పరిచేస్తూ ఉన్నారు. స్మార్ట్‌కిచెన్లు కూడా అలాంటివే అవుతాయి. అవి కన్స్ట్రక్ట్ చేయడానికి కొన్ని కోట్ల ఖర్చు అవుతాయి. ప్రైవేట్ రంగంవారికి కార్పొరేటు రంగంవారికి అది లాభదాయకమవుతుంది. నిజానికి ఏ గ్రామంలో ఉన్న పిల్లలకు ఆ గ్రామంలో ఉన్న తల్లిదండ్రులు కమిటీగా ఏర్పడి మధ్యాహ్న భోజనాన్ని నిర్వహించడం జరుగుతోంది. దానివల్ల ఎలాంటి ఇబ్బంది లేదు. ఖచ్చితంగా మధ్యాహ్నం పన్నెండు గంటలకు వేడివేడి భోజనం పిల్లలకు అందుతూ ఉంది. ఎక్కడో నోటి కోటికో ఒకటి అలా అయిందని, వారి పొట్ట కొట్టడం వారి ఉపాధిని లాక్కోవడం బాధాకరం.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## అగ్రస్థానంలో యువ జనాభా

**ప్రపంచం**లోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశంగా భారతదేశం నేడు అగ్రస్థానంలోఉంది. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం భారత జనాభాలో సుమారు 66 శాతం మంది 35 ఏళ్లలోపు వారే. ఈ యువశక్తి దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఇంజిన్‌లా మారనుంది. అయితే రాష్ట్రాలవారీగా జనాభా మార్పులు వేర్వేరుగాఉన్నాయి. కేరళ, తమిళనాడువంటి రాష్ట్రాలు 2036 నాటికి వృద్ధాప్య రాష్ట్రాలుగా మారనున్నాయని, మరోవైపు ఉత్తరప్రదేశ్, బీహార్‌వంటి రాష్ట్రాల్లో పనిచేసే వయస్సు గల జనాభా పెరుగుతూనే ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ నివేదికలు చెబుతున్నాయి. ఈజనాభా మార్పులవల్ల దక్షిణాది రాష్ట్రాలుఆర్థికంగా, రాజకీయంగానసవాళ్లనుఎదుర్కొంటున్నాయి.

- పి.సాయికుమార్, వరంగల్‌జిల్లా

## మితిమీరుతున్న సాంకేతికత

**భారతదేశ** ఆర్థిక ముఖచిత్రం గతకొన్ని ఏళ్ళలో గణనీయమైన మార్పులకు లోనైంది. గతంలో వాటామార్కెట్ పరిమిత వర్గాలకే సాధ్యమనే భావన ఉండేది. నేడు సాంకేతిక విప్లవం వల్ల స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతిఒక్కరూ పెట్టుబడిదారులుగా మారుతున్నారు. ముఖ్యంగా యువత రికార్డు స్థాయిలో మార్కెట్లోకి ప్రవేశిస్తున్నారు. సాంకేతికత అందుబాటులోకి రావడం సానుకూలఅంశమేఅయినప్పటికీ, యువతలోవిశ్లేషణాత్మక ఆలోచన తగ్గి, తక్షణ లాభాల పట్ల వ్యామోహం పెరుగుతోంది.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళంజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్


మన వి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న డిజిటల్ డ్రగ్!

**సోషల్ మీడియాను పూర్తిగా నిరాకరించడం సాధ్యం కాదు, అవసరమూ కాదు. అది ఆధునిక జీవితంలో ఒక భాగంగా మారిపోయింది. కానీ దాన్ని నియంత్రణలో ఉంచే సామాజిక బాధ్యతను మాత్రం విస్మరించలేం. టెక్నాలజీ మనిషి జీవితాన్ని మెరుగుపరచాలిగానీ, మనిషిని తన ఆధీనంలోకి తీసుకోవడానికి కాదు. ఈ సత్యాన్ని గుర్తించే సమాజమే ఆరోగ్యకరమైన డిజిటల్ సంస్కృతిని నిర్మించగలదు. కాలిఫోర్నియా కోర్టు తీర్పు ఒక కేసుకు మాత్రమే సంబంధించినది కాదు. అది డిజిటల్ యుగానికి ఇచ్చిన ఒక హెచ్చరిక. ఇప్పటికైనా మనం జాగ్రత్త పడకపోతే డిజిటల్ డ్రగ్ అనే పదం ఒక ఉపమానం కాదు, ఒక కఠిన వాస్తవంగా మారే ప్రమాదం ఉంది. ఈ హెచ్చరికను సమాజం, ప్రభుత్వం, టెక్‌సంస్థలు సమానంగా పరిగణించినప్పుడే భవిష్యత్తు తరాలకు సురక్షితమైన డిజిటల్ ప్రపంచాన్ని అందించగలం. కాలిఫోర్నియా కోర్టు ఇచ్చిన ఈతీర్పు కేవలం ఒక న్యాయపరమైన తీర్పు మాత్రమే కాదు, ఇది డిజిటల్ యుగపు అంతరాత్మకు వినిపించిన హెచ్చరిక. టెక్నాలజీ అనేది మన జీవితాలను సులభతరం చేసే'సాధనం' కావాలి తప్ప, మన జీవితాలను శాసించే విధంగా ఉండకూడదు.**

మేకల క్రిష్ణ

టెక్నాలజీ.. మానవ నాగరికతను కొత్త పుంతలు తొక్కించిన అద్భుత ఆయుధం. సమాచార సముద్రాన్ని అరచేతిలోకి తెచ్చి, అనంతమైన అవకాశాలకు ద్వారాలు తెరిచింది. ఖండాల మధ్య దూరాన్ని తుడిచివేసి, ప్రపంచాన్ని ఒక చిన్న గ్రామంగా మార్చిన ఘనత దీనిదే. కానీ, ఇదే సాంకేతికత మానవ మేధస్సును వికసింపజేయాల్సింది పోయి మనిషిని తన గుప్పిట్లోకి తీసుకుంటే? అది అభివృద్ధి కాదు, ఒక అదృశ్య విపత్తుకు సంకేతం. నేడు మనం అనుభవిస్తున్న డిజిటల్ స్వేచ్ఛ వెనుక 'వ్యసనం' అనే భయంకరమైన నీడదాగి ఉంది. ఇటీవల కాలిఫోర్నియా కోర్టుమెటా, యూట్యూబ్ వంటి టెక్ దిగ్గజాలకు 6మిలియన్ డాలర్లభారీ జరిమానా విధించడం ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఇది కేవలం ఒక పరిహారపు తీర్పు మాత్రమే కాదు. లాభాల వేటలో మానసిక ఆరోగ్యాన్ని బలిపీఠం ఎక్కిస్తున్న డిజిటల్ యుగంలో మనిషి తన నియంత్రణను కోల్పోతున్నాడనే చేదు నిజానికి ఇది ఒక అధికారిక ధ్రువీకరణ. మనం టెక్నాలజీని వాడుతున్నామా? లేక టెక్నాలజీయే మనల్ని వాడుకుంటోందా? అన్న ఒక గంభీరమైన ప్రశ్నను ఈ తీర్పు ప్రపంచం ముందు నిలిపింది. సోషల్ మీడియా అనేది మొదట్లో సమాచార మార్పిడి వేదికగా ప్రారంభమైంది. మనుషుల మధ్య సంబంధాలను బలోపేతం చేయడం, అభిప్రాయాలను పంచుకోవడం, ప్రపంచ పరిణామాలను వేగంగా తెలుసుకోవడం వంటి ప్రయోజనాలతో అది ప్రజాదరణ పొందింది. కానీ కాలక్రమేణా అది వినోదం, గుర్తింపు, ఆకర్షణ, పోటీ, ప్రభావం వంటి అంశాలను కలిపిన ఒక మానసిక వ్యవస్థగా మారిపోయింది. వినియోగదారుడు యాప్‌ను ఎంతసేపు ఉపయోగిస్తాడో అదే కంపెనీల లాభాలను నిర్ణయించే ప్రమాణంగా మారడంతో, వినియోగదారుల దృష్టిని బంధించేలా ప్రత్యేకంగా రూపొందించిన ఆల్గారిథమ్‌లు సోషల్ మీడియా నిర్మాణంలో కీలక పాత్ర పోషించాయి. ఇన్ఫినిట్ స్క్రోలింగ్, ఆటోప్లే వీడియోలు, నిరంతర నోటిఫికేషన్లు వంటి ఫీచర్లు వినియోగదారుడి సౌకర్యం కోసం కాదు, అతడిని యాప్‌లో ఎక్కువసేపు నిలుపుకోవడానికే రూపుదిద్దుకున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇది సాధారణ అలవాటు కాదని, ఒక రకమైన డిజిటల్ సైకాలజీ అని ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. మన మెదడులో డోపమైన్ విడుదలను ప్రేరేపించే విధంగా రూపొందించిన ఈ డిజైన్ మనలో తక్షణ సంతృప్తి భావనను కలిగిస్తుంది. ఆ సంతృప్తి తాత్కాలికమైనదైనా, దాన్ని మళ్లీ మళ్లీ అనుభవించాలనే కోరిక మనల్ని నిరంతరం స్క్రీన్ ముందు కట్టిపడేస్తుంది. ఇదే ప్రక్రియ ఒక మత్తు పదార్థం పనిచేసే విధానంతో పోల్చదగినది. అందుకే సోషల్ మీడియాను డిజిటల్ డ్రగ్‌గా పిలుస్తున్నారు. కాలిఫోర్నియా కోర్టు తీర్పు ఈ వాదనకు న్యాయపరమైన బలం చేకూర్చింది. ఈ పరిణామాల్లో అత్యంత ఆందోళనకరమైన అంశం పిల్లలు, యువతపై పడుతున్న ప్రభావం. చిన్న వయస్సులోనే సోషల్‌మీడియా వినియోగం ప్రారంభమవడం వల్ల వారి వ్యక్తిత్వ నిర్మాణం సహజ మార్గం నుంచి దారిమళ్లుతోంది. వాస్తవ ప్రపంచంలో ఏర్పడే అనుభవాల స్థానంలో వర్చువల్ ప్రపంచం ప్రధాన పాత్ర పోషిస్తోంది. అందం అంటే ఏమిటి, విజయాన్ని ఎలా నిర్వచించాలి, సంబంధాలను ఎలా అర్థం చేసుకోవాలి వంటి అంశాల్లో సోషల్ మీడియా ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఇతరులతో తమను పోల్చుకోవడం, గుర్తింపు



కోసం నిరంతరం ప్రయత్నించడం, లైక్స్, కామెంట్ల ఆధారంగా తమ విలువను కొలవడం వంటి ధోరణులు యువతలో పెరుగుతున్నాయి. దీని ఫలితంగా ఆందోళన, ఒంటరితనం, నిరాశ, డిప్రెషన్ వంటి మానసిక సమస్యలు పెరుగుతున్నాయి. ఇప్పటివరకు ఈ పరిస్థితిని వ్యక్తిగత అలవాటుగా మాత్రమే చూశాం. ఫోన్ ఎక్కువగా ఉపయోగించడం వినియోగదారుడి తప్పు అని భావించాం. కానీ కాలిఫోర్నియా కోర్టు తీర్పు ఆ ఆలోచనను పూర్తిగా మార్చింది. వినియోగదారుల బలహీనతలను గుర్తించి, వారిని ఎక్కువసేపు యాప్‌లలోనే ఉంచేలా రూపొందించిన వ్యవస్థ కూడా ఒక కారణమని స్పష్టం చేసింది. అంటే ఇది వ్యక్తిగత వైఫల్యం కాదు. ఇది వ్యవస్థపరమైన సమస్య. వినియోగదారుడి మానసిక నిర్మాణాన్ని అర్థం చేసుకుని, దాన్ని వ్యాపార ప్రయోజనాలకు ఉపయోగించడం ఒక నైతిక ప్రశ్నను కూడా ముందుకు తెస్తోంది. ఈ తీర్పు సోషల్ మీడియా కంపెనీల బాధ్యతపై ప్రపంచవ్యాప్తంగా కొత్త చర్చకు నాంది పలికింది. గతంలో పొగాకు కంపెనీలు తమ ఉత్పత్తుల వల్ల కలిగే నష్టాలను దాచిపెట్టినట్లు విమర్శలు ఎదుర్కొన్నాయి. అదే విధంగా ఇప్పుడు సోషల్ మీడియా సంస్థలపై కూడా విమర్శలు వస్తున్నాయి. వినియోగదారుల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని తెలిసినా, వినియోగాన్ని పెంచే విధంగా ఫీచర్లను రూపొందించడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఈ తీర్పు భవిష్యత్తులో మరిన్ని కేసులకు మార్గం సుగమం చేసే అవకాశం ఉంది. అయితేమొత్తం బాధ్యతను కంపెనీలపై మాత్రమే మోపడం కూడా సరైన పరిష్కారం కాదు. ఇది సమాజంలోని ప్రతి వర్గానికి సంబంధించిన సమస్య. తల్లిదండ్రులు పిల్లల డిజిటల్ వినియోగంపై పర్యవేక్షణ చేయాలి. విద్యాసంస్థలు డిజిటల్ అవగాహనను పాఠ్యాంశంగా చేర్చాలి. ప్రభుత్వాలు వినియోగదారుల రక్షణ కోసం స్పష్టమైన విధానాలను రూపొందించాలి. ముఖ్యంగా టెక్ సంస్థలు తమ వ్యాపార నమూనాలను సమాజానికి అనుకూలంగా మార్చుకోవాలి. లాభాల కోసం వినియోగదారుల మానసిక ఆరోగ్యాన్ని పణంగా పెట్టే విధానం దీర్ఘకాలంలో స్థిరంగా ఉండదు. భారతదేశం వంటి యువ జనాభా అధికంగా ఉన్న దేశాలకు ఈ పరిణామం మరింత ప్రాముఖ్యత కలిగినది. ఇప్పటికే మన దేశంలో చిన్న వయస్సు నుంచే స్మార్ట్‌ఫోన్ వినియోగం విస్తృతంగా పెరిగింది. రోజుకు గంటల తరబడి సోషల్ మీడియా వినియోగం విద్యార్థుల చదువుపై, వ్యక్తిత్వ వికాసంపై, సామాజిక సంబంధాలపై ప్రభావం చూపుతోంది. అయితే ఇప్పటి వరకు దీనిని ఒక వ్యక్తిగత అలవాటుగా మాత్రమే చూసి, ప్రజారోగ్య సమస్యగా పరిగణించలేదు. ఇప్పుడు ఆ దిశగా ఆలోచించాల్సిన అవసరం ఏర్పడింది. ప్రత్యేకంగా పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ వినియోగంపై అవగాహన కల్పించడం అత్యంత అవసరం. పిల్లలకు సోషల్ మీడియా ప్రయోజనాలు మాత్రమే కాకుండా ప్రమాదాల గురించి కూడా తెలియజేయాలి. అదే సమయంలో ప్రభుత్వం వయస్సు పరిమితులు, డేటా భద్రత, ఆల్గారిథమ్ పారదర్శకత వంటి అంశాలపై కఠినమైన చట్టాలను రూపొందించాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలోని అనేకదేశాలు ఇప్పటికే ఈ దిశగా చర్యలు ప్రారంభించాయి. భారత్ కూడా ఈఅవకాశాన్ని ఉపయోగించుకుని బాధ్యతాయుతమైన డిజిటల్ విధానాలను అమలు చేయాలి. సోషల్ మీడియాను పూర్తిగా నిరాకరించడం సాధ్యం కాదు, అవసరమూ కాదు. అది ఆధునిక జీవితంలో ఒక భాగంగా మారిపోయింది. కానీ దాన్ని నియంత్రణలో ఉంచే సామాజిక బాధ్యతను మాత్రం విస్మరించలేం. టెక్నాలజీ మనిషి జీవితాన్ని మెరుగుపరచాలిగానీ, మనిషిని తన ఆధీనంలోకి తీసుకోవడానికి కాదు. ఈ సత్యాన్ని గుర్తించే సమాజమే ఆరోగ్యకరమైన డిజిటల్ సంస్కృతిని నిర్మించగలదు. కాలిఫోర్నియా కోర్టు తీర్పు ఒక కేసుకు మాత్రమే సంబంధించినది కాదు. అది డిజిటల్ యుగానికి ఇచ్చిన ఒక హెచ్చరిక. ఇప్పటికైనా మనం జాగ్రత్తపడకపోతే డిజిటల్ డ్రగ్ అనే పదం ఒక ఉపమానం కాదు, ఒక కఠిన వాస్తవంగా మారే ప్రమాదం ఉంది. ఈ హెచ్చరికను సమాజం, ప్రభుత్వం, టెక్‌సంస్థలు సమానంగా పరిగణించినప్పుడే భవిష్యత్తు తరాలకు సురక్షితమైన డిజిటల్ ప్రపంచాన్ని అందించగలం. కాలిఫోర్నియా కోర్టు ఇచ్చిన ఈతీర్పు కేవలం ఒక న్యాయపరమైన తీర్పు మాత్రమే కాదు, ఇది డిజిటల్ యుగపు అంతరాత్మకు వినిపించిన హెచ్చరిక. టెక్నాలజీ అనేది మన జీవితాలను సులభతరం చేసే'సాధనం' కావాలి తప్ప, మన జీవితాలను శాసించే విధంగా ఉండకూడదు. ●

# విద్య దోపిడీని అరికట్టే చర్యలు ఏవీ?

డా. చిట్యాల రవీందర్

నేటి ఆధునిక సమాజంలో విద్య అనేది ఒక ఉత్కృష్టమైన ఆశయం నుండి అత్యంత లాభదాయకమైన వ్యాపారంగా రూపాంతరం చెందడం అత్యంత విచారకరం. ఒకప్పుడు జ్ఞానాన్ని పంచే నిర్మలమైన దేవాలయాలుగా వెలుగొందిన పాఠశాలలు, నేడు కార్పొరేట్ శక్తుల చేతుల్లో కేవలం లాభాలను ఆర్జించే అడ్మిషన్ల ఫ్యాక్టరీలుగా మారిపోయాయి. ముఖ్యంగా ఎల్కేజీ వంటి ప్రాథమిక తరగతుల ప్రవేశానికే లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తుండటం సామాన్య, మధ్యతరగతి తండ్రి గుండెను కలచివేస్తోంది. చదువుకోవడానికి లక్షలు ఉంటేనే అర్హత అన్నట్లుగా తయారైన ప్రస్తుత పరిస్థితుల్లో, నిరుపేదలు తమ బిడ్డలను నాణ్యమైన చదువుకు దూరం చేసుకోవాలా అనే ప్రశ్న నాగరిక సమాజాన్ని నిలదీస్తోంది. ప్రైవేట్ విద్యా సంస్థలు ఇప్పుడు కేవలం విద్యను మాత్రమే కాకుండా ఒక రకమైన స్టేటస్ సింబల్‌ను విక్రయిస్తున్నాయి. ఏసీ క్లాస్ రూమ్‌లు, అత్యాధునిక క్రీడా మైదానాలు స్మార్ట్ బోర్డుల పేరుతో సామాన్యుడు కలలో కూడా ఊహించని ఫీజులను విధిస్తూ అక్షరాల అంగడిని నడుపుతున్నాయి. తాజా గణాంకాల ప్రకారం గత దశాబ్దకాలంలో విద్యావ్యయం దాదాపు 150శాతం పెరిగింది, కానీ సామాన్యుడి ఆదాయం మాత్రం ఆ స్థాయిలో పెరగలేదు. ప్రైవేట్ స్కూళ్లలో అడ్మిషన్ సమయంలోనే డొనేషన్ల రూపంలో లక్షలు వసూలు చేయడం చట్టరీత్యా నేరమైనా, అవి డెవలప్‌మెంట్ ఫీజు లేదా కోకరికులర్ ఫీజు అనే పేర్లతో బహిరంగంగానే సాగుతున్నాయి. పుస్తకాలు, యూనిఫాంలు, బెల్టులు, చివరకు షూపాలిష్ కూడా స్కూల్లోనే కొనాలనే నిబంధనలు తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నాయి.





విద్యా హక్కు చట్టం ప్రకారం 25శాతం సీట్లు నిరుపేదలకు కేటాయించాలనే నియమం ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. పేద తల్లిదండ్రులు తమ పిల్లలను గొప్ప స్కూళ్లలో చదివించాలని ఆశపడినా, ప్రవేశ ద్వారం దగ్గరే ఫీజుల రూపంలో ఎదురవుతున్న అడ్డుగోడలను చూసి కన్నీరు మున్నీరవుతున్నారు. 'మా పిల్లలకు తెలివితేటలు ఉన్నా, మాదగ్గర డబ్బు లేనందున వారు వెనుకబడిపోవాలా?' అని వారు వాపోతున్న తీరు హృదయవిదారకం. ప్రభుత్వాలు కేవలం జీవోలు జారీచేసి చేతులు దులుపుకోవడం వల్ల ప్రయోజనం లేదు. ప్రతి రాష్ట్రంలోనూ ఒక శక్తివంతమైన ఫీజు నియంత్రణ కమిటీ ఉండాలి. స్కూల్ మౌలిక సదుపాయాలను బట్టి ఫీజులకు ఒక పరిమితిని నిర్ణయించి, ఆ పరిమితిని మించి ఒక్కరూపాయి వసూలు చేసినా గుర్తింపు రద్దు చేసేలా కఠినచట్టాలు తీసుకురావాలి. అలాగే ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికిమించి తీర్చిదిద్దినప్పుడే ప్రైవేట్ పాఠశాలల అరాచకాలకు అడ్డుకట్ట పడుతుంది. ప్రైవేట్ స్కూళ్ల ఆదాయ వ్యయాలను ప్రతి ఏటా ఆడిటింగ్ చేయించి పారదర్శకతను పెంచాలి. విద్య అనేది లాభాపేక్ష లేని సేవారంగం అని సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో స్పష్టం చేసినా, ఆతీర్పుల అమలులో అధికార యంత్రాంగం వైఫల్యం కనిపిస్తోంది. విద్యా వ్యాపారాన్ని అరికట్టడంలో తల్లిదండ్రుల్లోనూ చైతన్యం రావాలి. కేవలం ఆడంబరాల కోసం లక్షల ఫీజులు కట్టడం కంటే జ్ఞానానికి విలువ ఇచ్చేమార్గాలను వెతకాలి. పేదవాడిబిడ్డ కూడాడాక్టర్, ఇంజనీర్ లేదా కలెక్టర్ కావాలనే కలకనే అధికారం ఈ దేశంలో ఉంది. ఆ కలకు లక్షలరూపాయల ఫీజులు అడ్డుగోడలుగా మారకూడదు. ప్రభుత్వం ఇప్పటి కైనా మేల్కొని విద్యా దోపిడీపై ఉక్కుపాదంమోపి, అందరికీ సమాన, నాణ్యమైన విద్యను అందించే దిశగా చర్యలు చేపట్టాలి. ●

# పిఆర్‌సి నివేదికపై జాప్యమెందుకు?



జి. తిరుపతిరెడ్డి

రెండువేల ఇరవైమూడు శాసన సభ ఎన్నికల ముందు 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు చేపట్టి 27 నెలలు గడుస్తున్నా దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న ముఖ్యమైన అనేక ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర జాప్యాన్ని ప్రదర్శిస్తూ మీనమేషాలు లెక్కిస్తున్నది. విద్యా రంగంలో మాత్రం కొంత రూటు మార్చి కొత్త సమస్యలను సృష్టిస్తున్నది. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ముందు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మా ప్రభుత్వం రాగానే కొత్త పి.ఆర్.సిని ప్రకటించి ఆరు నెలలలోగా సిఫారసులను అమలు చేస్తానని హామీ ఇచ్చారు. కానీ నేటి వరకు సిఫారసులు కమిషన్ నుండి తెప్పించుకోలేదు. పైగా మొదటి వాయిదా ఏప్రిల్ 2024 నుండి అక్టోబర్ 24 వరకు ఆరు నెలలు, రెండవ వాయిదా అక్టోబర్ 24 నుండి31 మార్చి2026 వరకు, మూడవ వాయిదా మార్చి 2026 నుండి 30 సెప్టెంబర్ 2026 వరకు ముచ్చటగా మూడోసారి వాయిదా వేసి ఉపాధ్యాయ ,ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురి చేశారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు వేతనాలను స్థిరీకరించి తాజాగా వేతనాలను సవరించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వేతన సవరణ సంఘం సిఫారసులు చేయాల్సిన అవసరం ఉంది .వేతన సవరణ సంఘం ప్రతిపాదించే పీఆర్సీ తాజా ద్రవ్యోల్బణం ఐదేళ్లలో ధరల స్థిరీకరణ, సూచికను పరిశీలించాలి. గత పీఆర్సీ నివేదికలను పరిశీలించి, లోపాలను సవరించి వేతన సవరణ తేదీ నాటికి ఉన్న మూలవేతనం ,కరువు భత్యం, ఫిట్మెంట్లను కలిపి వచ్చిన మొత్తాలను తాజాగా మూల వేతనాలుగా పూర్తి చేసి తాజా మాస్టర్ స్కేల్, ఇంక్రిమెంట్లు శాస్త్రీయంగా ప్రతిపాదించాల్సిన ఆవశ్యకత కమిటీకి ఉంటుంది. పీఆర్సీలు రూపుదిద్దుకోవడం కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు అనేక పోరాటాలు చేసి తమ హక్కుగా సాధించుకున్నారు. అలాంటి హక్కును కాలరాసే ప్రయత్నాన్ని ప్రభుత్వాలు విడనాడుకోవాలి. పీఆర్సీల మధ్య సంవత్సరాలుగా జాప్యాలను నివారించాలి. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పొట్ట కొట్టకూడదు, తెలంగాణ రాష్ట్రంలో మొదటి పీఆర్సీ గడుగు 2023 జూన్ 30వ తేదీతో ముగిసింది. 1 జులై 2023 నుండి తెలంగాణ రాష్ట్ర రెండో పీఆర్సీని ఇవ్వాల్సి ఉంది. గత ప్రభుత్వం 2 అక్టోబర్ 2023న రిటైర్ ఐఏఎస్ ఆఫీసర్‌ను చైర్మన్గా నియమిస్తూ వేతన సవరణ సంఘాన్ని నియమించింది. ఆరు నెలల్లోగా రిపోర్టు




తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించింది. అనేక పర్యాయాలు చర్చించి ఉద్యోగ సంఘాల నుండి ప్రతిపాదనలు స్వీకరించింది. సుదీర్ఘ కసరత్తు తరువాత కొన్ని నెలల క్రితమే పీఆర్సీ నివేదిక సిద్ధమైంది. రిపోర్టును సమర్పించేందుకు అధికారులు ప్రభుత్వ అనుమతి కోరారు .కానీ ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదు సరికదా ఉద్యోగ వర్గం కండ్లల్లో ఒత్తులు వేసుకొని ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం 2026 బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయిస్తారని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆశించారు. కానీ అందుకు విరుద్ధంగారాష్ట్ర ప్రభుత్వం 3,24,234 కోట్ల రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 26,674 కోట్లు (8.22శాతం) కేటాయించింది. అందులో పీఆర్సీ ఊసే ఎత్తకుండా ఉద్యోగ ,ఉపాధ్యాయ వర్గాలలో నిరాశ నిస్పృహలకు లోనయ్యే విధంగా వ్యవహరించింది. ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి ,వేతన సవరణ సంఘాన్ని పిలిచి నివేదిక తెప్పించుకొని పీఆర్సీ అమలు చేస్తారని ఆశించారు. కానీ ఆశలు అడియాశలు అయ్యాయి. ప్రభుత్వ ఆలోచన సమస్యల నుండి ఒడ్డెక్కే దాకా ఓడ మల్లయ్య ఒడ్డెక్కాక బోడ మల్లయ్య అనే చందంగా ఉంది. గత బడ్జెట్ కంటే 6.7శాతాన్ని పెంచి చేతులు దులుపుకుంది. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకుండా ప్రభుత్వం దాటేసింది. తెలంగాణ మొదటి పీఆర్‌సి సిఆర్ బిశ్వాస్ చైర్మన్గా 2018లో మే 18న కమిటీ ఏర్పాటు చేసి ,2021 నుండి 43 ఫిట్మెంట్తో పీఆర్సీని అమలు చేసింది. ప్రభుత్వంపై ఏడాదికి 12,595కోట్ల అదనపు భారం పడిన కరోనా కష్టాలు వెంటాడినా, రాష్ట్ర అభివృద్ధిలో ఉపాధ్యాయ, ఉద్యోగుల పాత్రను గుర్తించి భారాన్ని భరించేందుకు సిద్ధపడ్డది, ఉద్యోగ ,ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఈ సమాజంలో అంతర్భాగమే. మూడు, నాలుగు దశాబ్దాల పాటు సమాజాభివృద్ధిలో, విద్యాభివృద్ధిలో ఎనలేని సేవ చేసి తమ రక్తాన్ని చెమటగా ధారపోసి ప్రజలకు సేవ చేస్తున్నారు, ఇలాంటి వర్గాల వారిని చిన్నచూపు చూడడం వారి పరిస్థితిని అర్థం చేసుకోకపోవడం సరైంది కాదు. హామీలు ఇచ్చి గట్టెక్కిన పాలకులు అరుపులు ,పెడబొబ్బలతో బాధ్యతల నుంచి తప్పించుకోలేరు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 27 నెలలు గడుస్తున్నా పీఆర్సి నివేదికను తెప్పించుకోకుండా అమలు చేయకుండా గత ప్రభుత్వంపై ఆడిపోసుకుని పబ్బం గడుపుకోవడం దుర్మార్గమైన ఆలోచన. ప్రభుత్వం తాను అనుకున్న పథకాలకు వేల కోట్లు మంజూరు చేస్తూ అందాలకు ,విందులకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ ఉద్యోగ ,ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఖజానా ఖాళీ అయిందని చెప్పడం ఎంతవరకు సమంజసం. సెప్టెంబర్ 2026 వరకు పీఆర్సీ నివేదికను వాయిదా వేయడం సరైన పద్ధతి కాదు. వెంటనే ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకొని పీఆర్సీ నివేదికను తెప్పించుకొని ఐదు శాతం ఐఆర్‌తోపాటు 40 శాతం ఫిట్మెంట్‌తో 1జులై 2023నుండి అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. ●

## ఏప్రిల్ 3న పుదుచ్చేరిలో మోడీ సభ

### 4న చెన్నైలో బిజెపి శ్రేణులతో సమావేశం

**చెన్నై, మార్చి 30:** తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏప్రిల్ 3, 4 తేదీల్లో చెన్నై, పుదుచ్చేరిలలో పర్యటించనున్నారు. ఈ పర్యటన ద్వారా ఎన్‌డియే ప్రచారాన్ని దక్షిణాదిలో మరింత ఉధృతం చేయనున్నారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, ప్రధానమంత్రి ఏప్రిల్ 3 మధ్యాహ్నం చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా పుదుచ్చేరికి, సాయంత్రం జరిగే ఒక భారీ బహిరంగ సభలో ప్రసంగించున్నారు. ఏప్రిల్ 9న జరగనున్న పోలింగ్‌కు ముందు, బిజెపి, ఎన్‌డియే అభ్యర్థులకు మద్దతు కూడగట్టడమే ఈ సభ ప్రధాన ఉద్దేశం. ఈ బహిరంగ సభ అనంతరం, ప్రధాని మోడీ అదే రాత్రి తిరిగి చెన్నైకి చేరుకుంటారు. ఏప్రిల్ 4న, చెన్నైలో సుమారు 100 మంది పార్టీ కార్యకర్తలు, క్షేత్ర స్థాయి నిర్వాహకులు, కీలక వ్యక్తులతో ముఖాముఖి సమావేశం నిర్వహించనున్నారు. ప్రచారంలో భాగంగా ఒక రోడ్‌షోను కూడా ప్లాన్ చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# కేరళంలో బిజెపి, ఎల్‌డిఎఫ్ కుమ్మక్కు!

**అందుకే శబరిమలపై ప్రధాని మోడీ మౌనం**

**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణలు**

**పింఛన్లు రూ.3 వేలకు పెంచుతామని హామీ**



**పథనంతిట్ట, మార్చి 30:** శబరిమల ఆలయం విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మౌనం వహిస్తున్నారని, ఇందుకు ప్రధాన కారణం బిజెపి-ఎల్‌డిఎఫ్ లోపాయికారి ఒప్పందమేనని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు, పథనంతిట్ట జిల్లా అదూర్‌లో సోమవారం నిర్వహించిన ఎన్నికల సభలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మతపరమైన అంశాలను 'ఎంపిక చేసుకుని' మాత్రమే ప్రస్తావిస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ తరచుగా దేవాలయాలు, విశ్వాసం గురించి ప్రస్తావిస్తారని, కానీ ఇటీవల పాలక్కాడ్‌లో చేసిన ప్రసంగంలో శబరిమల గురించి ప్రస్తావించడంలో విఫలమయ్యారని ఆయన వాదించారు. ఏప్రిల్ 9న జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు పలు సంక్షేమ హామీలను ప్రకటిస్తూనే, అధికార వామపక్షాలకు, బిజెపికి మధ్య ఒక "రహస్య అవగాహన" ఉందని రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఎన్నికల పోరును యుడిఎఫ్‌కు, వామపక్ష-బిజెపిల మధ్య ఉన్న ఒక రహస్య కూటమికి మధ్య ప్రత్యక్ష పోటీగా ఆయన అభివర్ణించారు. "ఒకవైపు యుడిఎఫ్, మరోవైపు వామపక్ష, బిజెపిల కలయిక ఉంది," అని ఆయన అన్నారు. జాతీయ స్థాయిలో వామపక్షాలను బిజెపి ఒక నిజమైన ప్రత్యర్థిగా చూడటం లేదని విమర్శించారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం ఇకపై నిజమైన వామపక్ష భావజాలాన్ని ప్రతిబింబించడం లేదని, దానికి బదులుగా బిజెపి తరహాలో "కార్పొరేట్ అనుకూల" విధానాలను అవలంభించిందని కాంగ్రెస్ ఎంపీ తీవ్రంగా విమర్శించారు. రబ్బరు రైతుల దుస్థితిని ఎత్తి చూపుతూ, ఈ రంగాన్ని నిర్లక్ష్యం చేశారని ఆయన పేర్కొన్నారు. కార్మికులను, చిన్న ఉత్పత్తిదారులను కాపాడటంలో విఫలమైనందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన విమర్శించారు. యుడిఎఫ్‌ను ప్రజానుకూల ప్రత్యామ్నాయంగా నిలబెడుతూ, రాహుల్ గాంధీ పలు కీలక హామీలను వెల్లడించారు. వీటిలో ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, కళాశాలకు వెళ్లే బాలికలకు నెలకు రూ.1,000 భత్యం, సంక్షేమ పింఛన్లను రూ.3,000కు పెంచడం వంటివి ఉన్నాయి. ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా, చిన్న తరహా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి రూ.5 లక్షల రుణాలు, వయోవృద్ధుల కోసం ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తామని కూడా ఆయన హామీ ఇచ్చారు. ఉపాధి, తయారీ రంగానికి ప్రాధాన్యతనిస్తూ, దిగుమతులపై ఆధారపడకుండా కేరళ ఎంఎస్‌ఎంఇలను, వ్యవసాయాన్ని బలోపేతం చేయాలని గాంధీ అన్నారు. "తాను మాట్లాడే ఈ మైక్రోఫోన్ మేడ్ ఇన్ చైనా; ఇది కేరళలో తయారవ్వాలి," అని ఆయన వ్యాఖ్యానించారు.

# మంటల్లో పశ్చిమాసియా




## యుఎస్ స్థావరాలు ఇజ్రాయెల్‌కు తరలింపు?

**టెల్‌అవీవ్, మార్చి 30:** పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు పెరిగిన నేపథ్యంలో ఇజ్రాయెల్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో ఉన్న అమెరికా బేస్‌లోను తమ దేశంలోకి మార్చుకొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఈ యుద్ధం ముగిసిన తర్వాత ఈ ప్రణాళికను అమలుచేసే అవకాశం ఉందని ఇజ్రాయెల్ మీడియా సంస్థ ఛానెల్ 12 పేర్కొంది. తాజాగా ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో అమెరికా స్థావరాల మార్పునకు ఇదో మంచి అవకాశంగా ఇజ్రాయెల్ భావిస్తోంది. ఇటీవల యుద్ధంలో అమెరికా దళాలతో కలిసి ఇజ్రాయెల్ బలగాలు పోరాడుతున్నాయి. రెండింటి మధ్య బలమైన ఆపరేషనల్, ఇంటెలిజెన్స్ బంధం ఉంది. స్థావరాలను ఇజ్రాయెల్‌కు తరలించడంతో అగ్రరాజ్యానికి వ్యూహాత్మక పట్టులభించే అవకాశం ఉంది. ఖతార్‌లోని అల్ ఉదైద్ బేస్, బహ్రెయిన్‌లోని ఫిఫ్త్ ఫ్లీట్ ప్రధాన కార్యాలయం, యుఎఇలోని అల్ దఫ్రా బేస్ వంటివి ఇకపై ఇజ్రాయెల్‌లోకి వెళ్లే అవకాశం ఉంది. అమెరికా దళాలు ఇక్కడికి వస్తే లాజిస్టిక్స్ హబ్‌గా, వార్ రిజర్వ్ స్టాక్ కేంద్రాలుగా, ఆయుధ డిపోలుగా ఇవి ఇజ్రాయెల్‌కు ఉపయోగపడనున్నాయి. అమెరికాకు చెందిన థాడ్, పేట్రియాట్, లేజర్ ఇంటర్సెప్టర్లు, ఇంటెలిజెన్స్ వంటి వాటిని పంచుకొనే అవకాశం లభిస్తుంది.

## కువైట్ జలశుద్ధి ప్లాంట్‌పై ఇరాన్ దాడి

### మరో భారతీయుడు మృతి

**కువైట్, మార్చి 30:** పశ్చిమాసియాలో యుద్ధం రోజురోజుకూ మరింత తీవ్రం అవుతోంది. ఈక్రమంలోనే అక్కడున్న అనేక మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా ఇరాన్ కువైట్‌పై చేసిన క్షిపణి దాడిలో ఒక భారతీయ కార్మికుడు మరణించాడు. ఈ విషాదకర ఘటనను కువైట్ మంత్రిత్వ శాఖ అధికారికంగా ధ్రువీకరించింది. గడిచిన వారంరోజుల్లోనే గల్ఫ్ దేశాల్లో యుద్ధం కారణంగా భారతీయులు ప్రాణాలు కోల్పోవడం ఇది రెండోసారి కావడంతో ప్రవాస భారతీయుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. కువైట్‌లోని కీలకమైన విద్యుత్, నీటి శుద్ధి కర్మాగారాన్ని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ఈ దాడికి పాల్పడింది. ఈ దాడిలో ప్లాంట్ సమీపంలోని ఒక సర్వీస్ భవనం పూర్తిగా ధ్వంసమైంది. అయితే అక్కడ విధుల్లో ఉన్న ఓ భారతీయ కార్మికుడు క్షిపణి ధాటికి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. భద్రతా కారణాల దృష్ట్యా ఈ ప్లాంట్ ఖచ్చితంగా ఏ ప్రాంతంలో ఉందనే వివరాలను కువైట్ అధికారులు ప్రస్తుతానికి వెల్లడించలేదు. ఘటన జరిగిన వెంటనే కువైట్ సాంకేతిక, ఎమర్జెన్సీ బృందాలు రంగంలోకి దిగాయి. ధ్వంసమైన భవన శకలాలను తొలగించడంతో పాటు ప్లాంట్‌లో విద్యుత్, నీటి సరఫరాకు ఆటంకం కలగకుండా మరమ్మతు పనులు చేపట్టారు. యుద్ధ వాతావరణం నేపథ్యంలో ప్లాంట్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. భారత రాయబార కార్యాలయం కూడా కువైట్ అధికారులతో సంప్రదింపులు జరుపుతూ.. మృతి చెందిన భారతీయుడి వివరాలను సేకరిస్తోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు కేవలం యుద్ధం జరుగుతున్న దేశాలకే పరిమితం కాకుండా పొరుగు దేశాలకు కూడా పాకుతున్నాయి.

## రష్యా చమురు నౌకతో సమస్య లేదు: ట్రంప్

**వాషింగ్టన్, మార్చి 30:** చమురు సంక్షోభంలో కూరుకుపోయిన క్యూబాకు అమెరికా ఒకింత ఊరట కల్పించింది. ఆ దేశానికి వెళ్లే రష్యా చమురు నౌకకు అనుమతిస్తామని వెల్లడించింది. గత కొంతకాలంగా క్యూబాకు చమురు రవాణా విషయంలో ట్రంప్ ఆంక్షలు పెట్టగా.. తాజాగా వాటిని కాస్త సడలించడం గమనార్హం. 7.3 లక్షల బ్యారెళ్ల ముడిచమురుతో రష్యా నౌక 'అనాటోలీ కొలోడ్కిన్' ఈ నెల 8న రష్యా పోర్టు నుంచి బయల్దేరింది. ఇంగ్లిష్ ఛానల్ మీదుగా అట్లాంటిక్ చేరుకుంది. అమెరికా ఆంక్షలల నేపథ్యంలో ఈ నౌక క్యూబాను చేరుతుందా, లేదా అనే సందిగ్ధత నెలకొంది. ఈ క్రమంలోనే దీనిపై ట్రంప్ తాజాగా స్పందించారు. 'ఇప్పటికిప్పుడు క్యూబాకు చమురు చేరవేయాలని ఏ దేశం అనుకున్నా దాంతో నాకు సమస్య లేదు. అది రష్యా అయినా, కాకపోయినా నాకేం ఇబ్బంది లేదు. త్వరలోనే క్యూబా ప్రభుత్వం నేలకూలుతుంది' అని ట్రంప్ అన్నారు. ఆ తర్వాత రష్యా చమురు నౌకకు అనుమతినిస్తున్నట్లు అమెరికా మరో ప్రకటన చేసింది. ఈ నౌక మంగళవారం క్యూబాకు చేరుకునే అవకాశం ఉంది. వెనిజులా అధ్యక్షుడు మదురో నిర్బంధం తర్వాత నుంచి ఆ దేశానికి చమురు రవాణా నిలిచిపోయింది.

## ఇరాన్ దాడుల్లో పలువురు ఇజ్రాయెలీలకు గాయాలు

**జెరుసలాం, మార్చి 30:** అమెరికాఇజ్రాయెల్ దళాలు చేపట్టిన దాడులకు ప్రతీకారంగా ఇరాన్ కూడా ప్రతిదాడికి దిగిన విషయం తెలిసిందే. గతనెల 28వ తేదీ నుంచి జరిగిన ఇరాన్ దాడుల్లో సుమారు 6008 మంది గాయపడినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. ఇరాన్‌తో పాటు హిజ్‌బుల్లా చేసిన దాడుల వల్ల భారీ మొత్తంలో ఇజ్రాయిలీ ప్రజలు గాయపడినట్లు ఆ దేశ ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. గడిచిన 24 గంటల్లో సుమారు 232 మందిని ఆస్పత్రిలో చేర్పించినట్లు ఇజ్రాయెల్ ఆరోగ్యశాఖ పేర్కొన్నది. అయితే గత నాలుగు వారాల్లో మొత్తం 15 మంది మరణించినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. ఈ సమాచారాన్ని ఆ దేశ అంబులెన్స్ సర్వీసు పేర్కొన్నది. మరోవైపు ఇరాన్‌లో భారీ స్థాయిలో ప్రాణ నష్టం జరిగింది. ఇజ్రాయెల్అమెరికా బలగాలు నిర్వహిస్తున్న సైనిక ఆపరేషన్ వల్ల ఇరాన్‌లో ఇప్పటి వరకు సుమారు 1900 మంది మరణించినట్లు ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్‌క్రాస్ పేర్కొన్నది. మరో 20 వేల మంది గాయపడినట్లు ఇరాన్ చెప్పింది. అమెరికాఇజ్రాయెల్ దళాలు జరిపిన దాడిలో నేవీ చీఫ్ అలీరెజా తంగ్‌సిరి మృతిచెందినట్లు ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ధ్రువీకరించింది. తమ దేశంలో వీరులు మరణిస్తున్నారని, కానీ తాము అదే బలంతో ముందుకు వెళ్లనున్నట్లు ఓ ప్రకటనలో ఇరాన్ తెలిపింది. వీరుడైన కమాండర్‌ను కోల్పోయినా తమ నావికులు మాత్రం హర్మూజ్ జలసంధిలో శత్రువులను చీల్చిచెండాడుతున్నారని వెల్లడించారు. 2018 నుంచి ఇరాన్ నేవీకి చీఫ్ తంగసిరి గత వారం జరిగిన దాడిలో ప్రాణాలు కోల్పోయారు.

### రహస్య కూటమి ఎవరిదో

# కేరళీయులకు తెలుసు

**ప్రధాని మోడీపై ప్రియాంక గాంధీ విసుర్లు**

**కేరళంలో గెలుపు మాదే: ఎంపిలు**



**న్యూఢిల్లీ, మార్చి 30:** కేరళ రాజకీయాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా సోమవారం తీవ్రంగా విరుచుకుపడ్డారు. రాజకీయ కూటముల వెనుక ఉన్న 'నిజం' రాష్ట్ర ప్రజలకు పూర్తిగా తెలుసని ఆమె స్పష్టం చేశారు. కేరళలో రహస్య కూటమి ఉందన్న ప్రధానమంత్రి ఆరోపణలను తోసిపుచ్చారు. రాష్ట్ర ప్రజలకు రాజకీయ వాస్తవాలు బాగా తెలుసని ఆమె స్పష్టం చేశారు. "ఈ కూటమి ఎవరి మధ్య రహస్యంగా ఉందో కేరళ ప్రజలందరికీ తెలుసు. కేరళలో ప్రతి ఒక్కరికీ ఈ విషయం తెలుసు. ప్రధానమంత్రి ఏది చెప్పినా, కేరళకు నిజం తెలుసు, ప్రజలకు కూడా నిజం తెలుసు," అని ఆమె అన్నారు. సోమవారం ప్రియాంక మీడియాతో మాట్లాడుతూ, "పశ్చిమ ఆసియాలో జరుగుతున్న యుద్ధంపై చర్చ జరపాలని తాము కోరుతున్నాము. ఎందుకంటే యావత్ దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ రోజు గ్యాస్ సిలిండర్ల ధరలు ఎంత పెరిగాయో మీ అందరికీ తెలుసు. పరిస్థితి కష్టంగా ఉంది, ఇంకా ఇతర సంక్షోభాలు కూడా తలెత్తుతున్నాయి. అందువల్ల, మేము చర్చ కోరుకుంటున్నాము," అని ఆమె అన్నారు. కాంగ్రెస్ ఎంపి మాణిక్కం ఠాగూర్ మాట్లాడుతూ, అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్)- బిజెపి మధ్య "రహస్య అవగాహన" ఉందని ఆరోపించారు. "ఎవరికి దీర్ఘకాల సంబంధాలు ఉన్నాయో మనందరికీ తెలుసు, ఇక రహస్య అవగాహనే ప్రధాన ప్రశ్న. కేరళలో ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ (యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్) ఒకరితో ఒకరు పోరాడుకుంటారు. ఎన్నికలు ఉన్నప్పుడు ఎల్‌డిఎఫ్‌కు బిజెపితో ఎలా రహస్య అవగాహన ఉంటుందో మనందరికీ తెలుసు," అని ఆయన అన్నారు. మరో ఎంపి కె.సురేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం యుడిఎఫ్‌కు బలంగా అనుకూలంగా ఉంది. యుడిఎఫ్ గెలుస్తుంది. 100 సీట్లలో గెలవబోతున్నామన్నారు.

# తమిళనాట నామినేషన్ల జోరు

- **కొలత్తూరులో స్టాలిన్.. పెరంబూరులో విజయ్ నామినేషన్**
- **తమదే విజయమంటూ ఇరువురి ధీమా**





**చెన్నై, మార్చి 30:** తమిళనాడు శాసనసభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ లాంఛనంగా ప్రారంభం కాగా, వరుసగా నాలుగోసారి ముఖ్యమంత్రిగా పోటీ చేస్తున్న ఎం.కె. స్టాలిన్ సోమవారం కొలత్తూరు నియోజకవర్గం నుంచి తన నామినేషన్‌ను దాఖలు చేశారు. నటుడు, రాజకీయ నాయకుడు అయిన విజయ్, తమిళనాడు శాసనసభ ఎన్నికలకు ముందు తన రాజకీయ ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తూ, పెరంబూర్ శాసనసభ నియోజకవర్గం నుంచి తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఏప్రిల్ 23న జరగనున్న ఒకేవిడత పోలింగ్‌కు ముందు, రాష్ట్రంలోని మొత్తం 234 నియోజకవర్గాల్లో నామినేషన్ల స్వీకరణను ఎన్నికల సంఘం ప్రారంభించింది. ఇది ఒక కీలక దశగా నిలిచింది. ప్రక్రియ సజావుగా, క్రమబద్ధంగా జరిగేలా చూసేందుకు ప్రతి నియోజకవర్గంలోనూ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలను ఏర్పాటు చేసి, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో, స్టాలిన్ కొలత్తూరు శాసనసభ నియోజకవర్గంలోని పేపర్ మిల్స్ రోడ్‌లో ఉన్న నిర్దేశిత ఎన్నికల కార్యాలయానికి చేరుకుని, మంత్రి శేఖర్ బాబుతో పాటు పలువురు సీనియర్ నాయకుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి ఎస్. శాంతికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, డిఎంకె నేతృత్వంలోని కూటమి అవకాశాలపై స్టాలిన్ గట్టి విశ్వాసం వ్యక్తం చేశారు. పోటీ ఎంత తీవ్రంగా ఉన్నప్పటికీ, ఫలితం ఖచ్చితంగా కూటమికి అనుకూలంగానే ఉంటుందని ఆయన ఉద్ఘాటించారు. "తమిళనాడు ప్రజలు మరోసారి మా పాలనపై విశ్వాసం ఉంచుతారు" అని ఆయన విజయంపై ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో డిఎంకె కూటమి 200కి పైగా సీట్లు కైవసం చేసుకుంటుందని స్టాలిన్ తన విశ్వాసాన్ని పునరుద్ఘాటించారు.

**గెలుపు మాదే: విజయ్**

తమిళగా వెట్రి కజగం (టివికె) అధ్యక్షుడు విజయ్ సోమవారం పెరంబూర్ శాసనసభ నియోజకవర్గం నుంచి తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. వ్యాసర్‌పడిలోని డాక్టర్ అంబేద్కర్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రిటర్నింగ్ అధికారి ఎదుట తన నామినేషన్‌ను సమర్పించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్. ఆనంద్, సంయుక్త ప్రధాన కార్యదర్శి సి.టి.ఆర్. నిర్మల్ కుమార్ సహా పలువురు సీనియర్ పార్టీ నాయకులు విజయ్‌తో పాటు సభాస్థలికి రాగా, వారి సమక్షంలో ఈ నామినేషన్ దాఖలు జరిగింది. ఈ నామినేషన్ కార్యక్రమానికి మద్దతుదారుల నుంచి అఖండ స్పందన లభించింది. రాష్ట్రంలో తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్న పార్టీకి పెరుగుతున్న రాజకీయ ఊపును ఈ ఉత్సాహభరితమైన జనసందోహం ప్రతిబింబించింది. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం విజయ్ మాట్లాడుతూ, ద్రవిడ పార్టీలకు ప్రత్యామ్నాయం తామేనని, ఈ ఎన్నికల్లో ఘనవిజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**విజయ్ ఆస్తులు రూ.603 కోట్లు**

**ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి**

సినీనటుడు విజయ్ ఎన్నికల అఫిడవిట్‌లో రూ.603 కోట్ల విలువైన స్థిర, చరాస్తులు తన పేరిట ఉన్నట్లు విజయ్ పేర్కొన్నారు. అందులో రూ.404.58 కోట్ల విలువైన చరాస్తులు ఉన్నట్లు తెలిపారు. కొడైకనాల్‌లోని వ్యవసాయ భూమి, చెన్నై వ్యాప్తంగా ఉన్న వాణిజ్య, నివాస భవనాలతో కూడిన తన స్థిరాస్తుల విలువ సుమారు రూ.198.62 కోట్లు అని స్పష్టం చేశారు. తన భార్య సంగీత పేరిట రూ.15.76 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయని వెల్లడించారు. అందులో రూ.15.51 కోట్ల విలువైన చరాస్తులు, రూ.25 లక్షల విలువైన స్థిరాస్తులు ఉన్నాయని విజయ్ తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

# సహజీవన జంటలకూ కుటుంబ హోదా

**దేశంలో రేపటి నుంచి జనగణన**

**తొలిదశలో కుటుంబాల లెక్కింపు**

**న్యూఢిల్లీ, మార్చి 30:** భారతదేశ జనాభా లెక్కల సేకరణలో కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. 2021లో కోవిడ్ కారణంగా వాయిదా పడిన 16వ జనగణన ప్రక్రియ ఈ ఏడాది ఏప్రిల్ 1న ప్రారంభం కానుంది. ఈసారి జనాభా లెక్కల్లో మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలను సవరించారు. ఇందులో భాగంగా, చాలా కాలంగా కలిసి ఉంటున్న సహజీవన జంటలను ఇకపై కుటుంబంగా గుర్తించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ సోమవారం వివరాలను వెల్లడించారు. రెండు దశలుగా దేశంలో జనగణన జరుగుతుంది. తొలిదశ ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి గృహ గణన జరుగుతుంది. అధికారులు మొబైల్ యాప్ ద్వారా ఇంఇంటికీ వెళ్లి గృహాల వివరాలు సేకరిస్తారు. రెండోదశ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఉంటుంది. ఈ దశలోనే అసలైన జనాభా లెక్కల సేకరణ జరుగుతుంది. జనగణన కోసం కేంద్రం ప్రత్యేకంగా 33 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని సిద్ధం చేసింది. ఇందులో కుటుంబ యజమాని వివరాలు, కులం, కమ్యూనిటీతో పాటు ఇంట్లోని వసతులపై ఆరా తీయనున్నారు. ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు సైకిల్ నుంచి కారు వరకు, టీవీ, రేడియో వంటి గృహోపకరణాలపై ప్రశ్నలు ఉంటాయి. తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వినియోగం, వంటగది సౌకర్యాలు, వినియోగించే ఇంధనం మరియు తృణధాన్యాల వాడకం వంటి వివరాలను సేకరిస్తారు. ఈసారి జనగణనలో మరో విశేషం ఏమిటంటే, పౌరులు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించింది. దేశంలో సాధారణంగా ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణన జరుగుతుంది. చివరిసారిగా 2011లో జనాభా లెక్కలు సేకరించగా, దాదాపు 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జరుగుతున్న ఈ ప్రక్రియపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. ఈ గణాంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల రూపకల్పనకు, నిధుల కేటాయింపులకు అత్యంత కీలకం కానున్నాయి. చివరిసారిగా 2011లో జరిగింది. 2021లో జరగాల్సిన ప్రక్రియ కొవిడ్19 కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. కానీ ఎట్టకేలకు దేశ జనాభా స్థితిగతులపై స్పష్టమైన లెక్కలు తేలనున్నాయి. దేశ భవిష్యత్తు ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పనకు ఈ గణాంకాలు అత్యంత కీలకం కానున్నాయి.

## నేపాల్ ఆరోగ్యమంత్రిగా నిషా మెహతా

**ఖాట్మండు, మార్చి 30:** నేపాల్ కేబినెట్‌లో భారత మూలాలున్న ఎయిమ్స్ విద్యార్థిని ప్రస్తుత ఎంపి నిషా మెహతా నేపాల్ ఆరోగ్య మంత్రిగా నియమితులయ్యారు. ధ్రాని బాలేన్‌షా ప్రమాణస్వీకారంరోజుననే ఆమె కూడా మంత్రిగా ప్రమాణంచేసారు. అనంతరం ఆమెకు ఆరోగ్యశాఖను అప్పగించారు. నిజానికి ఆమెకు భారతదేశంతో బలమైన సంబంధాలు ఉన్నాయి. ఆమె తన బాల్యం నుంచే ఆరోగ్య సంరక్షణ రంగంలో చురుకుగా ఉన్నారు. నర్సింగ్ వృత్తి తర్వాత ఆమె రాజకీయాల్లోకి ప్రవేశించారు. ప్రస్తుతం నేపాల్‌లో పాలక పార్టీగా ఉన్న ఆర్ఎస్‌పి ఆరంభం నుంచి ఆమె అందులో ఒక సాధారణ సభ్యురాలిగా కొనసాగారు. 2022 సార్వత్రిక ఎన్నికల కోసం ఆర్ఎస్‌పి ఆమెను బరిలోకిదించింది. ఆ ఎన్నికల్లో నిషా నేపాలీ పార్లమెంటులో సీటు దక్కించుకోవడంలో విఫలమయ్యారు. ఈసారి ఆమె ఫెడరల్ పార్లమెంటులోకి ప్రవేశించి ఏకంగా ప్రధానమంత్రి బాలేంద్ర షా నేతృత్వంలోని ప్రభుత్వంలో ఆరోగ్య మంత్రిగా ఎన్నికైయ్యారు. ఆమె ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కు అనుబంధంగా ఉన్న కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో చదువుకున్నారు. అనంతరం ఆమె కోషిలోని నేపాల్ పోలీస్ వైవ్స్ అసోసియేషన్‌కు పరిపాలనా కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఆ సమయంలో ఆమె అక్కడ, మహిళలు, పిల్లల సంక్షేమానికి సంబంధించిన హెల్త్ క్యాంప్‌లు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. కొత్తగా ఎన్నికైన నేపాల్ ప్రభుత్వంలో మార్చి 27న దేశ ఆరోగ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

# ఎమ్మెల్సీ సభ్యత్వానికి నితీష్‌కుమార్ రాజీనామా



**పాట్నా, మార్చి 30:** బీహార్ సీఎం నితీశ్ కుమార్ తన శాసన మండలి సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇటీవల రాజ్యసభకు ఆయన ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని వదులుకున్నారు. సీఎం పదవికి కూడా త్వరలో రాజీనామా చేయనున్నారు. మార్చి 16న బీహార్ స్థానాలకు జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో నితీశ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు సభల్లో సభ్యత్వం కలిగి ఉన్నప్పుడు, ఏదో ఒక సభ్యత్వానికి రాజీనామా చేయడానికి 14 రోజుల గడువును రాజ్యాంగం నిర్దేశించింది. మార్చి 30తో ఈ గడువు ముగియనున్నది. ఈ నేపథ్యంలో రాజ్యసభకు ఎన్నికైన నితీశ్ కుమార్ తన శాసన మండలి సభ్యత్వానికి సోమవారం రాజీనామా చేశారు. సీఎం పదవికి కూడా త్వరలో రాజీనామా చేయనున్నారు. ఏప్రిల్ 9న నితీశ్ కుమార్ రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. మరోవైపు 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నితీశ్ కుమార్ తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 2005లో తొలిసారి బీహార్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు. పలు రాజకీయ కూటములు మారుతూ రికార్డు స్థాయిలో బీహార్ పదో సీఎంగా ఉన్న నితీశ్ కుమార్ త్వరలో ఆ పదవికి కూడా రాజీనామా చేయనున్నారు. అయితే బీహార్ చరిత్రలో తొలిసారి బీజేపీ నేత సీఎం పదవి చేపట్టనున్నారు. డిప్యూటీ సీఎం, బీజేపీ శాసనసభా పక్ష నేత సామ్రాట్ చౌదరి ప్రధాన పోటీదారుగా కనిపిస్తున్నారు. నితీశ్ కుమార్ కూడా ఆయనకు బహిరంగంగా మద్దతిచ్చారు. సమృద్ధి యాత్ర సందర్భంగా సామ్రాట్ చౌదరి భుజంపై చేయి వేసిన నితీశ్, ఆయనకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు.

## దక్షిణ సూడాన్‌లో మారణహోమం

### దుండగుల దాడిలో 85 మందికిపైగా మృతి

**జుబా, మార్చి 30:** దక్షిణ సూడాన్‌లో మారణహోమం చోటుచేసుకుంది. రాజధాని జుబాకు సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న జెబెల్ ఇరాక్ బంగారు గని వద్ద గుర్తుతెలియని సాయుధ దుండగులు జరిపిన దాడిలో 70 మందికి పైగా పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల సంఖ్య 85 వరకు ఉండొచ్చని కొన్ని అనధికారిక వర్గాలు చెబుతున్నాయి. బంగారు గని వద్ద తలెత్తిన ఒక వివాదమే ఈ దాడికి కారణమైంది. సాయుధ దుండగులు ఒక్కసారిగా పౌరులపై విచక్షణారహితం గా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో అనేక మంది తీవ్రంగా గాయపడ్గా, వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ఈ ప్రాంతంలోని గనిపై దాడి జరగడం ఇది రెండోసారి. దక్షిణ సూడాన్‌లో 2018 శాంతి ఒప్పందం ఉల్లంఘనలు పెరిగిపోతున్న నేపథ్యంలో ఇలాంటి హింసాత్మక ఘటనలు సాధారణమయ్యాయని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ గనుల తవ్వకాలు, స్థానిక యువత మధ్య విభేదాలు, వివిధ సాయుధ గ్రూపుల ఆధిపత్య పోరు వంటివి తరచూ ఘర్షణలకు దారితీస్తున్నాయి.

## 23 దేశాల్లో కొత్త కరోనా!

**న్యూఢిల్లీ, మార్చి 30:** కోవిడ్‌కు చెందిన బిఎ.3.2 వేరియంట్ ప్రస్తుతం మళ్లీ విజృంభిస్తోంది. ఆ వైరస్ వేరియంట్ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వ్యాపిస్తున్నది. సుమారు 23 దేశాల్లో ఆ వేరియంట్‌కు చెందిన కేసులు నమోదు అయినట్లు అమెరికాకు చెందిన సీడీసీ పేర్కొన్నది. అమెరికాలోనూ భారీగా బిఎ.3.2 వేరియంట్ కేసులు నమోదు అవుతున్నట్లు సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ పేర్కొన్నది. బిఎ.3.2 వేరియంట్‌ను సికాడా వేరియంట్‌గా పిలుస్తున్నారు. సార్స్ సీవోవీ2కి చెందిన బిఎ.3.2 వేరియంట్‌ను 2024లో తొలుత దక్షిణాఫ్రికాలో గుర్తించారు. జన్యుపరంగా బిఎ.3.2 వేరియంట్‌ను భిన్నంగా అంచనా వేస్తున్నారు. స్పైక్ ప్రోటీన్‌లో సుమారు 75 మ్యుటేషన్లు ఉన్నట్లు గుర్తించారు. మానవ కణాలను చుట్టుకునే వైరస్‌లోని భాగమే స్పైక్ ప్రోటీన్. జెఎన్.1 , ఎల్పీ.8.1 వేరియంట్లలో స్పైక్ ప్రోటీన్‌లో కేవలం 40 మ్యుటేషన్లు మాత్రమే జరుగుతున్నట్లు సీడీసీ వెల్లడించింది. బిఎ.3.2 వేరియంట్ సోకిన వారిలో సాధారణ కోవిడ్ లక్షణాలే ఉండనున్నాయి. గొంతు నొప్పి, దగ్గు, తెమడ, నీరసం, తలనొప్పి, జ్వరం లాంటి లక్షణాలు ఉంటాయి.కొందరిలో ఉదర సంబంధిత సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని సీడీసీ చెప్పింది. అమెరికాలోని సుమారు 25 రాష్ట్రాల్లో బిఎ.3.2 వేరియంట్ కేసుల్ని గుర్తించారు. అమెరికా విమానాశ్రయాల వద్ద అంతర్జాతీయ పర్యాటకుల నుంచి సేకరించిన నాసల్ స్వాబ్ శ్యాంపిళ్లలో ఈ వేరియంట్ ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న టీకాలు కొంత వరకు పనిచేస్తాయని భావిస్తున్నారు.

## 75 యేళ్ల మహిళలు.. 59,39 యేళ్ల భర్తలకు విడాకులు

**న్యూఢిల్లీ, మార్చి 30:** హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లాలో ఆసక్తికర విడాకుల కేసులు వెలుగుచూశాయి. రెండు కేసుల్లోనూ మహిళల వయసు 75 యేళ్లు కావడం గమనార్హం. ఇద్దరు భర్తలు కూడా వారి భార్యల కంటే తక్కువ వయసు ఉన్నవారే. పైగా రెండు జంటలూ కోర్టు ముందు పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నాయి. మొదటి కేసులో మహిళ, ఆమె భర్త (59), 1990లో వివాహం చేసుకున్నారు. సంతానం లేదు. కోర్టుకు సమర్పించిన వివరాల ఆధారంగా ఇద్దరి మధ్య అనేక యేళ్లుగా విభేదాలు కొనసాగుతున్నాయి. 2010 తర్వాత దూరంగా ఉంటున్నారు. సయోధ్య కోసం అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో, చివరకు విడిపోవాలని నిర్ణయించుకున్నారు. ఆమెకు ప్రతినెలా రూ.5 వేల భరణంతోపాటు గృహవసతి, వైద్య ఖర్చులు భరించేందుకు భర్త అంగీకరించారు. రెండో కేసులో 39 యేళ్ల భర్త నుంచి మహిళ విడిపోయారు. 2008లో ఇద్దరు పెళ్లి చేసుకోగా ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇద్దరి మధ్య పొరపొచ్చాలు రావడంతో 2021 నుంచి వేర్వేరుగా ఉంటున్నారు. సామరస్యంగా విడిపోవాలని కోరుకుంటున్నట్లు ఇరువురు కోర్టు విచారణ సందర్భంగా తెలిపారు. ముగ్గురు పిల్లలు వారి తండ్రితోనే నివసించేందుకు అంగీకరించారు. అయితే పిల్లలను తల్లితో కలిసేందుకు అనుమతిస్తానని కోర్టుకు భర్త హామీ ఇచ్చారు.

## యురేనియం కోసమే ఇరాన్‌పై యుఎస్ భూతల దాడులు!

### 400 కిలోలు స్వాధీనం కోసం ఒత్తిడి

**వాషింగ్టన్, మార్చి 30:** ఇరాన్‌లో భూతల దాడులకు దిగాలని ట్రంప్ భావిస్తున్నారు. అయితే ఆ దేశంలో ఉన్న సుమారు 400 కిలోల యురేనియం కోసమే అగ్రరాజ్యం గ్రౌండ్ ఆపరేషన్‌కు సిద్ధమైనట్లు తెలుస్తోంది. శుద్ధీకరించిన యురేనియంతో అణ్వాయుధాలు తయారు చేస్తున్నట్లు ఇరాన్‌పై ఆరోపణలు ఉన్న విషయం తెలిసిందే. అణ్వాయుధ సమీకరణను వ్యతిరేకిస్తూ అమెరికా-ఇజ్రాయెల్ బలగాలు సంయుక్తంగా ఇరాన్‌పై దాడికి దిగాయి. ఇరాన్‌పై దాడి ప్రారంభమై ఇప్పటికే నాలుగు వారాలు ముగిసిన క్రమంలో శాంతి ఒప్పందంలో భాగంగా యురేనియంను అప్పగించాలని ట్రంప్ వత్తిడి తెస్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. న్యూక్లియర్ మెటీరియల్ ఇరాన్ వద్ద ఉండకూడదని, అవసరమైతే బలవంతంగానైనా దాన్ని సీజ్ చేయాలని ట్రంప్ తన టీమ్‌కు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఒకవేళ చర్చల్లో ఇరాన్ తలొగ్గకపోతే సైనిక చర్యే శరణ్యమని అమెరికా భావిస్తున్నారు. పాకిస్థాన్ వేదికగా ప్రస్తుతం అమెరికా, ఇరాన్ దౌత్యవేత్తల మధ్య శాంతి చర్చలు జరుగుతున్నాయి, ఒకవేళ అన్నీ సజావుగా సాగితే అమెరికా తన భూతల దాడి ప్లాన్‌ను విరమించే అవకాశాలు ఉన్నాయి. ఇరాన్ చమురు ఎగుమతి కేంద్రమైన ఖర్గ్ దీవిని కూడా స్వాధీనం చేసుకోవాలన్న ఆలోచనలో అమెరికా ఉన్నట్లు స్పష్టమవుతున్నది. ఇరాన్‌లో ఎన్నో కీలకమైన టార్గెట్లను ధ్వంసం చేశామని, తమ మిలిటరీ ఆ పని చేసినట్లు ఆయన తన ట్రుత్ సోషల్ పోస్టులో వెల్లడించారు. తమ సైన్యం ప్రపంచంలోనే అత్యంత అద్భుతమైందని, చాలా ప్రమాదకరమైందని, దేవుడు మిమ్మల్ని దీవిస్తాడని ఆశిస్తున్నట్లు చెప్పారు.

# తెలంగాణపై కేంద్రం సవతితల్లి ప్రేమ

### వ్యాట్ సవరణ బిల్లుకు ఆమోదం

### సభలో ప్రవేశపెట్టిన

### మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** తెలంగాణ పట్ల కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. తెలంగాణ వ్యాల్యూ ఆడెడ్ టాక్స్ రిలయన్స్ బిపి మొబిలిటీ లిమిటెడ్ మొబిలిటీ సవరణ బిల్లు-2026ను శాసన సభలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరపున మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది. బిల్లుపై సభలో విస్తృత చర్చ జరగగా పాయల్ శంకర్ మాట్లాడుతూ డీజిల్, పెట్రోల్‌పై వ్యాట్ తగ్గించాలని డిమాండ్ చేయడంతో కేంద్రం రాష్ట్రాల నుంచి తీసుకొని వెళ్ళిన మొత్తం రాష్ట్రాలకు తిరిగిచెల్లిస్తే వ్యాట్ తగ్గిస్తామని చెప్పారు.



ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటి అమ్మకపు దశలో మాత్రమే పన్ను విధించే నిబంధనను రిలయన్స్ బిపి మొబిలిటీ లిమిటెడ్ తమ అంతర్గత లావాదేవీల ద్వారా అనుకూలంగా మార్చుకుంటున్నాయని ప్రభుత్వం గుర్తించింది. ఈ లోపాన్ని సరిదిద్ది, రాష్ట్ర ఖజానాకు రావాల్సిన పన్ను వాటాను సక్రమంగా రాబట్టేందుకు ఈ సవరణ అనివార్యమైంది. 18జూన్ 2025న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు జి ఓ ఎం ఎస్ నెంబర్ .73కు బిల్లు ద్వారా చట్టబద్ధత కల్పించేందుకు సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టినట్లు మంత్రి వివరించారు. ఈ బిల్లు ప్రధానంగా రాష్ట్ర ఆదాయాన్ని పెంపొందించడం, ఇంధన విక్రయాలలో పన్ను లొసుగులను అరికట్టడం లక్ష్యంగా రూపొం దించబడిందని అన్నారు.

2020 నుంచి రాష్ట్ర ఆదాయానికి గండిపడుతున్న ఎవరు పట్టించుకోలేదని, దీన్ని గుర్తించిన ప్రభుత్వం 2025 లో ఉత్తర్వులు జారీ చేసిందని, దీని ద్వారా జూలై 2024-25 వ్యాట్ ఆదాయం రూ. 220 కోట్లు సగటున 28 కోట్లు, నోటిఫికేషన్ తర్వాత జూలై 20 నుంచి ఫిబ్రవరి 2026 వరకు 250 కోట్లు సగటున 30 కోట్లు ఆదాయం సమకూరిందని తెలిపారు. మొత్తంగా ఒక ఆర్థిక సంవత్సరంలో రూ. 47 కోట్లు ఆదాయం సమకూర నుందని వెల్లడించారు. రిలయన్స్ కు సపోర్టు చేయడానికా? నష్టాన్ని నివారిం చడానికా? అనేది వారి విజ్ఞతకే వదిలి వేస్తున్నానని బిజెపి సభ్యుల విమర్శలను తిప్పికొట్టారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్ర ప్రభుత్వం భారీగా పన్నులు వసూలు చేస్తోంది. 2018-19 నుంచి 2024-2025 మధ్య కాలంలో తెలంగాణ రాష్ట్రం కేంద్రానికి పన్నులు, జీఎస్‌టి రూపంలోరూ.4.60 లక్షల కోట్ల ఆదాయాన్ని అందించింది. అయితే, కేంద్రం నుంచి రాష్ట్రాన్ని బదలాయింపులు, గ్రాంట్ల రూపంలో తిరిగి పొందింది కేవలంరూ. 1.36 లక్షల కోట్లు మాత్రమేనని మంత్రి చెప్పారు.

ఇలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బిజెపి పాలిత రాష్ట్రాల పట్ల ఒక విధంగా ,బిజెపి యేతర పాలిత రాష్ట్రాల్లో మరోలా వ్యవహరిస్తోందని, దక్షిణాది రాష్ట్రాల నుంచి పన్నురూపంలో ఆదాయం సమకూర్చి ఉత్తరాధి రాష్ట్రాలకు ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాలకు ఈ నిధులు అత్యధికంగా కేటాయిస్తోందనిజూపల్లి ఆరోపించారు.

## స్పోర్ట్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయండి

### లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదారబాద్,మార్చి30,ప్రభాతవార్త:** గచ్చిబౌలిలోని జి.ఎం.సి. బాలయోగి అథ్లెటిక్స్ స్టేడియం అప్‌గ్రేడేషన్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో షూటింగ్ రేంజ్ ఏర్పా టుతో పాటు రాష్ట్రంలో స్పోర్ట్స్ హబ్, స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపనకు కేంద్ర ఆర్థిక సహాయం చేయాలనీ లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నోత్తరాల సమయంలో పార్లమెంట్‌లో ప్రశ్నించారు. అదే విధంగా టియర్-2,టియర్-3 పట్టణాలలో ట్రాఫిక్ గృహ నిర్మాణంపై కూడా ఆందోళన వ్యక్తంచేశారు.కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సమాధానంలో, క్రీడలు రాష్ట్ర అంశం కావడంతో మౌలిక సదుపాయాల అభివృద్ధి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని తెలిపింది. అదేవిధంగా, ఖేలో ఇండియా వంటి పథకాల కింద అర్హతల మేరకు ప్రతిపాదనలను పరిశీలించి ఆర్థిక సహాయం అందిస్తామని వెల్లడించింది.ఈ సందర్భంగా చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలంగాణలో క్రీడల అభివృద్ధికి ఉన్న అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రతిపాదనలపై త్వరిత నిర్ణయం తీసుకుని, కేంద్రం సానుకూలంగా సహకరించాలని కోరారు.కేంద్రం నుంచి సమయానికి మద్దతు లభిస్తే రాష్ట్రంలో క్రీడల ప్రోత్సాహానికి, యువతకు మెరుగైన అవకాశాల కల్పనకు దోహదం అవుతుందని ఆయన తెలిపారు."వికసిత భారత్ 2047" లక్ష్యాన్ని సాధించాలంటే, ముఖ్యంగా టియర్2, టియర్3 నగరాల్లో ఆధునిక సాంకేతికత ఆధారిత ట్రాఫిక్ వ్యవస్థలు అత్యవసరం అని పేర్కొన్నారు. సింగపూర్ లండన్ వంటి నగరాల్లో అమలవుతున్న కృత్రిమ మేథా ఆధారిత సిగ్నల్స్, ఎలా ఓ టి సిస్టమ్స్, ప్రెడిక్టివ్ అనలిటిక్స్ ను భారత్‌లో కూడా అమలు చేయాలని సూచించారు.దేశవ్యాప్తంగా అమలు కోసం తక్షణమే హై లెవల్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈచలాన్ల వ్యవస్థలో ఉన్న లోపాలను ప్రస్తావిస్తూ, 2015-2025 మధ్య రూ. 61,130 కోట్ల జరిమానాల్లో కేవలం రూ 22,124 కోట్లు మాత్రమే వసూలయ్యాయని తెలిపారు.ఈ నేపథ్యంలో, ఏకీకృత రెవెన్యూ షేరింగ్ ఫ్రేమ్‌వర్క్ తీసుకురావాలని కేంద్రాన్ని కోరారు.

## రేపటి నుంచి చికెన్ షాపులు బంద్

### కంపెనీలు మార్జిన్ పెంచాలంటున్న షాపుల యాజమాన్యాలు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి చికెన్ షాపులు మూతపడనున్నాయి. పౌల్ట్రీ కంపెనీలకు వ్యతిరేకంగా రాష్ట్ర చికెన్ షాప్ యజమానులు బంద్ చేపట్టాలని నిర్ణయించారు. పౌల్ట్రీ యజమానులు మార్జిన్ తగ్గించడం వల్ల తమకు నష్టాలు వస్తున్నాయని చికెన్ షాపు యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. దీంతో పౌల్ట్రీ కంపెనీలు దిగి వచ్చేంతవరకు షాపులు మూసివేసి బంద్ చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ బంద్‌కు పలు చికెన్ షాప్స్ అసోసియేషన్స్ మద్దతు ప్రకటించాయి. ఏప్రిల్ 1 నుంచి బంద్ పాటించాలని పిలుపునిచ్చాయి. ఇప్పటికే హైదరాబాద్‌లో పలు చికెన్ షాపుల వద్ద దీనికి సంబంధించిన పోస్టర్లు వెలిశాయి. కస్టమర్లకు ముందస్తు సమాచారం అందించేందుకు చికెన్ షాపుల నిర్వాహకులు ఈ పోస్టర్లను ఏర్పాటు చేశారు. కొంతకాలంగా పౌల్ట్రీ కంపెనీలు ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటు న్నాయని చిచెన్ షాపుల యజమానులు చెబుతున్నారు. చికెన్ విక్రయాలపై వచ్చే లాభాలు చాలా తక్కువగా ఉంటున్నాయని, దీంతో నడపడం కష్టంగా మారినట్లు చెబుతున్నారు. మార్జిన్ పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. పౌల్ట్రీ కంపెనీలు దిగి వచ్చి తమ డిమాండ్‌ను నెరవేర్చేంతవరకు బంద్ కొనసాగిస్తామంటూ ప్రకటించారు. తమకు ఇచ్చే మార్జిన్‌ను వెంటనే పెంచి న్యాయం చేయాలని కోరుతున్నారు.

## అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ బిల్లుకు సభ ఆమోదం

### వామనరావు దంపతుల హత్య కేసులో నేటికీ పట్టుబడని అసలు నిందితులు: మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** న్యాయ వాదుల రక్షణ కోసం రాష్ట్ర ప్రభు త్వం తీసుకువచ్చిన తెలంగాణ అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు శాసనసభ ఆమోదం పొందింది. శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సభలో బిల్లును ప్రవేశపెట్టారు. బిఆర్ఎస్ హయాంలో న్యాయవాదులు వామనరావు దంపతులు హత్యకు గురైన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. బిఆర్ఎస్ నేతల ప్రొద్బలంతోనే వామనరావు దంపతులు హత్యకు గురైనట్లు ఆక్షేపించారు. ఈ కేసులో వామనరావు కుటుంబ సభ్యులకు న్యాయం జరగలేదని, అసలు దోష లను ఇప్పటికీ పట్టుకోలేదని, అప్పటి ప్రభుత్వ పెద్దలు అసలు దోషులకు అండగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూపాలపల్లి, సంతోష్ నగర్ ప్రాంతాల్లో లాయర్లను చంపేశారని, ఖమ్మంలో 24 దాడులు న్యాయ వాదులపై జరిగాయన్నారు. న్యాయ వాదిని బాధ్యతగా కాపాడు కోవాల్సిన అవసరం సమాజానికి ఉందని గుర్తు చేశారు. ఆ తరహా ఘట నలు పునరావృతం కాకుండా ఉండేందుకే న్యాయవాదుల రక్షణ బిల్లును తీసుకొచ్చినట్లు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లా డుతూ.. ప్రభుత్వం తీసుకొచ్చిన అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు న్యాయవాదులకు రక్షణ కవచంలా ఉండనుందన్నారు. న్యాయ వాదుల సంక్షేమంలో తెలంగాణ ప్రభుత్వం వేసిన అడుగు ఒక మైలురాయి అని కొనియాడారు. చట్టాన్ని రక్షిస్తూ పేదలకు న్యాయం చేయాలని న్యాయ వాదులకు ఆయన పిలుపునిచ్చారు. న్యాయాధి కారుల పదవుల భర్తీల్లో ఎస్సి ఎస్టిబిసిలకు



చట్టబద్ధంగా అవకాశాలు కల్పిం చాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. పన్నెండేళ్లుగా కేంద్రం లో అధికారంలో ఉంటూ ఈ విషయంలో మోది ప్రభు త్వం ఏం చేసిందని ప్రశ్నిం చారు. బిజెపి నేతలకు ఉచిత సలహాలు ఇవ్వడం తెగ ఇష్టమని ఎద్దేవా చేశారు. తెలంగాణలో బిజెపి అధికారంలో వచ్చే అవకాశమే లేదని, ఇది తెలిసిన ఆ పార్టీ ఉచిత సలహాలు ఇస్తోందన్నారు. ప్రధాని మోది బుల్డోజ్ విధానంలో దేశాన్ని పాలిస్తున్నారని ఆక్షేపించారు. తెలగాణ ఉద్యమంలో అడ్వొకేట్లు ముందుండి పోరాటాలు చేశారని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చెప్పారు. న్యాయవాదులకు ఇచ్చిన హామీ మేరకు సిఎం రేవంత్‌రెడ్డి అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్టును తీసుకొస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన మేరకు తెచ్చారని కొనియాడారు.

## క్యాతన్‌పల్లి, ఖానాపూర్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీల చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికల ముహూర్తం ఖరారు

### 4న ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్

### రాణికుముదిని షెడ్యూల్ ఖరారు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 30:** పెండింగ్‌లో ఉన్న క్యాతన్‌పల్లి(మంచిర్యాల్ జిల్లా), ఖానాపూర్(నిర్మల్‌న జిల్లా), ఇబ్రహీంపట్నం(రంగారెడ్డి జిల్లా) మున్సిపాలిటీల చైర్మన్ ఎన్నికకు ముహూర్తం ఖరారు అయింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ సోమవారం రాత్రి షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మూడు మున్సిపాలిటీల్లో ఏప్రిల్ 4 వ తేదీన చైర్మన్ ,వైస్ చైర్మన్ ఎన్నిక జరపనున్నట్టు రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. చైర్మన్ ఎన్నికలపై బిఆర్ఎస్ న్యాయపోరాటం చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కోర్టు ధిక్కరణపై హైకోర్టు లో మంగళవారం కంటెంప్ట్ ఆఫ్ కోర్ట్ పిటిషన్ వేస్తామని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సోమవారం మీడియాకు తెలిపిన విషయం తెలిసిందే. కాగా, సాయంత్రం స్పందించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్ పెండింగ్‌లో ఉన్న ఈ మూడు మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేయడం ఆసక్తిగా మారింది.

## పౌర సరఫరాల శాఖ నిర్లక్ష్యం

### రేషన్ బియ్యం దుర్వినియోగం

### తేల్చిన కాగ్ ఆడిట్

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త :** రేషన్ బియ్యం దుర్వినియోగాన్ని అరికట్టడంలో పౌరసరఫరాలశాఖ నిర్లక్ష్యాన్ని కాగ్ ఎండగట్టిఇంది. కార్డుదారుల ధృవీకరణ విషయంలో పౌరసరఫరాలశాఖ వద్ద సరైన యంత్రాంగం లేదని ఆక్షేపించింది. ఫలితంగా 83, 545 మంది అనర్హులు , మరణించిన లబ్దిదారులకు రూ.135.16కోట్ల విలువైన సబ్సిడి బియ్యం పంపిణీ అయినట్లు కాగ్ తేల్చింది. 309 మంది మరణించిన వ్యక్తుల విషయంలో రూ.6.31లక్షల మేర మోసపూరిత క్లెయిమ్‌లను గుర్తించింది. ఈ కేసుల్లో లబ్దిదారుడు ఒక్కరే రేషన్‌కార్డులో నమోదై ఉన్నారని వెల్లడించింది. ఆడిట్‌లో అనర్హ కుటుంబాల సంఖ్య 58, 225గా కాగ్ తేల్చింది. ఈకుటుంబాలకు పరిమితికి మించి ఆదాయం ఉన్నా రేషన్‌కార్డు మంజూరు చేశారని తప్పుబట్టింది. ఎప్పటికప్పుడు అనర్హులును గుర్తించి రేషన్‌కార్డుదారుల వ్యవస్థను అప్‌డేట్ చేసే విధానం పౌరసరఫరాలశాఖ వద్ద లేదని కాగ్ తేల్చింది. అనర్హులు రేషన్ బియ్యాన్ని పొందకుండా నిరోధించేందుకు రేషన్‌కార్డుల నవీకరణ కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కాగ్ సూచించింది. నిబంధనలకు విరుద్ధంగా అనర్హులకు రేషన్ బియ్యాన్ని మంజూరు చేసిన అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించింది.

## రేషన్‌కార్డుదారులకు సర్కారు శుభవార్త

### ఏప్రిల్‌లో కొత్త రేషన్‌షాపులు ప్రారంభం

### ఒకేసారి మూడు నెలల రేషన్ అందజేత

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** తెలంగాణలో రేషన్ కార్డు ఉన్నవారికి రేవంత్ సర్కార్ శుభవార్త చెప్పింది. ఎప్రిల్‌లో కొత్త రేషన్ దుకాణాలను ప్రారంభించడంతోపాటు ఒకేసారి మూడు నెలల రేషన్‌ను ఇవ్వనున్నట్లు వెల్లడించింది.దీంతో రేషన్ సరుకుల సరఫరాలో వేగం పెరుగుతుందని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. కొతనత రేషన్‌షాపులతో రేషన్ కార్డు ఉన్నవారికి ప్రయోజనం చేకూరనుంది. అదే సమయంలో ఎండలు తీవ్రమవుతున్న క్రమంలో ఒకేసారి మూడు నెలల రేషన్‌ను లబ్దిదారులకు అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఏప్రిల్‌లోనే మూడు నెలలకు సంబంధించి రేషన్ కోటాను ఒకేసారి కార్డుదారులకు పంపిణీ చేయనున్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రేషన్‌ను ఏప్రిల్ నెలలో ఒకేసారి అందిస్తారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం నుంచి రేషన్ షాపులకు పీడీఎస్ బియ్యం సరఫరాను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది.

ప్రస్తుతం రేషన్ కార్డులోని ప్రతీ సభ్యుడికి నెలకు 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నారు. ఒకేసారి మూడు నెలల కోటా పంపిణీ చేస్తున్నందున 18 కిలోల చొప్పున అందించాల్సి ఉంటుంది. సాఫ్ట్‌వేర్‌లో మార్పులు ఇంట్లో నలుగురు సభ్యులు ఉంటే 72 కిలోలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇక ఐదుగురు సభ్యులు ఉంటే 90 కిలోలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇక అంత్యోదయ కార్డు కలిగి ఉన్నవారికి నెలకు 35 కిలోల చొప్పున అందిస్తారు. అంటే మూడు నెలలకు 105 కిలోలు పంపిణీ చేయాల్సి ఉంటుంది. అయితే పోర్టబిలిటీ సౌకర్యం అందుబాటులో ఉండటం వల్ల లబ్దిదారులు సమీపంలోని రేషన్ షాపుల్లో ఎక్కడైనా రేషన్ పొందవచ్చు. ఒకేసారి మూడు నెలల బియ్యం అందిస్తుండటంతో బయోమెట్రిక్ మెషిన్ల సాఫ్ట్‌వేర్ అప్డేట్ చేస్తున్నారు.

ఒకేసారి మూడు నెలల వేలిముద్ర వేసేలా మెషిన్లలో మార్పులకు శ్రీకారం చుట్టారు. అయితే మూడు నెలల స్టాక్ అందుబాటులో ఉంచేందుకు రేషన్ దుకాణాల్లో స్థలం సరిపోడం లేదు. దీంతో డిమాండ్ కనుగుణంగా డీలర్లకు సరఫరా చేయలని పౌర సరఫరాలశాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు.

## పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణం అస్తవ్యస్తం

### తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కాగ్

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త :** గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ పనితీరుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక (కాగ్) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రధానంగా తెలంగాణ గ్రామీణ రహదారుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని స్పష్టం చేసింది. తగినంత సన్నాహక పనులు, సర్వేలు చేపట్టకుండా అనేక రహదారిపనులను చేపట్టడంతో పనులు అసంపూర్తిగా మిగిలాయని తేల్చింది. తెలంగాణ గ్రామీణ రహదారుల నిర్వహణా విధానం-2017 కింద పంచాయతీరాజ్ ఇంజనిరింగ్ విభాగం అనేకల కీలక బాధ్యతలను నెరవేర్చలేదని మండిపడింది. ప్రతీ సంవత్సరానికి సంబంధించి వార్షిక గ్రామీణ రహదారుల నిర్వహణ ప్రణాళికలను సిద్ధం చేయడం, అవసరమైన కమిటిలను ఏర్పాటు చేయడంతోపాటు రోడ్డు వినియోగదారుల సర్వేలను నిర్వహించడం లేదని అక్షింతలు చల్లింది. కేంద్ర గ్రాంట్‌లకు సరిపోను వాటాను సకాలంలో విడుదల చేయలేదని మండిపడింది. రహదారులపై వంతెనలతో కూడిన చెక్ డ్యామ్ పనులను పూర్తి చేసి గ్రామాలకు రాకపోకల సౌకర్యం కల్పించడంలో ఎనిమిది సంవత్సరాలు గడిచినా ఆ లక్ష్యాన్ని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ సాధించలేదని కాగ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రమాణాలకు విరుద్ధంగా 15 రహదారులను అధిక మందంతో నిర్మించడం ద్వారా రూ.1.18కోట్ల మేర నిధులు అదనంగా ఖర్చు అయ్యాయని పేర్కొంది. పిఎంజిఎస్‌వై పనుల తాలూకు నాణ్యతను ప్రజాప్రతినిధులతో కలిసి ఇంజనీరింగ్ సిబంది ఉమ్మడి తనిఖీల ను నిర్వహించలేదని కాగ్ దుయ్యబట్టింది. పంచాయతీరాజ్- గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలో నిర్మించిన అయిదేళ్లలోపే అనేక నాణ్యతాలోపం కారణంగా అనేక రహదారులు దెబ్బతిన్నాయని కాగ్ తన తనిఖీల్లో తేల్చింది. అదేవిధంగా రాష్ట్రంలోని పలు పంచాయతీలు మంజూరు చేసిన నిధులకు మించి వినియోగించాయని కాగ్ తేల్చింది. పంచాయతీలకు అత్యవసర ఖర్చుల కింద ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో మంజూరు చేసిన మొత్తం కంటే అధికంగా పంచాయతీలు వినియోగిస్తున్నట్లు ఆడిట్‌లో తేలిందని స్పష్టం చేసింది.అదనంగా ఖర్చు చేసిన మొత్తాన్ని తిరిగి స్వాధినం చేసుకోవాలని పంచాయతిరాజ్‌కమిషనర్‌కు సూచించింది.

## నీటిపారుదల శాఖ పనితీరుపై కాగ్ అక్షింతలు

### మోడికుంటవాగు ప్రాజెక్టు కాంట్రాక్టు సంస్థకు అధికారుల అనుచిత లబ్ధి

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త :** తెలంగాణ నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధిశాఖ (ఐసిఎడి) పనితీరుపై కాగ్ అక్షింతలు చల్లింది. మోడికుంటవాగు జలాశయ నిర్మాణ కాంట్రాక్టు సంస్థకు ఇచ్చిన మొబిలైజేషన్ అడ్వాన్స్‌పై వడ్డిని వసూలు చేయకపోవడంతో సదరు సంస్థకు అనుచిత లబ్దిచేకూరిందని మండిపడింది. 2006 నుండి 2023 మార్చి వరకు మొబిలైజేషన్ అడ్వాన్స్‌పై రూ.6.89కోట్ల మేర వడ్డిని వసూలు చేయడంలో ఐసిఎడి తీవ్ర నిర్లక్ష్యం చూపిందని స్పష్టం చేసింది. మొబిలైజేషన్ అడ్వాన్స్ విడుదలకు ముందే భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయలేదని , అటవీ అనుమతులు పొందలేదని మండిపడింది. అదే విధంగా.. భూసేకరణ, పునరావాస అంశాలను పూర్తిచేయకుండా చిన్నతరహా సాగునీటిపారుదల ప్రాజెక్టులను చేపట్టడంతో 16 సంవత్సరాల సుదిర్ఘకాలం తర్వాత కూడా ఆయకట్టుకు సాగునీరు అందించడంలో నీటిపారుదలశాఖ విఫలమైందని కాగ్ తేల్చింది. దాంతో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులపై ఇప్పటి వరకు చేసిన రూ.19.38కోట్ల వ్యయం వృథా అయిందని స్పష్టం చేసింది.

## తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారులను గుర్తించి, గౌరవించాలి

### వారికి పునరావాసం కల్పించాలి

### మండలిలో స్పెషల్ మెన్షన్స్‌లో ప్రభుత్వాన్ని కోరిన విజయశాంతి

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త,** తెలం గాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి వారికి తగిన గౌరవం కల్పిస్తూ, వారికి పునరావాసం కల్పించాలని శాసనమండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం జరిగిన శాసనమండలి బడ్జెట్ సమావేశాల్లో భాగంగా స్పెషల్ మెన్షన్ల సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయ శాంతి మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమం లో ప్రాణాలర్పించిన వారి కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని, నెలకు రూ.25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్ ఇస్తామనీ హామీ ఇచ్చామని గుర్తు చేశారు.



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటిపోయిందని, ఉద్యమకారులకు ఇంకా న్యాయం జరగడం లేదన్నారు. ఉద్యమకారులకు ప్రయారిటీ ఇస్తామని చెప్పామని ఇపుడు ఉద్యమకారులు అదే విషయాన్ని అడుగుతున్నారని అన్నారు. ఉద్యమకారులపై ఉన్న కేసులు ఎత్తివేసి జూన్ 2న వారికి తెలంగాణ ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇస్తామని హామీ ఇచ్చామని, అది ఇంకా ఇవ్వలేదన్నారు.

ఉద్యమకారులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలు వెంటనే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

తెలంగాణ రాష్ట్రం కోసం తెగించి పోరాడిన ఉద్యమకారులు లేకపోతే ఈరోజు రాష్ట్రంలో ముఖ్యమంత్రి కానీ, మంత్రులు కానీ ఉండేవారా? అని విజయశాంతి ప్రశ్నించారు. పదవుల కంటే ముందు ఉద్యమకారుల త్యాగాలను గుర్తించాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు వివిధ సందర్భాలలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉద్యమకారులను ఆదుకోవడం ప్రభుత్వం బాధ్యత అన్నారు. ఉద్యమకారుల విషయంలో ఈ ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తిస్తే, కాంగ్రెస్ పార్టీ చరిత్రలో నిలుస్తుందని, లేదంటే చారిత్రక తప్పిదంగా మిగిలిపోతుందని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, వారికి తగిన గౌరవం, పునరావాసం కల్పించాలని ప్రభుత్వాన్ని విజయశాంతి కోరారు.

## ఒయులో మూడేళ్లుగా 43 పాఠ్య విభాగాలను సవరించలేదు

### 82 మందికి పిహెచ్‌డి, ఎన్ఇటి, ఎస్ఇటి అర్హత లేకుండానే నియామకాలు

### ఆర్థిక నివేదికలో ప్రకటించిన కాగ్

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త :** రాష్ట్రంలో వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయంపై కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) నివేదికలో పలు అంశాలను ప్రస్తావించింది. యూనివర్సిటీలోని పాఠ్యప్రణాళి కలను ప్రతి మూడేళ్లకొకసారి సవరించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) సిఫారసు చేసింది. అందులో భాగంగా ప్రతి మూడేళ్లకొకసారి యూనివర్సిటీలు తమ సిలబస్‌లో మార్పులు చేసుకోవలి ఉంటుంది. సిలబస్ మార్పులు ప్రస్తుత మార్కెట్‌కి అనుగుణంగా, ఉపాధి అవకాశాల మేరకు ఈ పాఠ్యప్రణాళికలో మార్పులను చేస్తూ ఉంటారు. అయితే యూనివర్సిటీలోని 43 విద్యా విభాగాల్లో గత మూడేళ్లుగా పాఠ్యప్రణాళికలను సవరించలేదని కాగ్ తన నివేదికలో తెలిపింది. అయితే యూనివర్సిటీలోని 39 విభాగాలకు సంబంధించిన సిలబస్‌ను మాత్రమే సమీక్షించి సవరించినట్టు తెలిపిందని కాగ్ ప్రకటించింది. అయితే పాఠ్యప్రణాళికలను సవరించకపోవడంపై ఆడిట్ లేవనెత్తిన అభ్యంతరానికి ప్రభుత్వ స్పందనలో సమాధానం లేదని పేర్కొంది. యూనివర్సిటీలో 2019-20 విద్యా సంవత్సరం నుంచి చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్(సీబీసీఎస్) విధానాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపిందని కాగ్ నివేదికలో పేర్కొంది. 2022-23 విద్యా సంవత్సరం నుంచి పీజీ కోర్సుల్లో 80 క్రెడిట్లతో సీబీసీఎస్‌ని అమలు చేస్తున్నట్టు తెలిపిందని. .అయితే యూనివర్సిటీ తన వాదనకు మద్దతుగా ఆధారపత్రాలను ఆడిట్‌కు సమర్పించలేదని కాగ్ తన నివేదికలో పేర్కొంది. బోధన, అభ్యాసన, మూల్యాంకన విభాగంపై స్పందిస్తూ 82 మంది ఉపాధ్యాయులన (నియమించిన మొత్తం ఉపాధ్యాయుల్లో 10 శాతం) పీహెచ్‌డీ, నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(ఎన్‌ఈటీ) నెట్, స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్(ఎస్‌ఈటీ)సెట్ అర్హత లేకుండానే నియమించడమైందని కాగ్ తన నివేదికలో పేర్కొంది.

## సింగరేణిలో రూ.251 కోట్ల డీజిల్ దుర్వినియోగం: కాగ్ అక్షింతలు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** తెలంగాణలోని ఏడు విద్యుత్ ప్రభుత్వరంగ సంస్థలు 11 విద్యుత్‌యేతర సంస్థలు రూ. 95204.74కోట్లు టర్నోవర్ నమోదు చేయడమే కాకుండా తెలంగాణ జిఎస్‌డిపిలో 7.25 వాటాను కలిగి ఉందని కాగ్ ప్రకటించింది. తెలంగాణ సింగరేణిలో రూ.251కోట్ల డీజిల్ దుర్వినియోగం చేశారని, బొగ్గు ఉపరిత రవాణాచార్జీలు నిర్ణయిం చేప్పుడు వాస్తవ వ్యయం పరిగణలోకి తీసుకోకుండా వినియోగదారుల నుంచి రూ.1078 కోటులన అధికంగా వసూలు చేశారని కాగ్ నివేదిక ఎత్తిచూపింది. మార్చి 2023తో ముగిసిన కాలానికి ప్రభుత్వరంగ సంస్థలపై భారత కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్‌నివేదిక సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. ఓబిఆర్ కాంట్రాక్టులకు సంబంధించిన ఒప్పంద నిబంధనలు సకాలంలో అమలు చేయకపోవడంతో రూ.74 కోట్ల అదనపు భారం పడింది. కోల్ రవాణాలో లోపాలు రూ.25.59 కోట్ల నష్టం వాటిల్లింది.ఓబిఆర్ కాంట్రాక్టులలో మట్టిని ఎత్తిపోసే భారీ యంత్ర పరికరాలను వినియోగించడం కోసం సాంప్రదాయక పరికరాల కంటే 12.36శాతం నుంచి 32శాతం ఎక్కువ రేట్లు ఉన్నాయనీ పేరొనకంది . పర్యావరణ నిబంధనలు పాటించడంలేదు. ముగ్గురు ఒబిఆర్ కాంట్రాక్టర్లు వ్యర్థజలాల శుద్ధికేంద్రాలను ఏర్పాటు చేయలేదు. భూగర్భ గనులు తిరిగినింపే అంశంలోకూడా సరిగా నిర్వహించలేదు. శ్రీరాంపూర్ ప్రాంతీయ కార్యాలయం బూడిద ప్రాసెస్ చేసిన ఉపరితల పదార్థాల కన్నా నది ఇసుకకు ప్రాధాన్యత ఇచ్చింది. ఈచర్య ఖరీదుతోకూడుకున్నది పర్యావరణంగా కూడా అనుకూలంగా ఉండదని కాగ్ అభిశంసించింది. నష్టాల్లో ఉన్న సంస్థల పనితీరు సమీక్షి ంచాలి. ఖాతాలు త్వరగా పూర్తి చేయాలని కాగ్ సూచించింది. మూతపడిన సంస్థలపై పునరుద్ధరణ లేదా మూసివేతపై నిర్ణయం అవసరమని పేర్కొంది. డీజిల్ వినియోగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. కాంట్రాక్టుల్లో కఠిన నిబంధనలు అమలు చేయాలి. పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాలని నివేదిక స్పష్టం చేసింది.2023 మార్చి వరకు పబ్లిక్ సెక్టార్ పనితీరుపై కంప్రోల్టర్ అండ్ ఆడిటింగ్ జనరల్ కీలక వ్యాఖ్యలు చేసింది. 2023 మార్చి వరకు పబ్లిక్ సెక్టార్ పనితీరుపై కీలక సమాచారం వెలువడింది. రాష్ట్రంలో మొత్తం 83 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నట్టు నివేదిక స్పష్టం చేసింది.వాటిలో 16 సంస్థలు మూతపడినవి లేదా లిక్విడేషన్లో ఉన్నట్టు వెల్లడైంది. 67 పని చేస్తున్న సంస్థల్లో 49 సంస్థలు ఖాతాలు సమర్పించడంలో ఆలస్యం చేశాయి. కేవలం 18 సంస్థల పనితీరే విశ్లేషణకు తీసుకున్నట్టు కాగ్ తెలిపింది. ఈ 18 సంస్థల టర్నోవర్ రూ.95,204 కోట్లుగా నివేదిక


### 18 ప్రభుత్వరంగ సంస్థల టర్నోవర్ 95,205 కోట్లు, ఖాతాలు సమర్పించని 49 సంస్థలు

చెబుతోంది. 18 సంస్థల్లో 11 నష్టాల్లో, కేవలం 6 సంస్థలు లాభాల్లో ఉన్నాయి. మొత్తం పెట్టుబడులు రూ. 98,572 కోట్లుగా నమోదయ్యాయి. 9 సంస్థల నెట్ విలువ పూర్తిగా నష్టాలతో కరిగిపోయింది. మొత్తం నెటివిలువ రూ.50,930 కోట్లుగా తగ్గింది. 71 సంస్థలు సమయానికి ఖాతాలు సమర్పించకపోవడంపై కాగ్ ఆందోళన వ్యక్తం చేసింది. 15 సంస్థల్లో 9 సంస్థలు స్వతంత్ర డైరెక్టర్ల నియామకం చేయలేదు. ఎక్కడా ఇండిపెండెంట్ డైరెక్టర్ల సమావేశాలు నిర్వహించలేదు. 5 సంస్థల్లో ఆడిట్ కమిటీ లేకపోవడం గమనార్హం. 9 సంస్థల్లో ఎన్ ఆర్ సి కమిటీ ఏర్పాటు కాలేదు. 2023 మార్చి 31 నాటికి, తెలంగాణలోని 83 రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు భారత కంట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ ఆడిట్ పరిధిలో ఉన్నాయి. మొత్తం 83 ఎస్పీఎస్‌ఈలలో, ఎనిమిది ఎస్పీఎస్ ఇ లు విద్యుత్తు రంగానికి, 75 ఎస్పీఎస్ఇ లు విద్యుత్తేతర రంగానికి చెందినవి ఉన్నాయి. ఈ 83 ఎస్పీఎస్‌ఈలలో, 16 ఎస్పీఎస్ఇ లు పనిచేయడం లేదు లేదా మూసివేత / విభజన దశలో ఉన్నాయి.పని చేస్తున్న 67 ఎస్పీఎస్ఇలలో, 2023 సెప్టెంబరు 30 నాటికి మూడు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలు పద్దులు బకాయిలో ఉన్న లేదా ఆడిటు సమాచారం అందించని 49 ఎస్పీఎస్‌ఈలను (73 శాతం) ఆర్థిక పనితీరు విశ్లేషణలో పొందుపరచలేదు. మిగిలిన 18 ఎస్పీఎస్‌ఈలు (విద్యుత్తు రంగం ఏడు ఎస్పీఎస్ఇలు, విద్యుత్తేతర రంగం 11 ఎస్పీఎస్ఇలు) రూ. 95, 204.74 కోట్ల వార్షిక టర్నోవరును నమోదు చేశాయి. ఇది 2022-23 లో తెలంగాణ జిఎస్‌డిపి లో 7.25 శాతానికి సమానం. 2023 మార్చి 31 నాటికి ఈ 18 ఎస్పీఎస్‌ఈలో ఈక్విటీ, దీర్ఘకాలిక ఋణాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతరుల పెట్టుబడి రూ .98,572.08 కోట్లుగా ఉంది. పనిచేస్తున్న 18 ఎస్పీఎస్‌ఈలకుగానూ, ఆరు ఎస్పీఎస్‌ఈలు రూ. 3,857.48 కోట్ల లాభాలను ఆర్జించాయి, 11 ఎస్పీఎస్‌ఈలు 11,969.66కోట్లు నష్టం చవిచూశాయని తెలిపింది.ఎస్‌పిఎస్ ఇల నికర నిలువ - రూ50930.63 కోట్లు ఉంది.

# పారాక్వాట్ గడ్డిమందును నిషేధించండి

## కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ అసెంబ్లీ విజ్ఞప్తి

### కీలక తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** రాష్ట్ర అసెంబ్లీలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వ్యవసాయంలో విస్తృతంగా వినియోగిస్తున్న పారాక్వాట్ డైక్లోరైడ్ 24 ఎస్ఎల్ ప్రమాదకర గడ్డిమందును తక్షణమే నిషేధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ, పర్యావరణ ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం ఈ తీర్మానం చేసిందని స్పష్టం చేశారు. పారాక్వాట్ వినియోగం వల్ల రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, అనేక సందర్భాల్లో ఇది ప్రాణాంతకంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్షణికావేశంలో ఈ రసాయనం సేవించడం వల్ల జరుగుతున్న ప్రాణ నష్టాలు కూడా ఆందోళనకరంగా ఉన్నాయని సభకు తెలిపారు.
ప్రజా రోగ్యం, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ దృష్ట్యా ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. పారాక్వాట్ వంటి అత్యంత విషపూరిత రసాయనాల వినియోగం సుస్థిర, సహజ వ్యవసాయ విధానాలకు విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే యూరప్ సహా అనేక దేశాల్లో పారాక్వాట్ పై నిషేధం లేదా కఠిన నియంత్రణలు అమలులో ఉన్నాయని గుర్తుచేశారు. రాష్ట్రంలో కూడా ఇలాంటి ప్రమాదకర రసాయనాల వినియోగాన్ని అరికట్టడం అత్యవసరమని పేర్కొన్నారు. పారాక్వాట్‌కు ప్రత్యామ్నాయంగా అనేక గడ్డిమందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.
కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని పారాక్వాట్ డైక్లోరైడ్ తయారీ, దిగుమతి, నిల్వ, రవాణా, విక్రయం, వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం విధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ అసెంబ్లి కోరింది. ఈ తీర్మానం ద్వారా రైతుల సంక్షేమం, ప్రజల ఆరోగ్య రక్షణతోపాటు పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.



# దేశ వికాసంలో రాజస్థాన్ ప్రజల పాత్ర ఎనలేనిది: గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 30:** దేశ వికాసంలో రాజస్థాన్ ప్రజల పాత్ర ఎనలేనిదని గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. సోమవారం లోక్‌భవన్‌లో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌లో భాగంగా రాజస్థాన్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లో ఉంటున్న రాజస్థాన్ వాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకలకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా తన సతీమణితో పాటుగా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గవర్నర్ మాట్లాడుతూ... దేశంలో సంస్కృతి, సాంప్ర దాయాల పరంగా రాజస్థాన్‌కు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. భగవాన్ శ్రీ రాముడు, జన్మభూమి స్వర్గం కంటే మిన్న అని చెప్పారని.. వారి స్ఫూర్తితోనే రాజస్థాన్ ప్రజలు దేశ అభివృద్ధి, సాంస్కృతిక వికాసంకు గొప్ప సేవ చేస్తున్నారని గవర్నర్ కొనియాడారు. గవర్నర్ సందేశం అనంతరం ఏర్పాటు చేసిన రాజస్థాన్ సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను కట్టిపడేశాయి. కార్యక్రమంలో గవర్నర్ సంయుక్త కార్యదర్శి శ్రీ శశికిరణా చారి, ఇతర లోక్‌భవన్ ఉన్నతాధికారులు, రాజస్థాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అప్పులు తెచ్చారు గానీ, ఆస్తులు పెంచని సర్కార్

### కాగ్ రిపోర్టుతో అయినా కళ్లు తెరవండి: హారీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 30:** రెండేళ్ల మూడు నెలల కాంగ్రెస్ పాలనలో ఆర్థిక క్రమశిక్షణ గాడి తప్పిందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ నివేదిక స్పష్టం చేసిందని, కాగ్ రిపోర్టు రేవంత్ సర్కారు కు చెంప పెట్టు లాంటిదని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హారీశ్‌రావు వ్యాఖ్యానించారు. మేము ఈ ప్రభుత్వ పని తీరుపై నిలదీస్తున్న అంశాలనే కాగ్ ప్రస్తావించింది. సంక్షేమ రంగానికి, సాగునీటి రంగానికి ప్రభుత్వం బడ్జెట్ పత్రాల్లో భారీగా నిధులు పెట్టి, ఖర్చు పెట్టడంలో ఘోరంగా వైఫల్యం చెందిన విషయాన్ని కాగ్ బయటపెట్టిందన్నారు. తెచ్చిన అప్పులను రాష్ట్రానికి ఆస్తులుగా మలచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కాగ్ తేల్చి చెప్పిందన్నారు. రాష్ట్రాన్ని భారీ రెవెన్యూ లోటు దిశగా తీసుకెళ్తున్నారని కాగ్ చెప్పకనే చెప్పిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి విడుదల చేసిన రిపోర్టు లోనే కాగ్ అనేక ప్రభుత్వ లోపాల్ని తప్పు పట్టిందని, 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ ప్రభుత్వం లెక్కలేనన్ని తప్పులు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్ ఎంత అన్ రియలిస్టిక్? ఎంత అన్ ప్లాన్డ్‌గా ఉందో మేం చెప్పడం కాదు.. ఈరోజు కాగ్ రిపోర్టుతో తేటతెల్లమైందన్నారు. కాగ్ రిపోర్టు పరిశీలిస్తే..బడ్జెట్ ఎస్టిమేట్స్ 2,21,242 కోట్లు ఉంటే, యాక్చువల్స్ 1,67,804 కోట్లు. అంటే బడ్జెట్ అంచనాల్లో చేరుకున్నది కేవలం 76శాతం.రెవెన్యూ ఎక్స్ పెండీచర్ 2,20,945 కోట్లు ఉంటే, యాక్చువల్స్ 1,77,224 కోట్లు. అంటే చేరుకున్నది 80శాతం.బడ్జెట్ అంచనాలకు, యాక్చువల్స్‌కి ఇంత గ్యాప్ ఉంటుందా? అని ప్రశ్నించారు. ఒక్క కరోనా సమయం తప్ప ఎన్నడూ ఇంతగా రెవెన్యూ డెఫిసిట్ లేదు. ఇప్పుడు కరోనా లేదు, పెద్ద నోట్ల రద్దు లేదు ఏదీ లేదు.. రెవెన్యూ డెఫిసిట్ మాత్రం మైనస్ రూ.9420 కోట్లకు ఎందకు పోయినట్లు? రాష్ట్రాన్ని ఎవరు దివాళా తీసారు? అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి రాగానే రేవంత్‌రెడ్డి తీసుకున్న పద్ధతి పాడు లేని నిర్ణయాలు, విధ్వంసకరమైన విధానాలు కారణం. వ్యాపారం, రియల్ ఎస్టేట్, పరిశ్రమలు ఇలా ఒక్కటి కాదు అన్ని రంగాలు కుదేలయ్యాయి. దీంతో జీఎస్‌టి, ఎక్సైజ్, స్టాంప్ డ్యూటీ, వాహన పన్నులు వంటి ఆదాయ వనరుల్లో ఘణనీయమైన తగ్గుదల నమోదైంది. కాగ్ రిపోర్టు ప్రకారం, మీరు సాధించిన 9శాతం వృద్ధి రేటుతో వన్ ట్రిలియన్ డాలర్ అసాధ్యం అన్నది సుస్పష్టమని సిఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు.

# కౌశిక్‌రెడ్డి ప్రవర్తన దారుణం

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** కౌశిక్‌రెడ్డి ప్రవర్తన దారుణంగా ఉందని కెటిఆర్ దృష్టిలో పడటానికి ఆయన హంగామాచేస్తున్నారని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. సిఎల్‌పిలో చిట్‌చాట్ చేస్తూ సన్నబియ్యం అన్నం బాగుందనిఅన్నారు. దేశవ్యాప్తంగా మోడీ సన్నబియ్యం ఇవ్వడంలేదని మేం మాత్రమే ఇస్తున్నామని ఆయన తెలిపారు. రాహుల్‌గాంధీ ఆంక్షలను తెలంగాణ కాంగ్రెస్ నెరవేర్చింది.పెద్దలసభలో పేపర్లు చించివేయడం మంచి పరిణామం కాదు అని ఆవేదన వ్యక్తంచేశారు.కెసిఆర్ కుటుంబం ఇసుక దోపిడి చేసింది సిబిసిఐడి విచారణ చేస్తున్నామని తెలిపారు. ఉద్యమ కారులను ఆదుకుంటామని తెలిపారు.గిగ్‌వర్కర్ పాలసీ బాగుందని అన్నారు.

# దేశంలో బొగ్గు నిల్వలు పుష్కలంగా ఉన్నాయి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** అంతర్జాతీయంగా నెలకొన్న ఘర్షణాత్మకమైన వాతావరణం వల్ల బొగ్గు సరఫరా, ఎనర్జీ సెక్యూరిటిపై ప్రభావాన్ని కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షి స్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం రాజ్యసభలో బొగ్గు మంత్రిత్వ శాఖకు సంబంధించిన వివిధ లిఖితపూర్వక ప్రశ్నలకు కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. భారతదేశంలోని బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్లాంట్స్ ఎక్కువగా దేశీయంగా ఉత్పత్తి అయిన బొగ్గుపైనే ఆధారపడి ఉన్నాయన్నారు. దేశీయంగా వరుసగా రెండో ఏడాది ఒక బిలియన్ టన్ను బొగ్గు ఉత్పత్తి జరిగిందన్నారు. ఇది బొగ్గు రంగంలో మనం సాధించిన ఆత్మనిర్బరతకు నిదర్శనం అన్నారు. అందుకే మన బొగ్గు రంగంపై ప్రస్తుత యుద్ధ పరిస్థితులు ప్రభావం చూపడం లేదన్నారు. ప్రస్తుతానికి భారతదేశంలో పుష్కలంగా బొగ్గు నిల్వలున్నాయని, గనుల వద్ద సుమారు 165 మిలియన్ టన్నులు, థర్మల్ పవర్ ప్లాంట్స్ వద్ద దాదాపుగా 54 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నాయని వెల్లడించారు. ఇంత పెద్దమొత్తంలో, సరిపోయేంత బొగ్గు నిల్వలలున్నందున విద్యుదుత్పత్తి సంస్థలకు, ఇతర నాన్ రెగ్యులేటెడ్ సెక్టార్‌కు నిరంతరాయంగా బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని వెల్లడించారు. బొగ్గు మంత్రిత్వశాఖ సబ్సిడరీ అయిన కోలిండియా లిమిటెడ్ బొగ్గు గనుల వేలాన్ని పెంచినందున, అన్ని రంగాలకు అవసరమైన బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి ఢోకా లేదన్నారు.

# ఆటోగ్యాస్ కొరతను అధిగమించేందుకు ప్రజా రవాణా సేవల విస్తరణకు యోచన

### గ్యాస్ సరఫరా పెంచాలని కోరుతూ కేంద్ర పెట్రోలియం మంత్రికి మంత్రి ఉత్తమ్ లేఖ

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ పరిణామాల నేపథ్యంలో గ్యాస్ ఆధారిత వాహనాలకు సహజవాయువు కొరత ఉన్నందున ప్రత్యామ్నాయంగా ప్రజా రవాణా సేవలను మరింతగా విస్తరించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాలశాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఎల్‌పిజి గ్యాస్ కొరతతో ఆటోలతోపాటు గ్యాస్ ఆధారిత వాహనాలు ఎదుర్కొంటున్న ఇక్కట్లపై సోమవారం పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారులు, ఎల్.పి.జి గ్యాస్ సరఫరా చేస్తున్న ప్రధాన పంపిణీదారులతో సచివాలయంలో ఆయన అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు.ప్రయివేటు సంస్థలతో ఏర్పడిన కొరతను భర్తీ చేయడానికిగాను ఐ.ఓ.సి.ఎల్, హెచ్.పి.సి.ఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థలు ముందుకు రావాలన్నారు.వాహనాలకు సరఫరా చేసే ఎల్.పి.జి గ్యాస్ సరఫరాలో ఏర్పడ్డ సంక్షోబాన్ని నివారించేందుకు సరఫరాలను పెంచాలని కేంద్ర పెట్రోలియంశాఖామంత్రి హార్దిప్‌సింగ్ పూరీకి లేఖ రాయాలని పౌర సరఫరాలశాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. గ్యాస్ ఆధారిత ఆటోలతోపాటు ఆటోలకు రోజువారీగా 202 మెట్రిక్ టన్నుల గ్యాస్ అవసరం ఉండగా అంతర్జాతీయస్థాయిలో ఏర్పడ్డ సంక్షోభంతో రోజు వారీగా 147 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉందని మంత్రి ఉత్తమ్ వివరించారు.

# పూర్తిస్థాయిలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి

### సరఫరా ధరల నిర్ణయానికి కమిటీ

### డిమాండ్‌కు అనుగుణంగా గరిష్టస్థాయి సరఫరా

### రాష్ట్రాలకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశాలు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** ప్రస్తుతం క్రమేపీ పెరుగుతున్న డిమాండ్, సరఫరాను దృష్టిలో ఉంచుకుని థర్మల్ విద్యుత్ కేంద్రాలు పూర్తి స్థాయి సామర్థ్యంతో పనిచేయాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ రాష్ట్రాలను ఆదేశించింది. ఇప్పటికే డిమాండ్ పెరుగుతున్న దృష్ట్యా రాబోయే రోజుల్లో ఇది మరింత భారీగా పెరిగే అవకాశం ఉందని అందుకు అనుగుణంగా అవసరమైన చర్యలను తీసుకోవాలని సోమవారం రాష్ట్రాలకు పంపిన విద్యుత్ విధానంలో సూచించింది. విద్యుత్ తగినంతగా అందుబాటులో ఉండేలా చూడటానికి, దిగుమతి చేసుకున్న బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాల నుండి ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. తదనుగుణంగా, విస్తృత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా విద్యుత్ సరఫరా గరిష్ట స్థాయిలో ఉండేలా చూడాలని తెలిపింది.
విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కలిగిన సంస్థలకు విద్యుత్ సరఫరా చేసే ధరలను నిర్ణయించడానికి విద్యుత్ మంత్రిత్వ శాఖ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది. దిగుమతి చేసుకున్న బొగ్గును ఉపయోగించి విద్యుత్ ఉత్పత్తి చేయడానికి అయ్యే ప్రస్తుత బొగ్గు ధర, రవాణా, నిర్వహణ ఖర్చులు వంటి వ్యయాలను, అలాగే లాభాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని, ఆ కమిటీ నిర్ణయించే ప్రామాణిక ధరలు రూపొందించనుందని పేర్కొంది.
ఈ విద్యుత్ కేంద్రాలు మొదటిగా ఒప్పందాలు కలిగిన సంస్థలకు విద్యుత్‌ను సరఫరా చేసిన తదుపరి మిగిలిన మిగులును పవర్ ఎక్స్ఛేంజీలో విక్రయించాల్సి ఉంది. ప్లాంట్ దాని పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా జనరేటర్ ప్రస్తుత నిబంధనల ప్రకారం బొగ్గు నిల్వను నిర్వహించాలని రాష్ట్రాలకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ విజ్ఞప్తి చేసింది.

# మహిళల్లో అక్షరాస్యత పెంపునకు సెర్ప్ ప్రత్యేక చర్యలు

### ఆడబిడ్డలంతా అక్షరమాల కార్యక్రమంలో చేరండి

### స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పిలుపు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** మహిళల సాధికారతకు అక్షరాస్యతే బలమైన పునాది అనే దృక్పథంతో ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మకు అక్షరమాల కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విశేష ఫలితాలను అందిస్తోంది. మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులను లక్ష్యంగా చేసుకుని చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆదరణ పొందుతోంది. చదువుకోలేక వెనుకబడిన మధ్యవయసు, వృద్ధ మహిళలకు మరోసారి విద్యా అవకాశాన్ని కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. కుటుంబ బాధ్యతల వల్ల చదువు మధ్యలో ఆగిపోయిన మహిళలు తిరిగి పుస్తకాలు పట్టడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలుస్తోంది. గ్రామ స్థాయిలోనే ఎస్‌హెచ్‌జిల ఆధారంగా తరగతులు నిర్వహించడం వల్ల మహిళలు సౌకర్యవంతంగా పాల్గొనే వాతావరణం ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7,01,357 మంది మహిళలు అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో చదువు నేర్చుకునేందుకు ఆదివారం నిర్వహించిన అక్షరాస్యత పరీక్షకు 6,31,656 మంది హాజరయ్యారు. పరీక్ష ఫలితాలు ఏప్రిల్ లేదా మేలో వచ్చే అవకాశాలున్నాయి. ఈ పరీక్షలో ఉత్తీర్ణత పొందిన వారు పదో తరగతి పరీక్షలకు హాజరు కావచ్చు. ఒక్కో గ్రామంలో 40 నుంచి 60 మంది నిరక్షరాస్య మహిళలను గుర్తించి, వారికి స్థానికంగా 8 నుంచి 10 మంది వలంటీర్లు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోధనా విధానం మహిళలు చాలా సులభంగా నేర్చుకునే విధంగా ఉంది. 16 వారాల శిక్షణ కార్యక్రమం 2025 అక్టోబర్‌లో ప్రారంభమైంది. నోటుబుక్స్, ప్రాథమిక అభ్యాస సాధనాలను ఉచితంగా అందచేశారు. గుర్తులు, చిత్రాలు, తెలిసిన అంశాలను ఉపయోగించి అక్షరాస్యతకు సంబంధించిన ప్రాథమిక భావాలను సులభంగా అర్థమయ్యేలా బోధించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ వయోజన విద్యాశాఖతో సమన్వయం చేస్తూ అమలు చేశారు. వలంటీర్లు, ఫెసిలిటేటర్లకు వివిధ స్థాయిల్లో శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల సాధికార తకు అక్షరాస్యతే కీలకమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రతి మహిళ చదువుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. అక్షరానికి మించిన ఆయుధం లేదు. చదువు ద్వారా మహిళలు తమ జీవితాలను స్వయంగా మార్చుకునే శక్తిని పొందుతారు" అని ఆమె పేర్కొన్నారు.

# కాంట్రాక్ట్ ఉద్యోగులకు బ్యాంక్‌లో వేతనాలు

### ఏప్రిల్ నుంచి 5 లక్షల మందికి అమలు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27, ఏప్రిల్ నెల నుండి రాష్ట్రంలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జీతాలను జమ చేసేందుకు ఆర్థిక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఆ శాఖ అధికారవర్గాల వివరాల ప్రకారం వినిమం స్కేల్ పొందుతున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఐఎఫ్ఎంఎస్ పోర్టల్ లేదా ప్రత్యేక పోర్టల్ ద్వారానే చెల్లింపులు జరిపేందుకు సిద్ధమవుతోంది. దీంతో ప్రతినెలా వీరికి క్రమం తప్పకుండా జీతాలు అందే అవకాశం కలుగుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దీనికి సంబంధించి శాఖల వారిగా ప్రతి ఉద్యోగి పూర్తి సమాచారాన్ని సేకరించి కంప్యూటరీకరించే పనిలో ఆర్థిక శాఖ అధికారులు నిమగ్నమై ఉన్నారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగి పేరు, ఆధార్ నెంబర్, మొబైల్ నంబర్, బ్యాంకు ఖాతా వివరాలను ఒకే గొడుకు కిందికి తెస్తోంది. దాదాపు 5 లక్షల మంది ఉద్యోగుల బ్యాంకు ఖాతాలు, ఆధార్ వివరాలను లింక్ చేసే ప్రక్రియ జరుగుతోంది.
ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులకు ఐఎఫ్ఎంఎస్ (ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ సిస్టమ్) విధానంలో జీతాలను సర్కారు చెల్లిస్తోంది. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సైతం ఇదే పద్ధతిలో మధ్య వర్తులు, ప్రైవేట్ ఏజెన్సీల ప్రమేయం లేకుండా అత్యంత పారదర్శకంగా జీతాలు చెల్లించాలని ఆర్థిక శాఖ నిర్ణయం తీసుకుంది.
ప్రస్తుతం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలకు సంబంధించి ఏజెన్సీలకు నిధులను విడుదల చేయడంతో ప్రభుత్వ ఆదాయం దుర్వినియోగం అవుతుందని భావిస్తున్న ఆర్థిక శాఖ అధికారులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# జెఇఇ మెయిన్ సెషన్-2 అడ్మిట్ కార్డులు విడుదల

### ఏప్రిల్ 5 నుంచి 8 పరీక్షలు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ) మెయిన్ సెషన్ -2 పరీక్షకి సంబంధించిన అడ్మిట్ కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) విడుదల చేసింది. ఏప్రిల్ 2, 4 తేదీల్లో జరగనున్న పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డులి ఎన్‌టిఏ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు ఎన్‌టిఏ డైరక్టర్(ఎగ్జామ్స్) ప్రకటించారు. ఏప్రిల్ 2, 4 తేదిల్లో జరిగే పేపర్-1 అభ్యర్థులకు రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహించనున్నారు. మొదటి షిఫ్టును ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించ నుండగా.. రెండో షిఫ్ట్‌ను మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించ నున్నారు. ఏప్రిల్ 5, 6, 7, 8 తేదీల్లో నిర్వహించే పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులను తర్వాత విడుదల చేయనున్నట్లు ఎన్‌టిఏ ప్రకటించింది. ఈ ఏడాది జనవరిలో జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్షలు జరగగా ఇప్పటికే వాటి ఫలితాలను సైతం విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 2 నుంచి 8 వరకు సెషన్-2 పరీక్షలు జరగనున్నాయి.

# అగ్రకులాలకు లేని ఆంక్షలు దళితులకే ఎందుకు?

### ఎస్సీ హోదా కాదు.. కుల వ్యవస్థను రద్దు చేయండి

### ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ తదితరులు

**హైదరాబాద్, మార్చి 30,ప్రభాతవార్త:** ఎస్సీల మత స్వేచ్ఛను హరించే ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధం వివక్షతకు ప్రతిరూపమని ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆయన మాట్లాడుతూ 'కుల వివక్షతను రూపుమాపడం చేతకానప్పుడు కుల వ్యవస్థను రద్దు చేయండి. ఓసి,బిసి క్రైస్తవులకు లేని నిబంధనలు ఎస్సీలకు మాత్రమే ఎందుకు ? క్రైస్తవాన్ని ప్రచారం చేసే మత ప్రచారకులంతా అగ్రకులాలే. సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15 25కు పూర్తి విరుద్ధం. హిందూ దేవాలయాలలోకి రావద్దు ఇంకో మతంలోకి వెళ్ళద్దు అని దళితులకు ఆంక్షలు పెట్టడం దుర్మార్గం. ఏమి తినాలో, ఎలా ఉండాలో ,ఎక్కడికి వెళ్లాలో, ఏ విశ్వాసాలు పాటించాలో మీరే నిర్ణయిస్తారా ? గాంధీ అనుచరుల కుట్రల వల్ల దళిత క్రైస్తవులు హక్కులు కోల్పోయారు. రాజ్యాంగ సమయంలో క్రైస్తవులకు ప్రాతినిధ్యం వహించింది అగ్రకులాలే. అందువల్లనే దళిత క్రైస్తవుల హక్కులపై వాళ్ళు మాట్లాడ లేదు. క్రైస్తవంలోకి వెళితే బ్రాహ్మణుల, రెడ్డిల , కమ్మల, వెలమ కులస్తుల సామాజిక హోదా మారనప్పుడు దళితుల ఎస్సీ హోదా ఎందుకు మారుతుంది.? క్రైస్తవంలోకి మారిన అగ్రకులాలు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పొందుతున్నప్పుడు క్రైస్తవంలోకి మారిన దళితులు ఎస్సీ రిజర్వేషన్లు ఎందుకు పొందకూడదు? కుల వ్యవస్థ వల్ల దళితులు పశువుల కన్నా హీనంగా చూడబడ్డారు. కుల వ్యవస్థ వల్లనే హిందూ మతం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించలేకపోయింది. క్రైస్తవం , ఇస్లాం ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం చూపుతుంటే హిందూ మతం ఎందుకు ప్రభావం చుపెట్టలేకపోతుందో ఆలోచించి లోపాలు సరి చేసుకోవాలి. అఖండ భారత్ నుండి ప్రస్తుత భారత్ మిగిలింది..కుల వ్యవస్థ ఇలాగే కొనసాగితే ప్రస్తుత భారత్ కూడా మిగలదేమో అని ఆందోళ నగా ఉంది. హిందూ దేవాలయాలు అందరివి అయినప్పుడు బ్రాహ్మణులు మాత్రమే పూజారులుగా ఎందుకు ఉండాలి.? అయోధ్య మొదలుకొని అన్ని దేవాలయాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను పూజారులుగా నియమించాలి "అని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, ఇంజం వెంకటస్వామి, సోమశేఖర్ మాదిగ, జేపీ లత మాదిగ ,కార్తీక్ మాదిగ, టీవీ నరసింహా మాదిగ, శివ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన ఖనిజాల ఉత్పత్తి సామర్థ్యం ఐదు వేల టన్నులు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** దేశంలో అరుదైన భూలోహాలు, లిథియం అన్వేషణను కేంద్రం వేగవంతం చేస్తోంది. 2030 నాటికి అరుదైన భూలోహ శాశ్వత అయస్కాంతాల దేశీయ ఉత్పత్తి సామర్థ్యం 5 వేల టన్నులకు చేరుకునేందుకు ప్రణాళిక రూపొందింది. దేశీయంగా అరుదైన భూలోహ శాశ్వత అయస్కాంతాల ఉత్పత్తిని పెంచడానికి, లిథియం వంటి కీలక ఖనిజాల అన్వేషణను వేగవంతం చేయడానికి కేంద్ర గనులు, ఖనిజాల మంత్రిత్వ శాఖ ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా 2030 నాటికి ఉత్పత్తి సామర్థ్యాన్ని 5 వేల టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. దేశానికి ప్రస్తుతం సుమారు 4,000 టన్నుల రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్‌లు అవసరమని, ఇది 2030 నాటికి దాదాపు 8,000 టన్నులకు పెరుగుతుందని అంచనా వేసింది. కాగా నియోడైమియంఐరన్ బోరాన్ శాశ్వతఅయస్కాంతాలపై ఒక పైలట్ ప్రాజెక్టును ఇటీవల ప్రారంభించింది. అదే సమయంలో విశాఖపట్నంలో ఏడాదికి 500 టన్నుల ప్రారంభ ఉత్పత్తి సామర్థ్యంతో సమారియంకోబాల్ట్ అయస్కాంత ప్లాంటును కార్యాచరణలోకి తేవడం జరిగిందని సంబంధిత ఉన్నతాధికారవర్గాలు వెల్లడించాయి. ఈ సామర్థ్యాన్ని తదుపరి దశలో 2,000 టన్నులకు, 2030 నాటికి మరో 5,000 టన్నులకు పెంచనున్నారు.

# చిన్నారుల్లో పౌష్టికాహార సమస్య

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పిల్లలకు సరైన పోషకాహారం అందకపోవడం శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. వయసుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు ఇవి సరిగ్గా లేక చాలా మంది చిన్నారులు బక్కచిక్కిపోతున్నారు. రాష్ట్రంలోని ములుగు, కొత్తగూడెం, మెదక్, వికారాబాద్, నారాయణ్‌పేట్, ఆసిఫాబాద్, మహబూబాబాద్ జిల్లాలోని చిన్నారుల్లో ఎక్కువగా పౌష్టికాహార సమస్య ఉన్నట్లు వెలుగు చూసింది. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సర్వే రాష్ట్ర వ్యాప్తంగా వయసుకు తగిన ఎత్తులేని చిన్నారులు 17.04 శాతం ఉన్నట్లు వెల్లడైంది. గణాంకాల ప్రకారం మొత్తం 35,700 అంగన్వాడీల్లో 12,466లో మాత్రమే చిన్నారులు తగిన ఎత్తు, బరువు ఉన్నారు. మిగిలిన 23,234 కేంద్రాల్లోని చిన్నారుల్లో పోషకాహార లోపాలున్నట్టు తేలింది. కొన్ని జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. నారాయణపేట, మేడ్చల్‌లో 80 శాతం కేంద్రాల్లోని చిన్నారుల్లో ఈ తరహా లోపాలున్నట్లు వెల్లడైంది. పోషకాహార లోపం 0శాతంగా ఏ ఒక్క జిల్లా కూడా లేదని గుర్తించారు.



అవంతి విద్యాసంస్థ ఆధ్వర్యంలో జరిగిన యుఫోరియా వేడుకల్లో మాట్లాడుతున్న డిజిపి శివధర్‌రెడ్డి, చిత్రంలో విద్యాసంస్థ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు తదితరులు

# యువత సక్రమ మార్గాలతోనే దేశ భవిష్యత్తు: డిజిపి శివధర్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** నేటి యువతరం ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి.శివధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ఆధ్వర్యంలో యుఫోరియా 2026 వేడుకల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అవంతి విద్యాసంస్థ చైర్మన్, మాజీ మంత్రి ఎం.శ్రీనివాస రావు, వైస్ ప్రెసిడెంట్ నందీష్, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం. ప్రియాంక, ఎండీ శ్రవణ్ కుమార్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించే యువత కొన్ని సందర్భాలలో దారితప్పే అవకాశం ఉందన్నారు. విద్యాసంస్థలు, కుటుంబ సభ్యులు కనిపెట్టుకొని ఉండాలన్నారు. యువత ద్విచక్ర వాహనాలను విపరీతమైన వేగంతో నడపడం వల్ల ఎంతోమంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. అతివేగంగా వాహనాలు నడిపే అలవాటును యువత తక్షణమే విరమించుకోవాలని కోరారు. డాక్టర్ ఆర్.శ్రీదేవి మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో కృత్రిమ మేధస్సు ప్రాధాన్యతను, భవిష్యత్తులో దాని ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేశారు. అభిషేక్ దోయిజోడే (విర్చుసా క్యాంపస్ లీడ్) మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ చదువుతో పాటు, నిత్య అభ్యాసంలో ఏఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని, అప్పుడే మారుతున్న కాలానికి అనుగుణంగా రాణించగలరని సూచించారు.

# మార్కెట్ రుసుం, అద్దెలు, లీజుల వసూళ్లలో వ్యవసాయ మార్కెట్ కమిటీల నిర్లక్ష్యం: కాగ్

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల పనితీరుపై కాగ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చేసిన వ్యయానికి రికార్డులను సమర్పించకపోవడం, బకాయిలను వసూలు చేయకపోవడం, గ్రాంట్ నిధుల మళ్లింపు, నిధుల దుర్వినియోగం, అధికంగా చెల్లింపులు చేయడం, ఓచర్లు, వేతన బిల్లులు, కంటింజెంట్ బిల్లల నుండి తగ్గింపులు, వసూళ్లను జమ చేయకపోవడం, వృథా వ్యయాలను చేయడం తదితర అంశాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీలు నిబంధనలను అతిక్రమిస్తున్నాయని కాగ్ అక్షింతలు చల్లింది. మార్కెట్ రుసుం, అద్దెలు, లీజులు, గోడౌన్ అద్దెల వసూళ్లు భారీగా బకాయిలు ఉన్నాయని, ఒకవేళ వసూలు చేసినా వాటిని లెక్కల్లో చూపడం లేదని అభ్యంతరం వ్యక్తం చేసింది. బకాయిల వసూళ్లు చేయకపోవడంతో రూ.5096.02లక్షల నష్టం వాటిల్లిందని తేల్చింది. వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో 19.07శాతం నిధుల నష్టం బకాయిలను వసూలు చేయకపోవడంతోనేనని, 51.77శాతం అతిక్రమణలు ఖర్చు, వసూళ్ల తాలుకు రికార్డులను సమర్పించకపోవడంవల్ల జరిగాయని కాగ్ తేల్చింది.

# మహేశ్వరంలో భారీగా డ్రగ్స్ పట్టివేత

## కోటి రూపాయల గంజాయి ఆయిల్ స్వాధీనం

**మహేశ్వరం మార్చి 30( (పభాతవార్త)** ఎస్ఓటి పోలీసులు, మహేశ్వరం పోలీసులు సమన్వయంతో దాడులు నిర్వహించి కోటి రూపాయాల విలువ చేసే డ్రగ్స్‌ను స్వాదీనం చేసుకున్నారు. ఈ సంఘటన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. పోలీసులు జరిపిన తనిఖీలో ఈ అక్రమరవాణ భారీగాపట్టుబడింది. ఒరిస్సా నుంచి నేరుగా హైదరాబాద్‌కు గంజాయి నుంచి తయారు చేసిన హాషీస్ అయిల్ (నూనే) తరలిస్తుండగా ఫ్యూచర్ సిటీ పోలీసులు ప్రత్యేకంగా నిర్వహించిన తనిఖీలో పట్టుబడింది. పట్టుబడిన అయిల్ విలువ కోటి రూపాయాలవరకు ఉందని పోలీసులు అంచన వేశారు. 9. 402 కిలోల హాషీస్ అయిల్‌ను స్వాదీనం చేసుకున్నారు. హాషీస్ అయిల్‌ను తరలిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయిన వ్యక్తి ఆంధ్రప్రదేశ్ అల్లూరు జిల్లా సీతారామారాజు నివాసినిగా గుర్తించారు. మిగితా ఇద్దరు వ్యక్తులు ఎ 2 రాజారావు ఒరిస్సా వ్యక్తి పరారీలో ఉన్నారని, ఎ 3 వ్యక్తి గుర్తు తెలియని వ్యక్తిగా పోలీసులు పేర్కొన్నారు. పోలీసుల కథనం ప్రకారం చంటిబాబు గత కొంత కాలంగాఎ 2 రాజారావు నుండి ఈ డ్రగ్స్‌ను సేకరించినగరంలోని పలు ప్రాంతాలకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మహేశ్వరం గేటు సమీపంలో అక్రమ రవాణకు పాల్పడుతు ఇతర వ్యక్తుల అమ్మకాలకు ప్రయత్నిస్తున్న చంటిబాబును అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని కంచర పాలెం, అనకాపల్లి, విశాఖపట్నం తితదర ప్రాంతాల్లో నాలుగు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మహేశ్వరం సిఐ రాఘువెందర్‌రెడ్డి, ఎస్ఐ ప్రసాద్‌లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# వట్టినాగులపల్లి భూవివాదంపై బిఆర్ఎస్ అసత్యఆరోపణలు

## ఇది మా కుటుంబ సమస్య.. మంత్రి పొంగులేటికి ఎలాంటి సంబంధం లేదు : భూ యజమానులు



సమావేశంలో మాట్లాడుతున్న భూ యజమానులు

**హైదరాబాద్, మార్చి 30,ప్రభాతవార్త:** వట్టినాగులపల్లిలోని వ్యవసాయ భూమిలో జరుగుతున్న భూ వివాదానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి గానీ వారి కుటుంబానికి గాని ఎలాంటి సంబంధం లేదని, రాఘవ కన్స్ట్రక్షన్స్‌కు తాము ఏలాంటి డెవల ప్మెంట్ అగ్రిమెంట్ చేయలేదని వట్టినాగులపల్లి యజమానులు స్పష్టం చేశారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో భూ యజమానులు అవినవ్‌షా, సుధీర్ కుమార్ షా, అక్షయ్ షా, సిద్దార్థ్ గాదె మాట్లాడుతూ ఇది కేవలం కుటుంబ వివాదమని, దీనిని ఎందుకు రాజకీయం చేస్తున్నారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి తన అధికార బలాన్ని ఉపయోగించి స్థలాన్ని కబ్జా చేయడానికి యత్నిస్తున్నారనే బిఆర్ఎస్ నాయకుల ఆరోపణలో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. ఈభూవివాదంలో మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ని ఎందుకు లాగు తున్నారో అర్థం కావడం లేదని తమ కుటుం బానికి సంబంధించిన స్థలాల బౌండరీల విష యంలో మాకు వివాదం ఉంది. దీనికి సంబంధించిన విషయాలను పూర్తి ఆధారాలతో మీడియా ముందు పెడుతున్నామన్నారు. అలాగే భూమి విలువపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అదే భూమిని రూ.600 కోట్లకు కేటీఆర్‌కు భేషరతుగా ఇవ్వడానికి సిద్దంగా ఉన్నామన్నారు. నిజంగా విలువ ఉంటే కొనుగోలు చేయడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. హారీశ్ రావు, కేటీఆర్ గార్లు కేవలం ఒకవైపే కాకుండా తమ వాదన కూడా వినాలని కోరారు. 2020 నుంచి తాను భూ సర్వే చేయిస్తున్నానని, హైకోర్టు ఆదేశాల ప్రకారం సబ్ డివిజన్, డిమార్కేషన్ జరగాలని కోరుతున్నట్లు తెలిపారు. భువన్ యాప్ ద్వారా వివరాలు సరిచూసుకోవచ్చని,

సర్వే చేయించి ఎవరి భూమి వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఎవరిని పిలిచినా సరే, భూ సర్వే చేయించి నిజానిజాలు తేల్చాలని, అనవసరంగా కుటుంబంలో చీలికలు తీసుకురావద్దని పేర్కొన్నారు.

# వినియోగదారులకు మెరుగైన సేవలు

## - దరఖాస్తు నుంచి మంజూరి వరకు అంతా ఆన్‌లైన్ - సంస్థలో అవినీతిని తగ్గించేందుకు ప్రత్యేక ప్రణాళికలు - టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ విశ్వనాథ్ పాటిల్



**హైదరాబాద్, మార్చి 30,ప్రభాతవార్త:** తీసుకుని వచ్చినట్లు దక్షి ణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ విశ్వనాథ్ పాటిల్ పేర్కోన్నారు. సోమవారం టీజీఎస్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అవినీతి నిర్మూలన కోసం వినియోగదారుడు ఎవరిని కలవాల్సిన అవసరం లేకుం డానే దరఖాస్తును ఆన్‌లైన్‌లో స్వీకరించడమే కాకుండా, ఎస్టిమేషన్ వేయడంతో పాటు మంజూరి ప్రక్రియలో పెండెన్సీ కూడా ఇ ఫైలింగ్‌లో కనపడుతుందని సీఎండీ తెలిపారు. అవినీతిని తగ్గించే విషయంలో వినియోగదారుల నుంచి కూడా సహకారం ఉండాలని, లంచం తీసుకోవడం ఎంత నెరమో ఇవ్వడం కూడా అంతే నేరమని అన్నారు. ఈఆఫీస్ వచ్చిందని, దీనితో తన కంప్యూటర్‌లో కూడా ఫైల్స్ కనబడుతున్నాయని, ప్రతి అధికారికి వెలుతుందని, దీనితో ఫైల్ ఎక్కడ పెండింగ్ ఉందనే విషయం తెలుస్తుందని అన్నారు. వినియోగదారుడు ఒకసారి దరఖాస్తు చేస్తే ఎవరిని కలవకుండానే మంజూరి అయిపోవాలనేది తమ లక్ష్యం అన్నారు. ఎవరిని కలవకుండా మంజూరి అయిందంటే ఎక్కడ అవినీతి జరగలేదన్నట్లుగా భావించవచ్చన్నారు. మీటర్ కొరతపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు. స్టోర్‌లలో మెటిరీయల్ కొరత లేకుండా ప్రత్యేక దృష్టిని సారించామని, అసలు మెటిరీయల్ కోసం స్టోర్స్ వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఎక్కడికక్కడ అందుబాటులో ఉంచేలా ప్రణాళిక చేస్తున్నామన్నారు. మీటర్ల కొరత విషయంలో సీఈలతో కమిటీ ఏర్పాటు చేశామని, ఈ ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత ఏఫ్రిల్ 6వ తేదీ నుంచి కమిటీ ప్రోక్యూర్‌మెంట్‌పై దృష్టి సారిస్తుందన్నారు. హైదరాబాద్‌లో కొత్త సర్వీసులు ఎక్కువగా ఉంటున్నాయని, ప్రతి కనెక్షన్ విషయంలో జీటీసీఎస్ రూల్స్ ప్రకారమే వ్యవహారించనున్నట్లు తెలిపారు. యూనిఫామ్ లైన్ సర్వీస్ చార్జీలతో ఫౌరుల మీద భారం తగ్గుతుందన్నారు. రెవెన్యూ లాసెస్‌ను తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నెల 27న రాష్ట్ర విద్యుత్ డిమాండ్ 18,548 మెగావాట్లుగా రికార్డు స్థాయి నమోదు అయినట్లు సీఎండీ తెలిపారు. టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలో ఈ నెల 13న 11,318 మెగావాట్ల డిమాండ్ నమోదు కాగా 222 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగిందన్నారు. ఏఫ్రిల్, మే నెలలో విద్యుత్ డిమాండ్, వినియోగం భారీగా పెరుగుతుందని బావిస్తున్నామన్నారు.

## చెల్లించాల్సిన రుణాల అసలు రూ.3.64 లక్షల కోట్లు

## రాష్ట్ర అప్పులపై రిజర్వ్ బ్యాంక్ వెల్లడి

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం 2025-64 నాటికి రుణాల అసలు కింద రూ.3,63,883 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇదే సమయంలో ఈ అప్పులతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం గతంలో దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న నేపథ్యంలో భవిష్యత్తులో తిరిగి చెల్లించాల్సిన అప్పుల మొత్తం గణనీయంగా పెరగనుంది. రాష్ట్రంలో గత పాత అప్పులు అసలు, వాటికయ్యే వడ్డీలను చెల్లించడానికి రాష్ట్ర సర్కార్ కొత్తగా మరిన్ని అప్పులు చేయాల్సి వస్తోంది. ఈ విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ రాష్ట్రాల ఆర్థిక పరిస్థితుల పేరిట తాజాగా రూపొందించిన నివేదికలో వెల్లడించింది. 2025-64 మధ్యలో రూ.3,63,883 కోట్లు అసలు కట్టాల్సి ఉందని, దీనికి వడ్డీలు అదనమని అందులో వెల్లడించింది. ఇక కొత్తగా చేస్తున్న రుణాల్లో అత్యధిక భాగం పాత రుణాల కిస్తీలు, వడ్డీలకు పోగా, రాష్ట్ర ప్రభుత్వం చేతికి అందుతున్నది చాలా తక్కువగా ఉంటోందని పేర్కొంది. గత మూడేళ్ల సగటును తీసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న బహిరంగ మార్కెట్ రుణాల్లో 58శాతం సొమ్ము పాత అప్పుల కిస్తీలు, వడ్డీల చెల్లింపుకే సరిపోయిందని తెలిపింది. మిగిలిన 42 శాతం సొమ్మును ప్రభుత్వం ఇతర వాటికి ఖర్చు చేసింది. ఈ నివేదిక ప్రకారం తెలంగాణ ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరంలో తెచ్చిన అప్పుల్లో 70 శాతం, 2024-25లో సేకరించిన అప్పుల్లో 56శాతం, 2025-26లో చేసిన అప్పుల్లో 49శాతం మేర సొమ్మును పాత అప్పులు, వడ్డీలు తిరిగి చెల్లించడానికే వినియోగించినట్లు తెలియచేసింది.

# గందరగోళంలో రబీ పంటల సర్వే

## అధికారుల అవగాహనారాహిత్యంతో నేటికీ పూర్తి కాని పంటల సర్వే

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** తెలంగాణలో పంటల డిజిటల్ సర్వే అమలు విషయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల ప్రణాళికా లోపం స్పష్టంగా కనిపిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్రం విధించిన షరతుల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో 100 డిజిటల్ పంట సర్వే అమలు, వలంటీర్ ల నియామకం తప్పనిసరి అని తెలిసినా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమయ్యారు. రబీ సీజను మొదలై రెండు నెలలు గడిచేదాకా వలంటీర్ల నియామకంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కేంద్రం నుండి వచ్చిన ఒత్తిడి మేరకు ఫిబ్రవరి నెల చివరి వారంలో రాష్ట్ర అధికార యంత్రాంగం హుటా హుటిన వలంటీర్ల నియామకం చేపట్టింది. వారితో డిజిటల్ పంట సర్వే ప్రక్రియను ప్రారంభించింది. రాష్ట్రంలో విలేజ్ మ్యాప్‌లు ఉన్న 9,795 గ్రామాలకు ఒక్కొక్కరి చొప్పునవాలంటీర్లను నియమించి 45 రోజులలో ఆయా గ్రామాలలో పంట సర్వేను పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. ఇప్పటికే 6070 గ్రామాల్లో సర్వేను పూర్తి చేశారు. సర్వర్ సమస్యలు, యాప్ లో సాంకేతిక లోపాల కారణంగా 100శాతం పంటల సర్వే పూర్తయ్యేందుకు మరో15 రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. మరో వైపు రాష్ట్రంలో శనగ, మొక్కజొన్న, జొన్న వంటి ఆరుతడి పంటల కోతలు మొదలై 15 రోజులు కావస్తున్నా రైతు వారీగా పంటల సాగు సర్వే వివరాలు ఇంకా సిద్ధం కాకపోవడంతో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడ లో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

## వికలాంగురాలిపై అత్యాచారం

### - నిందితుడు అరెస్టు .. రిమాండ్‌కు తరలింపు

**అత్తాపూర్ మార్చి30,ప్రభాతవార్త :** అన్నం పుణ్యం ఎరుగని వికలాంగురాలైన మహిళపై అత్యాచారానికి పాల్పడిన ఘటన అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ నాగేశ్వర్ రావు వివరాల ప్రకారం...చంద్రాయణగుట్ట పరిధిలోని పాయ్ నగర్‌లో నివాసించే మొహమ్మద్ అఖీల్ (35) మద్యానికి బానిసై అసభ్య ప్రవర్తనతో తిరుగుతుండేవాడు. ఈ ప్రవర్తన కారణంగానే అతనిని వదిలేసి భార్య, ముగ్గురు పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. అఖిల్ తరుచుగా అత్తాపూర్ పరిధిలోని హసన్ నగర్‌లో ఉండే తన సోదరి ఇంటికి వస్తుండేవాడే అదే ప్రాంతంలో ఫిర్యాదారులైన భార్యభర్తలు తన ఆడపడుచు అయిన విలాగుంగురాలైన బాధితురాలతో కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో ఈనెల 28వ తేదిన ఉదయం సమయంలో బాధితురాలి కుటుంబ సభ్యులు బ్యాంకు పని మీద బయటకు వెళ్లారు. ఇంట్లో బాధితురాలు ఒంటరిగా ఉన్న సమయాన్ని ఆసరాగా చేసుకున్న బంధువైన నిందితుడు మొహమ్మద్ అఖీల్ ఇంట్లోకి ప్రవేశించి వికలాంగురాలైన మహిళపై అత్యాచారానికి పాల్పడ్డాడు. కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఇంటి గెటు గడియ తీసి ఉండటం గమనించారు. లోపలికి వెళ్లి చూడగా బాధితురాలు వివస్త్రయై తీవ్ర ఆవేదనతో ఉండటం నిందితుడు అఖీల్ ప్యాంట్ లేకుండా ఉండటం చూసి దిగ్భ్రాంతికి గురైయ్యారు.

# దివాలా సవరణల బిల్లుకు లోక్‌సభ ఆమోదం

## - లాకర్లలో ఏమున్నాయో బ్యాంకులు చూడవు.. - లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**న్యూ ఢిల్లీ, మార్చి 30:** ఎన్డీయే ం సర్కారు హయాంలోనే అమలుకు వచ్చిన దివాలా చట్టంలో 12 సవరణలకు ఉద్దేశించిన బిల్లుకు సోమవారం లోక్‌సభ ఆమోదించింది. దివాలా తీసిన వ్యక్తి లేదా కంపెనీ కోర్టు బయట పరిష్కారాన్ని వెతుక్కునే అవకాశం ఉంది. దివాలా తీసిన వ్యక్తి లేదా కంపెనీ భారత్ అవతల (విదేశాల్లో) ఉన్నా వివాదాన్ని పరిష్కరించుకునే మార్గాలను కొత్త సవరణలు సూచిస్తున్నాయి. దివాలా తీసిన వ్యక్తి లేదా కంపెనీ వల్ల బాధితులుగా మారిన వ్యక్తులు, వాటాదారులు, బ్యాంకులు, ఆర్థిక సంస్థల ప్రయోజనాలను మరింత మెరుగ్గా పరిరక్షించేందుకు ఈ సవరణలు దోహదం చేస్తాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభకు చెప్పారు. దివాలా చట్టంలో సవరణలు చేయడం ఇది ఏడోసారి. ఆర్థిక సంక్షోభంలో ఉండే కంపెనీలు, వ్యక్తుల దివాలా వ్యవహారాలకు నిర్ణీత గడువులోగా పరిష్కారాలను చూపించాలి. అనవసర ఫిర్యా దులుచేసిన వారిపై రూ.1 లక్ష నుంచి రూ.2 కోట్ల దాకా జరిమానాలను విధించాలని నిర్ణం యించారు. కంపెనీ లేదా వ్యక్తి దివాలా తీశారనే నిర్ధారణ జరిగిన 14 రోజుల్లోగా దరఖాస్తును సమర్పించాలని కొత్త సవరణ నిర్దేశిస్తోంది. నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ ఎదుట దాఖలయ్యే దివాలా అప్పీల్ పిటిషన్‌ను 3 నెలల్లోగా పరిష్కరించాలి. దివాలా తీసిన కంపెనీకి కనీసం 51 శాతం రుణాలను ఇచ్చిన ఆర్థిక సంస్థలు, బ్యాంకులు కలిసి ఎన్‌సీఎల్‌ఏటీ జోక్యం అవసరం లేకుండా నేరుగానే ఫాస్ట్‌ట్రాక్ దివాలా పరిష్కార ప్రక్రియను మొదలుపెట్టొచ్చు. దివాలా తీసిన కంపెనీ నిర్వహణ బాధ్యతలను కోర్టు ద్వారా రుణదాతలు చేపట్టొచ్చు. 150 రోజుల్లోగా కోర్టు బయట పరిష్కారం పొందొచ్చు. ఆచరణాత్మక సవాళ్లు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దివాలా చట్టంలో మరిన్ని సవరణలు చేశామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభకు తెలిపారు. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచే ఉద్దేశంతో కార్పొరేట్ వ్యాపార గ్రూప్‌లతో, విదేశాల్లోని వ్యక్తులు, సంస్థలతో దివాలా వివాదాలను పరిష్కరించుకునే విధానాలనూ అందుబాటులోకి తెచ్చామన్నారు. దివాలా పరిష్కారాలు లభించిన తర్వాత చాలా భారతీయ కంపెనీలు బాగానే రాణిస్తున్నాయని అధ్యయన నివేదికలను బట్టి తెలుస్తోందని, అలాంటి కంపెనీల మూలధన విలువ దివాలా పరిష్కారం లభించిన ఐదేళ్లలోనే రూ.2.8 లక్షల కోట్ల నుంచి రూ.9 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. దివాలా తీసిన కంపెనీల నుంచి వివిధ మార్గాల ద్వారా రూ.1,04,099 కోట్లను దేశంలోని వాణిజ్య బ్యాంకులు రికవర్ చేశాయని పేర్కొన్నారు. ఇందులో రూ.54,528 కోట్ల (52.3 శాతం) రికవరీ కేవలం దివాలా (ఐబీసీ) చట్టం ప్రకారమే జరిగిందన్నారు. లాకర్లలో కస్టమర్లు ఏమేం దాచుకున్నారో బ్యాంకులు చూడవని, ఆ వివరాలను నమోదు చేయవని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. లాకర్లలో దాచుకున్న వస్తువులు, డాక్యుమెంట్లను బ్యాంకులు చూసినా, ఆ వివరాలను నమోదు చేసినా బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్లు అవుతుందన్నారు. అందువల్ల లాకర్లలోని వస్తువుల విలువ ఆధారంగా భిన్నమైన బీమా కవరేజీని నిర్ణయించడం అనేది సాధ్యపడదని ఆమె తేల్చి చెప్పారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో మహారాష్ట్రలోని గడ్చిరోలి చిమూర్ కాంగ్రెస్ ఎంపీ నామ్‌దేవ్ దాసారామ్ కిర్సన్ అడిగిన ఒక ప్రశ్నకు ఈమేరకు నిర్మల బదులిచ్చారు. బ్యాంకు లాకర్‌లోని ఎంత విలువైన వస్తువు పోయినా, లాకర్ వార్షిక ఛార్జీకి 100 రెట్లు సమానమైన పరిహారమే లభిస్తుందని ఆమె చెప్పారు. లాకర్లలోని వస్తువుల విలువను బ్యాంకులు ఎన్నడూ గణన చేయవన్నారు.



జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నగరంలో నిర్వహించిన జాతీయ ఒబిసి సెమినార్ నిర్వహించిన దృశ్యం

# చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి: ఎంపిల డిమాండ్

**హైదరాబాద్, మార్చి 30:** పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, అసెంబ్లీ మరియు పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని 20 మంది పార్లమెంట్ సభ్యులు గళమెత్తారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నగరంలో నిర్వహించిన ఖిఖిజాతీయ ఓబీసీ సెమినార్‌ఖిఖిలో ఈ మేరకు కీలక తీర్మానాలు చేశారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డా. ర్యాగ అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల ప్రతినిధులు భారీగా హాజరయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు గడిచినా పాలకులు బీసీలకు తగిన వాటా ఇవ్వక అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోనే బీసీలకు నిజ మై న న్యా యం జరు గుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ఎంపీల బృందంతో ప్రధానిని కలిసి బీసీల రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధనకై వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. విశ్వగురువుగా గుర్తింపు: ప్రధాని మోడీ అత్యంత శక్తివంతుడైన నాయకుడని, ఆయన హయాంలోనే 27 మంది బీసీలు మంత్రులుగా, నలుగురు గవర్నర్లుగా నియమితులయ్యారని కొనియాడారు. కులగణన చారిత్రక నిర్ణయం: 1931 తర్వాత తొలిసారిగా కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టడం సాహసోపేతమైన నిర్ణయమని, దీనివల్ల బీసీల ఆర్థిక, రాజకీయ స్థితిగతుల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయని పేర్కొన్నారు. జస్టిస్ రోహిణి కమిషన్: బీసీల ఉప వర్గీకరణ ద్వారా అన్ని గ్రూపులకు సమాన ఫలాలు అందుతాయని, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపునకు ఇది మార్గం సుగమం చేస్తుందని అభిప్రాయపడ్డారు. రాజకీయ రిజర్వేషన్లు: చట్టసభల్లో బీసీలకు 50 శాతం కోటా కేటాయిస్తూ పార్లమెంటులో బిల్లు పాస్ చేయాలి. ప్రత్యేక మంత్రిత్వ శాఖ: కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, రూ. 2 లక్షల కోట్లతో అభివృద్ధి పథకాలు ప్రకటించాలి.

రిజర్వేషన్ల పెంపు: విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతానికి పెంచాలి.

క్రిమిలేయర్ తొలగింపు: బీసీ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్ నిబంధనను పూర్తిగా ఎత్తివేయాలి. ప్రైవేటు రంగంలో కోటా: ప్రైవేటు సంస్థలతో పాటు హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జీల నియామకాల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి.

పారిశ్రామిక విధానం: పరిశ్రమల కేటాయింపులు, లైసెన్సుల్లో బీసీలకు 50 శాతం వాటా ఇవ్వాలి.

ఈ కార్యక్రమంలో ఎంపీలు బీద మస్తాన్ రావు, నాగరాజు, అప్పల నాయుడు, అంబికా లక్షీ ‌నారాయణ, పుట్ట మహేష్ యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ప్రసాద్ రావుతో పాటు మాజీ ఎంపీ వి.హనుమంతరావు, సంఘం నేతలు నీల వెంకటేష్, అరవింద్, జోబ్బాలి శ్రీనివాస్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# రూ.25 వేల లంచం తీసుకుంటూ..

## ఎసిబికి పట్టుబడిన తిమ్మాజిపేట ఎస్ఐ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 30 ప్రభాతవార్త:** అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుకున్న వాహనాలను వదిలిపెట్టడానికి లంచం డిమాండ్ చేసిన తిమ్మాజీపేట ఎస్ఐ అవినీతి నిరోధక శాఖ అధికారుల వలలో చిక్కాడు. వివరాల్లోకి వెళితే... అక్రమంగా తరలిస్తున్న ఇసుక వాహ నాలను పట్టుకొని మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసిన తిమ్మాజీపేట ఎస్ఐ అట్టి వాహనాలను వదిలిపెట్టడానికి లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో సోమవారం ఏసీబీ అధికారులు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఒక కేసుకు సంబంధించి ఈనెల 7వ తేదీన ఒక వ్యక్తి నుండి రూ.30 వేలు డిమాండ్ చేసి రూ.20వేలు లంచం తీసుకున్న ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డిని మహబూబ్‌నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో దాడులు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తికి సంబంధించిన ట్రాక్టర్, జెసిబి ని పట్టుకొని ఈనెల 5న ఎస్ఐ హరి ప్రసాద్ రెడ్డి కేసు నమోదు చేసి నాగర్‌కర్నూల్ జిల్లా మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు. మైనింగ్ అధికారులు ఆ వాహనాలకు రూ.60వేల జరిమానా విధించారు. ఈ డబ్బులను ఈనెల 7వ తేదీన చెల్లించి వాహనాల రిలీజ్ కోసం పత్రాలను తెచ్చి ఎస్ఐకి బాధితుడు అందించారు.

## ఢిల్లీలో మెట్రో పోస్టర్ల కేసులో లష్కర్ ఎ తోయిబా ఉగ్రవాది అరెస్టు

**న్యూఢిల్లీ, మార్చి30:** హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త: దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఏడాది ఫిబ్రవరిలో మెట్రో స్టేషన్లలో వరుసగా ఉగ్రవాదం పెంపొందేలా, పాక్‌ను పొగుడుతూ వెలసిన పోస్టర్ల కేసులో లష్కర్ ఏ తోయిబా ఉగ్రవాది షబ్బీర్ లోన్ అరెస్టయ్యాడు. ఆదివారం రాత్రి ఇతను పట్టుబడినట్లు ఢిల్లీ అదనపు పోలీసు కమిషనర్ ప్రమోద్ సింగ్ కుష్వాహా సోమవారం నాడు మీడియాకు తెలిపారు. గతంలో ఢిల్లీ పోలీసులు ఛేదించిన మ్యాడ్యూల్‌కు షబ్బీర్ లో న్ నాయకుడుగా వుండేవాడని ఇందులో ఏడుగురు బంగ్లా దేశీయులతో పాటు ఒక భారతీయుడు వున్నాడని, వీరంతా అరెస్టవడంతో ఇతను కొత్త మ్యాడ్యూల్‌ను ఏర్పాటు చేసి యువతను ఉగ్రవాదం వైపు మళ్లిస్తున్నట్లు కుష్వాహా తెలిపారు. షబ్బీర్ లోన్ 2007, 2015లో రెండుసార్లు అరెస్టయ్యాడని, 2015లో కాశ్మీర్‌లో పట్టుబడినపుడు ఎకె 47 దొరికిందని ఆయన తెలిపారు.

# మాదిగల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతమ్




ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ ఛైర్మన్ నగరిగారి ప్రీతమ్

**ధర్నాచౌక్, మార్చి 30, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం మాదిగల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ ఛైర్మన్ నగరిగారి ప్రీతమ్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఎస్సీల సంక్షేమ పథకాలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరై ప్రీతమ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీలను ఏబిసిడీలుగా వర్గీకరించాలని 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, వేలాది మంది త్యాగాల ఫలితంగా సాధించిన ఎస్సీ వర్గీకరణ తీర్పును, మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో అమలుచేసి, సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల పక్షాన నిలబడ్డారని గుర్తుచేశారు. దళిత యువత స్వయం ఉపాధి, దళిత యువత ఆర్థిక స్వావలంభన సాధించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి సీఎం రేవంత్‌రెడ్డి దశలవారీగి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ దళితులకు ఇచ్చిన అభయహస్తం పథకం అమలుచేయాలని, నరపతి దళిత కుటుంబానికి 12లక్షల ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. జీవోనెంబర్ 58, 59 ప్రకారం రెగ్యులరైజ్ చేసిన ఇండ్లు, ఇండ్ల స్థలాలను అమ్ముకునే హక్కు కల్పించాలని, ఎస్సీ కార్పోరేషన్‌కు 15వేల కోట్లు నిధులు కేటాయించి, దళితులకు సబ్సిడీ ఋణాలు అందించాలని డిమాండ్ చేశారు.

## అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధాన్ని ఆపాలంటూ అసెంబ్లీలో తీర్మానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి30:** అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధాన్ని ఆపేలా కేంద్రం చొరవ చూపాలని తెలంగాణ శాసన సభ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో ప్రవేశపెట్టారు. మధ్యప్రాచ్యంలో యుద్ధం వల్ల దాదాపు 4 వేల మంది మరణించారని ఉపముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ ప్రభావం ఆసియా దేశాలపై తీవ్రంగా పడుతోందని.. ఆర్థిక విధ్వంసం జరుగుతోందని తెలిపారు. యుద్ధ ప్రభావం భారత్‌పై ఎక్కువగా ఉందని భట్టి పేర్కొన్నారు. ఆయా దేశాల మధ్య ఉద్రిక్తతలు ఆగకపోతే ప్రపంచ దేశాల భవిష్యత్తు మరింత ఆందోళనకరంగా మారొచ్చని అభిప్రాయపడ్డారు.

## కాళేశ్వరంలో అవినీతి జరిగిందన్న దానికి కట్టుబడి ఉన్నాం

### - బిజెపి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకట రమణారెడ్డి

అసెంబ్లీలో ఏం జరుగుతుందో అనేది ప్రజలకు తెలవాల్సి ఉందని కాలేశ్వరంపై ఘోష్ కమిటీ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణ కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపారని బిజెపి ఎమ్మెల్యే కాటెపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఈమేరకు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ "కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బీజేపీ శాసనసభ్యులు కూడా కాళేశ్వరంలో అవి జరిగింది అని చెప్పడంలో కట్టుబడి ఉన్నారు. కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి జరిగింది. ప్రాజెక్టు నిర్మాణంలో ఎస్టిమేషన్, అప్రూవల్, పనుల్లో తప్పుడు నివేదికలు ఇచ్చారు. అయితే కాళేశ్వరం అవినీతికి పాల్పడ్డ కాంటాక్టర్లపై మళ్ళీ పనులు ఇవ్వడం ఏంటి? ఘోష్ నివేదిక మీరు ఎక్కడ కూడా బయట పెట్టలేదు..బయట పెట్టకుండా సీబీఐ విచారణ ఎలా ఏస్తారు?సభ సాంప్రదాయాలు శ్రీధర్ బాబు మాట్లాడుతున్నారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపే మిత్ర పక్షాలకు గంటలు గంటలు సమయం ఇస్తారు. ప్రతిపక్షంలో ఉన్న ఇతర పార్టీలకు అసెంబ్లీలో మాట్లాడడానికి సమయం ఇవ్వడం లేదు. రోజూ నువ్వు దొంగ అంటే నువ్వు దొంగ అని అసెంబ్లీలో ఒకరిపై ఒకరు దుమ్ము ఎత్తిపోసుకోవడం తప్ప ఏం లేదు. శాసనసభ హుందాతనాన్ని దిగజార్చిస్తున్నారు "అని వెంకటరమణారెడ్డి మండిపడ్డారు.

### బిఆర్ఎస్ నేతలు బుద్ధిమార్చుకోవాలి : కాంగ్రెస్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బిఆర్ఎస్ నేతల తమ బుద్దిని మార్చుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ " గత పదేళ్ల బి.ఆర్.ఎస్ పాలనలో మైనింగ్, సాండ్ మాఫియాపై సీబీ సి.ఐ.డి విచారణకు ఆదేశిస్తే సభ నడవకుండా..చర్చ జరుగకుండా వ్యవహరించారు. పద్దులపై చర్చ జరగకుండా అడ్డుకుంటున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై నిందారోపణలు చేస్తున్నారు. వారు చెప్పిన పని చేయలేదని, రాజకీయ లబ్ధి, స్వలాభం కోసం ఆయనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు"అని ఎమ్మెల్యే విమర్శించారు.



మనం రోజూ వంట చేసు కుంటాం. కానీ వచ్చిన చిక్కేమిటంటే. కొన్ని పదార్థాలు మిగిలి పోతుంటాయి. వాటిని పడేయలేక ఫ్రిజ్లో పెట్టిస్తాం. కానీ రిఫ్రిజిరేటర్ వీలైనంత తక్కువ

## రిఫ్రిజిరేటర్ తక్కువగా వాడలి!

వాడమంటు న్నారు. ఆరోగ్య నిపుణులు. ఇంకా ఏం చెబుతున్నారంటే...

✦ పండ్లు, కూరగాయలు తాజాగా ఉన్నవి చూసి కొనండి. ఎక్కువ కొని ఫ్రిజ్‌లో ఉంచారంటే అందులో ఉండే పోష కాలు తగ్గి పోతాయి.

✦ వండినవి తాజాగా తినడం ఉత్తమం. మిగిలిన కూరలను మర్నాడు తింటే పరవాలేదు. మూడు రోజులు గనుక నిలవుంచారంటే అది విషతుల్యమవుతుంది. మసాలా కూరలు, సలాడ్స్ మరీ ప్రమాదం.

✦ పాలు, చీజ్ లాంటి హై ప్రొటీన్ ఉన్న పదార్థాలకు చేరు తుంది. అందువల్ల వాటిని వెంటనే ఉపయోగించాలి.

✦ చేపలు, రొయ్యలు, పచ్చి మాంసం లాంటివి నిలవుంచి తినడం వల్ల ఫుడ్ పాయిజన్ అయ్యే ప్రమాదం ఉంది. ✦ అన్నం, పాస్తా, దుంపలు ఫ్రిజ్‌లో పెట్టకూడదు. ✦మర్నాడు పని సులువవు తుందని కూరగాయలను కట్ చేసి ఫ్రిజ్‌లో ఉంచినా నిల్వ చేరుతుంది. ✦ ఒకేసారి పనైపోతుంది కదాని ఎక్కువ పరిమాణంలో కూరగాయలు, పండ్లు కొనకుండా అవసరమైన వాటిని కొనడం.. అలాగే ఎంత ఖర్చవుతుందో అంచనా వేసి వంటచేయడం అలవాటు చేసుకుంటే పండ్లూ పదార్థాలను ఫ్రిజ్‌లో ఉంచనవసరం ఉండదు. □

## ఉదయాన్నే ఇలా చేస్తున్నారా?

చర్మం ఆరోగ్యంగా ఉండాలి. మెరిసిపోవాలి అంటే కదా ఏ అమ్మాయైనా కోరుకునేది? అది సాధ్యమవ్వాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఉదయం కొన్నింటిపై దృష్టిపెట్టాలి. మీ డే రొటీన్లో అవి ఉన్నాయేమో చూసుకోండి మరి!

✦ ఉదయాన్నే చల్లని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోండి. నీళ్ల కొంచెం ఎక్కువ చల్లగా ఉండేలా చూసుకోవడం తప్పనిసరి. ఇది చర్మకణాలకు ఆక్సిజన్ సరఫరా, రక్తప్రసరణ మెరుగ్గా జరిగేలా చేస్తుంది.

2.లేచిన పావుగంటలోపు ఒక గ్లాసు గోరువెచ్చని నీటిని తాగండి. గంటలపాటు నిద్రలో గడిపేస్తాం. ఈ శరీరం డీహైడ్రేషన్‌కి గురవుతుంది. నీళ్ల తాగితే తిరిగి హైడ్రేట్ అవ్వడమే కాదు, మలినాలూ బయటికి పోతాయి. నిమ్మకాయ, కాస్త ఉప్పు చేర్చుకుంటే కోల్పోయిన ఎలక్ట్రోలైట్లని తిరిగి పొందొచ్చు. ఇది చర్మాన్నీ తేమగా కనిపించేలానూ చేస్తుంది.

✦ 35 నిమిషాలు ముఖాన్ని మసాజ్ చేయండి ఏదైనా నచ్చిన నూనె తీసుకుని, ముఖమంతా వృత్తాకారంలో మర్దన చేసుకున్నా మంచిదే.

✦ మాయిశ్చరైజర్ తప్పక రాయండి. విటమిన్ సి ఉన్నవి వాడితే మేలు. ఇది చర్మాన్ని మెరిపించడమే కాదు, ఎండతోనూ పోరాడు తుంది. అలాగని సన్ స్క్రీన్‌ని మాత్రం నిరక్ష్యం చేయొద్దు.

✦ చర్మ



ఆరోగ్యంమీద వ్యాయామాలు చేస్తే ప్రభావమూ ఎక్కువ కాబట్టి, అల్పాహారానికి ముందు 10-15 నిమిషాలు తప్పక వ్యాయామం చేయాలి. ఇదీ చర్మానికి ఆక్సిజన్, పోషకాలు అందేలా చూడగలదు. సెల్ రిపేరింగ్‌కీ సాయపడుతుంది. చెమట ద్వారా విషపదార్థాలు బయటకు వచ్చేలానూ చేస్తుంది. ✦ చర్మంలో కొలాజెన్ ఏర్పడటానికి అమైనో యాసిడ్లు ప్రధానం. అది అందాలంటే ప్రొటీన్ ఆధారిత ఆహారం అంటే గ్రీక్ యోగర్ట్, చేప, ప్రొటీన్ స్మూతీలు గుడ్లు వంటివి ఎక్కువగా తీసుకోవాలి. ఈ జాగ్రత్తలు తీసుకుంటారుగా మరి. □

## శొంఠితో ప్రయోజనం

శొంఠి పొడి వేసి టీ కాస్తే.. ఆ రుచి భలే పసందుగా ఉంటుంది. జలుబు, దగ్గు నుంచి ఉపశమనం కూడా. ఇవే కాదు శొంఠితో మరిన్ని ప్రయోజనాలు కూడా ఉన్నాయండోయ్!

✱ రోజూ కాసింత శొంఠిపొడిని ఆహారంలో చేర్చుకుంటే నెలసరి సమయంలో అధిక రక్తస్రావంతో బాధపడే వాళ్లకి చక్కని ఉపశమనం దొరుకుతుంది. మొదటి మూడు రోజులు శొంఠిపొడి వేసిన అన్నం 2తింటే నొప్పి కూడా తగ్గుతుంది. ✱ కాలి పిక్కలు పట్టేయడం, కండరాల నొప్పులతో బాధపడటం వంటి సమస్యలుంటే ఇది మంచి ఔషధం. ✱. కొవ్వుని కరిగించడంలో శొంఠి ముందుంటుంది. ట్రైగ్లిజరాయిడ్ సమస్యతో బాధపడేవారు. కొన్ని రోజులు శొంఠి టీ తాగితే చక్కని ఫలితం కనిపిస్తుందట. ✱ శరీరం లోపలి వాపులకి, కీళ్లదగ్గర పట్టేసిట్టుగా ఉన్నా ఇది మేలు చేస్తుంది. □

## పులి నుండి విద్యార్థులకు రక్షణ కల్పిస్తూ..



దట్టమైన అడవి మధ్యలో పులి కనిపిస్తే... గుండె గుభేలుమం టుంది కదా! కానీ వాటిని చేయకుండా వారికి ప్రాణ హాని కలగకుండా రక్షణ కల్పిస్తున్నారు 'మాతృశక్తి'కి సంబంధించిన నలుగురు మహిళలు. అమ్మ నేను స్కూల్‌కి వెళ్లను. నన్ను పులి వెంబడిస్తుంది. నాకు భయమేస్తుంది... అని పిల్లాడి మాటలు వింటే ఒంట్లో వణుకు పుట్టిందా తల్లికి కానీ, ఇది తనొక్కరి పరిస్థితే కాదు. 20 సీతారాం పేట్ గ్రామంలో చిన్నారులందరిదీ. మహారాష్ట్రలోని తడోబా పులుల అభయారణ్యానికి దగ్గరగా ఉంది గ్రామం. దాదాపు 120 పులులకు నెలవు ఇది. దాంతో తరచూ పరిసర ప్రాంతాలు తిరుగుతుంటాయి. మనుషుల ప్రాణాలు తీసిన సందర్భాలు చాలానే, పులి ఎప్పుడు ఎక్కడ నుంచి వచ్చి దాడి చేస్తుందో అనే భయం గుప్పెట్లో జీవిస్తారు గ్రామస్థులు. వాటి నుంచి గ్రామాన్ని కాపాడుకునేందుకు ఊరి చుట్టూ కంచెను ఏర్పాటుచేసుకున్నారు ఇక్కడి ప్రజలు. కానీ ఊరి నుంచి బయటకి వెళ్లాలంటే దట్టమైన అడవిని దాటుకుని వెళ్లాలి. ఇది నాలుగు కిలోమీటర్లు ఉంటుంది. రోడ్లు, వీధి లైట్లు సరిగా ఉండవు, ఊర్లో ఎవరు చదువుకోవాలన్నా ఏడు కి.మీ దూరంలో ఉన్న ముధోలికి వెళ్లాలి. పులి దాడి చేస్తుందనే భయంతో పిల్లలు స్కూల్ మానేస్తున్నారు. దీన్ని గమనించిన కిరణ్, వేణు రాండాయే, రీనా నాట్, సీమ మాధవిలు కలిసి ఓ నిర్ణయం తీసుకున్నారు. పిల్లలకు కాపాలాగా వెళ్లాలనుకున్నారు. 'చేతిలో కర్రలు పట్టుకుని విద్యార్థులను ఉదయం బస్ స్టాప్‌కి తీసుకెళతాం. స్కూల్ అయ్యి వాళ్ళు వచ్చేసరికి రాత్రవుతుంది. బస్ స్టాప్‌లో మాకోసం ఎదురుచూస్తారు. మేం నలుగురం నాలుగుల రక్షణ వలయంలా వైపు ఏర్పడతాం. టార్చ్‌లైట్ వెలుగులో కర్రలతో శబ్దాలు చేస్తూ, గట్టిగా అరుస్తూ ఇంటికి తీసుకొస్తాం. పులికి భయపడి మా పిల్లల్ని చదువు మాన్పిస్తే వాళ్ల భవిష్యత్ ఏం కావాలి. అందుకే గ్రామంలో అందరు పిల్లల్ని దగ్గరుండి తీసుకెళ్లి, తీసుకొస్తాం. అప్పుడూ తరచూ పులులు కనిపిస్తాయి. కానీ మే వాళ్లకి చెప్పం. ఎందుకంటే అమ్మగా ఆళ్లని రక్షించాల్సిన బాధ్యత మాదే అంటారీ మహిళలు. ఈనలుగురు అమ్మల ప్రయత్నాన్ని గుర్తించిన అటవీశాఖ వాళ్లకి 'మాతృశక్తి' అనే పేరు పెట్టింది. అంతేకాదు కర్రలు, టార్చ్‌లైట్లు, యూనిఫామ్‌గా చీరలు ఇచ్చి వా ళ్లని ప్రోత్స హించింది. □



## గజరాజరక్షకుడికి గరుడవాహనం

శ్రీవేంకటేశ్వరుడి వేడుకల్లో ఆ ఖగరాజుకు ఎంతో ప్రాధాన్యం. తిరుమల బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ తలమానికం. గరుడధ్వజాన్ని ఎగురవేయటం, గరుడ వాహనంపై ఊరేగించటం, పరిసమాప్తి రోజున గరుడధ్వజ అవరోహణ ఆనవాయితీ. ఇలా కోనేటిరాయడిది, ఖగరాజుది అవినాభావ సంబంధం. భక్తకవి యామునాచార్యులు ఖగరుడుడు విష్ణుమూర్తికి దాసుడుగా, సఖుడుగా, వాహనంగా, ఆసనంగా, ధ్వజం ఛత్రంగా, వినసకర్రగా సేవలందిస్తున్నాడు అని కొనియాడాడు. గరుడుని రెక్కల జ్ఞానవైరాగ్యాలకి ప్రతీకలని తత్వవేత్తలు నిర్వర్తిస్తారు. గరుడుడి ఘనతకు దర్పణం గరుడపురాణం. విష్ణువు స్వయంగా ఈ పురాణాని గరుత్మంతుడికి వినిపించాడట. మనం చేసే పాప పరలోకంలో అనుభవించే విషయాలకు సంబంధించిందే గరుడపురాణం. తిరుమల బృహోత్సవాల్లో గరుడవాహన సేవ అత్యంత ప్రత్యేకం. ఆ పవిత్రమైన రోజు స్వామి గరుడునిపై వైకుంఠమూర్తిగా దర్శనమిస్తాడు. ఆ వాహన సేవ జరిగే రోజున తమిళనాడు శ్రీవిల్లిపుత్తూరు నుంచి గోదాదేవి బహుకరించిన తులసిమాలలు శ్రీవారికి అలంకరిస్తారు. ఆనందనిలయంలో శ్రీవేంకటేశ్వర మూలవిరాట్టుకు సదా అలంకరించే మకరకంఠి (ఒక కంఠాభరణం), లక్ష్మీ హారం, సహస్రనామ మాలల్ని గరుడవాహన సేవ రోజున ఉత్సవ మూర్తికి సమర్పిస్తారు. చెన్నైలోని హిందూ ధర్మార్థసమితి నూతనంగా తయారుచేసిన తొమ్మిది గొడుగులను భక్తులు పాదచారులై తిరుమలకు తెచ్చి సమర్పించడం సంప్రదాయం. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లోనే కాకుండా ప్రతి పౌర్ణమికీ తిరుమలలో ఖిపున్నమి గరుడసేవఖి వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. భగవంతుణ్ణి భక్తులకు చేర్చే పుణ్య కార్యకర్త గరుడుడు. త్యాగరాజస్వామి ఆ పక్షి రాజును స్మరిస్తూ ఖగరాజు నీ యానతి విని వేగ చనలేదోఖి అంటూ ఆవేదనచెందితే.. భక్తరామదాసు గరుడగమన రారా! అని ప్రార్థించాడు. అన్నమయ్య బ్రహ్మోత్సవాల్లోని గరుడవాహనసేవ వైభవాన్ని

## తల్లులకు అది అపోహే !



చాలా మంది తల్లులకి పిల్లల్ని చైల్డ్‌హోం వదిలేసి ఉద్యోగానికి వెళ్లాలంటే గిల్టీగా అనిపిస్తుంట పిల్లలు సరిగా ఎదగరేమో, నేనే దగ్గరుండి చూసుకోవాలేమో అని అపోహ పడుతుంటారు. దాంతో మూడు నాలుగేళ్ల వచ్చేవరకూ వాళ్లే చూసుకుంటూ ఉంటారు. అయితే, తోహోకు యూనివర్సిటీ తాజా అధ్యయనం ప్రకారం... మూడేళ్లలోపు పిల్లల్ని చైల్డ్‌హోంలో ఉంచడం వాళ్లలో కమ్యూనికేషన్, వ్యక్తిగత, సామాజిక, ఫైన్ మోటార్ స్కిల్స్ వంటివి పెరిగాయట. ఇలా ఉన్న పిల్లలతో పోలిస్తే, చైల్డ్‌హోం పిల్లలకి కమ్యూనికేషన్, వ్యక్తిగత సామాజిక నైపుణ్యాలు అధికంగా ఉన్నాయట. వాళ్లమీద వాళ్లకు నియంత్రణ, కోఆర్డినేట్ చేసుకునే తత్వం ఎక్కువట. కాబట్టి, తల్లులు ఎలాంటి ఆందోళన, అపరాధ భావం లేకుండా కెరియర్ను నిర్మించు కోవచ్చు. □

## ఐరన్ తక్కువైతే కష్టమే !

మన ఒంట్లో ఐరన్ తగినంత ఉండాలి. లేకుంటే నీరసం ముంచుక వంటుంది. కళ్ల తిరుగుతున్నట్లు అవుతుంది. ఇలాంటి సమస్యలు రాకూడదంటే అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. వీటిల్లో ఐరన్ అధికం... పాలకూర, గోంగూర, తోటకూర, చుక్కకూర, మెంతికూర, కొత్తిమీర మొదలైన ఆకుకూరల్లో, పెసరపప్పు, మినపప్పు, రాజ్మా, కందిపప్పు, శనగపప్పు, సోయాబీన్స్ తదితర పప్పుల్లో, రాగులు, జొన్నలు, సజ్జలు వంటి ధాన్యాల్లో ఐరన్ అధికంగా ఉంటుంది. దానిమ్మ, యాపిల్ మొదలైన పండ్లు, బాదం, ఖర్జూరం, ఎండు ద్రాక్ష, అంజీరా వంటి డ్రై ఫ్రూట్స్, నువ్వులు, గుమ్మడి గింజలు, పుచ్చ గింజలు వంటి నాట్స్, సీడ్స్ తగినంత మోతాదులో తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన ఐరన్ అందు తుంది. మాంసా హారులు గుడ్డు, చేపలు, చికెన్, కాలేయం: తమ ఆహారంలో చేర్చుకోవాలి. ఐరన్ శరీరానికి



చాలా అవసరం. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి పెరగడం. శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్ సవ్యంగా చేరేలా చేస్తుంది. అలసట బలహీనతలను తగ్గిస్తుంది. మెదడుకు మేలు చేస్తుంది. ఏకాగ్రత పెరుగుతుంది. జ్ఞాపకశక్తి తగ్గకుండా తోడ్పడుతుంది. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు ఐరన్ ఎంతో అవసరం. గర్భిణీలలో రక్తహీనతను నివారిస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. చర్మం పొడిబారకుండా, ముడతలు పడకుండా కాపాడుతుంది. కుదుళ్లకు దృఢత్వాన్ని అందించి, జుట్టు రాలకుండా సాయపడుతుంది.

తెర

## 'లీడర్' సినిమా యాక్షన్ ట్రైలర్ రిలీజ్



హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో సౌత్ ఇండియన్ టీవీ సీరియల్ అవార్డ్స్ (SITSA) కర్టెన్ రైజర్ ఈవెంట్ అట్టహాసంగా జరిగింది. రాఘవి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలుగు సీరియల్ ప్రముఖులు, యాక్టర్లు, డైరెక్టర్లు, నిర్మాతలు హాజరయ్యారు. టెలివిజన్ సీరియల్ పరిశ్రమను గౌరవించడమే లక్ష్యంగా మొదలైన SITSA అవార్డ్స్, దక్షిణ భారతదేశంలో నాలుగు భాషల సీరియల్స్‌ను ఒకే వేదికపైకి తీసుకొచ్చి చరిత్ర సృష్టించనుంది. ఇంతవరకు ప్రతి ఛానల్ తన సొంత అవార్డులు విడివిడిగా నిర్వహిం చేది. ఇప్పుడు నాలుగు భాషలు, నాలుగు రాష్ట్రాలను ఒకేసారి గౌరవించడం ఇండస్ట్రీలో మైలురాయిగా కాబోతుంది. కర్టెన్ రైజర్ ఈవెంట్‌లో నామినేషన్లు, ఓటింగ్ విధానం, ఎక్స్‌పెక్టెడ్ నామినీలు, సీరియల్ ఆర్టిస్టుల పాల్గొన్నారు. ఈ అవకాశం కల్పించినందుకు మధు గారికి, రాఘవి మీడియా టీమ్‌కి అందరూ ధన్యవాదాలు తెలిపారు. టెలివిజన్ పరిశ్రమ 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఇలాంటి అవార్డ్ ఫంక్షన్ ఇదే మొదటిసారి. ఈవెంట్‌లో మాట్లాడిన ప్రముఖులు.. టీవీ కళాకారులు, టెక్నీషియన్లు గత 50 ఏళ్లుగా ప్రతి ఇంట్లోకి వెళ్తున్నా, వారికి గుర్తింపు ఇవ్వడంలో జరిగిన లోపాలను గుర్తు చేశారు. అభిప్రాయపడ్డారు.

## ఘనంగా జరిగిన SITSA కర్టన్ రైజర్ ఈవెంట్



హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో సౌత్ ఇండియన్ టీవీ సీరియల్ అవార్డ్స్ (SITSA) కర్టెన్ రైజర్ ఈవెంట్ అట్టహాసంగా జరిగింది. రాఘవి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలుగు సీరియల్ ప్రముఖులు, యాక్టర్లు, డైరెక్టర్లు, నిర్మాతలు హాజరయ్యారు. టెలివిజన్ సీరియల్ పరిశ్రమను గౌరవించడమే లక్ష్యంగా మొదలైన SITSA అవార్డ్స్, దక్షిణ భారతదేశంలో నాలుగు భాషల సీరియల్స్‌ను ఒకే వేదికపైకి తీసుకొచ్చి చరిత్ర సృష్టించనుంది. ఇంతవరకు ప్రతి ఛానల్ తన సొంత అవార్డులు విడివిడిగా నిర్వహించేది. ఇప్పుడు నాలుగు భాషలు, నాలుగు రాష్ట్రాలను ఒకేసారి గౌరవించడం ఇండస్ట్రీలో మైలురాయిగా కాబోతుంది. కర్టెన్ రైజర్ ఈవెంట్‌లో నామినేషన్లు, ఓటింగ్ విధానం, ఎక్స్‌పెక్టెడ్ నామినీలు, సీరియల్ ఆర్టిస్టుల పాల్గొన్నారు. ఈ అవకాశం కల్పించినందుకు మధు గారికి, రాఘవి మీడియా టీమ్‌కి అందరూ ధన్యవాదాలు తెలిపారు. టెలివిజన్ పరిశ్రమ 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఇలాంటి అవార్డ్ ఫంక్షన్ ఇదే మొదటిసారి. ఈవెంట్‌లో మాట్లాడిన ప్రముఖులు.. టీవీ కళాకారులు, టెక్నీషియన్లు గత 50 ఏళ్లుగా ప్రతి ఇంట్లోకి వెళ్తున్నా, వారికి గుర్తింపు ఇవ్వడంలో జరిగిన లోపాలను గుర్తు చేశారు. అభిప్రాయపడ్డారు.

## మే 22న హారర్ త్రిల్లర్ చిత్రం 'విచిత్ర'



జ్యోతి పూర్వాజ్ ప్రధాన పాత్రలో , రవి,శ్రేయ తివారి హీరో హీరోయిన్ గా సిస్ ఫిలిమ్స్ బ్యానర్ పై సైఫుద్దీన్ మాలిక్ నిర్మాణ దర్శకత్వంలో వస్తున్నా చిత్రం విచిత్ర, ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ సెన్సర్ పనులు పూర్తి చేసుకుని మే 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం దర్శక నిర్మాత సైఫుద్దీన్ మాలిక్ మాట్లాడుతూ మా విచిత్ర మూవీలో హీరోగా రవి, హీరోయిన్ శ్రేయ తివారి, జ్యోతి పూర్వరాజ్, 'బేబీ' శ్రీ హర్షిణి, రవి ప్రకాష్, సూర్య, ఛత్రపతికి శేఖర్, మీనా వాసన్ ముఖ్య పాత్రలుగా నటించిన చిత్రం 'విచిత్ర' 'ప్రపంచం మొత్తం దూరమైన దగ్గరగా ఉండేది అమ్మ ప్రేమే" ప్రతి ఆడతల్లి గుండె తల్లడెల్లేలా సెంటిమెంట్ నేపథ్యంతో రూపొందిన సినిమా "విచిత్ర", ఫ్యామిలీ తో కలిసి సంతోషంగా ఎంజాయ్ చేస్తూ,చూసే చిత్రం 'విచిత్ర'ఈ చిత్రం పోస్టుప్రొడక్షన్ అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని మే 22 న "విచిత్ర "మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.ముఖ్యంగా చిత్రంనికి నిజాని అందించిన మ్యూజిక్ లోని అన్ని పాటలు బాగా వచ్చాయి.

## 'మిరాకిల్' నా కెరీర్ బెస్ట్ ఫిల్మ్: హెబ్బా పటేల్



దర్శకుడిగా ప్రభాస్ నిమ్మల పేరు మారుమ్రోగేలా చేసే చిత్రం మిరాకిల్ ..మల్టీ టాలెంటెడ్ హీరో శ్రీరామ్..కొండమడుగు ప్రజలకు జీవితాంతం కృతజ్ఞుడునై ఉంటాను. ఇప్పటివరకు భారతీయ తెరపై ఆవిష్కారం కాని వినూత్న కథా చిత్రం ఖిఖిమిరాకిల్ఖిఖి దర్శకుడు ప్రభాస్ నిమ్మల..కుమారి 21ఎఫ్, ఈడో రకం ఆడో రకం, ఒదెల రైల్వే స్టేషన్ఖిఖి వంటి బ్లాక్ బస్టర్స్ నా కెరీర్ లో ఎన్నో ఉన్నప్పటికీ... తాజాగా నేను చేస్తున్న ఖిఖిమిరాకిల్ఖిఖి నా కెరీర్ లో మోస్ట్ మెమరబుల్ మూవీ అవుతుంది. థాంక్స్ టు డైరెక్టర్ ప్రభాస్ నిమ్మల అని అన్నారు క్రేజీ హీరోయిన్ హెబ్బా పటేల్.సైదా ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై రమేష్ ఎగ్గిడి శ్రీకాంత్ మొగదాసు చందర్ గౌడ్ సంయుక్తంగా నిర్మిస్తున్న వినూత్న కథాచిత్రం మిరాకిల్‌లో హెబ్బా పటేల్ హీరోయిన్ గా నటిస్తోంది.. సీనియర్ హీరోలు సురేష్, శ్రీరామ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో రణధీర్ బీసు హీరో. సత్య గ్యాంగ్, ఫైటర్ శివ చిత్రాల దర్శకుడు ప్రభాస్ నిమ్మల దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రం మూడో షెడ్యూల్ హైదరాబాద్ పరిసర గ్రామమైన కొండమడుగులో పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజలు, యూనిట్ సభ్యులందరి సమక్షంలో ప్రెస్ మీట్ నిర్వహించింది మిరాకిల్ చిత్రబృందం. తన కెరీర్ బెస్ట్ ఫిల్మ్ గా మిరాకిల్ నిలిచిపోతుందని ప్రకటించడం ద్వారా ఈ చిత్రంపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది హీరోయిన్ హెబ్బా పటేల్.సీనియర్ హీరో శ్రీరామ్ మాట్లాడుతూ... మిరాకిల్ వంటి మంచి సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ పెద్ద హిట్ చేస్తారని, దర్శకుడిగా ప్రభాస్ నిమ్మలకు ఉజ్వల భవిష్యత్ ఉందని పేర్కొన్నారు.

## 'కార్మేని సెల్వం' హృదయానికి హత్తుకునే సినిమా : రామానుజన్



పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన ద్విభాషా చిత్రం"కార్మేని సెల్వం. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్, బడవ గోపీ, కోతండం, కరణ్ చక్రవర్తి, శంకర నారాయణ్ వి, హరిత పరాకోడ్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. ఒక చిత్రానికి సంగీతాన్ని అందించిన ఘనత ఏ ఒక్క వ్యక్తికీ కాకుండా, ఒక సంస్థకు దక్కాలని కోరుకున్నాం. అందుకే 2017లో బెంగళూరులో Musicloud Studio Technologyని ప్రారంభిం చాను. మొదట్లో కార్పొరేట్ ప్రాజెక్టులను స్వీక"రిస్తూ, నెమ్మదిగా నా పనితీరును మెరుగుపరుచు కోవడం మొదలు పెట్టాను. ఇటువంటి సేవను విని యోగించుకోవడం ద్వారా, చిత్ర నిర్మాతలకు మ్యూజిక్ క్లౌడ్ స్టూడియోకు మధ్య ఒక రెవెన్యూ మోడల్ రూపొందించబడింది. ఈ ఆదాయ నమూనా కింద, సౌండ్ ఇంజనీర్లు, వాయిద్య కారులు, ప్రోగ్రామర్లు సహా ఈ ప్రక్రియలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ రాయల్టీలో వాటా లభిస్తుంది. మేము సంగీత నిర్మాణానికి ఒక కార్పొరేట్ నిర్మాణాన్ని తీసుకువస్తున్నాము. సినీ సంగీత రంగంలో ఇదొక కొత్త ప్రభంజనం అనుకోవచ్చు. నేను గతంలో దర్శకుడు రామ్‌తో కలిసి అమృత శ్రీనివాసన్ ప్రధానపాత్ర పోషించిన 'కురైయొండ్రుమ్ ఇల్లై' చిత్రానికి పనిచేశా. ఇప్పుడు కార్మేని సెల్వం లాంటి గొప్ప ఫ్యామిలీ ఎమోషనల్ చిత్రానికి సంగీతం అందించే అవకాశం వచ్చింది.డైరెక్టర్ రామ్ చక్రి గారితో పరిచయం నా జీవితంలో ఒక టర్నింగ్ పాయింట్ అయ్యింది

## 'హారుడు' మే 8న వరల్డ్ వైడ్ రిలీజ్



వీబి,శ్రీ సీతా రాముల కల్యాణం చూతము రారండి, అన్నయ్య, ప్రేమ కోసం, శివ రామరాజు లాంటి బ్లాక్ బస్టర్ సినిమాలతో అలరించిన హీరో వెంకట్ సినిమాల్లోకి కమ్ బ్యాక్ ఇస్తున్నారు. విఆర్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో వెంకట్ హీరో రూపొందుతున్న మాస్ కమర్షియల్ ఎంటర్ టైనర్ హారుడు. రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహిస్తున్నారు.సహా నిర్మాతలు గా ద్వీపు దిక్కల laxman రావుDr Praveen reddy ఉన్నారు.. ఇప్పటికే విడుదలైన టీజర్ కి అద్భుత మైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. సమ్మర్ స్పెషల్ గా మే 8న ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. ఇది కంప్లీట్ మాస్ కమర్షియల్ ఎంటర్ టైనర్. ప్రేక్షకులు కోరుకునే అన్ని ఎలిమెంట్స్ ఇందులో వుంటాయి. ఇది అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించే కథ. వెంకట్ గారి ఇది మంచికం బ్యాక్ మూవీ అవుతుంద్ధి చిత్ర నిర్మాతలు తెలియజేశారు

## 'ఏంటో అంతా సరికొత్తగా" చిత్రం ఫస్ట్ లుక్



"రాము ప్రొడక్షన్స్" బ్యానర్‌పై రూపొందు తున్న 'ఏంటో అంతా సరికొత్తగా" చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు సైలేష్ కొలను చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సైలేష్ కొలను మాట్లాడుతూ.."పోస్టర్ చూడగానే ఒక ఫ్రెష్ ఫీలింగ్ వచ్చింది. టైటిల్ కూడా చాలా కొత్తగా, ఆకర్షణీయంగా ఉంది. ప్రస్తుతం ప్రేక్షకులు కొత్త కంటెంట్, కొత్త కథలను ఎక్కువగా ఆదరిస్తున్నారు. ఈ సినిమా కూడా అదే దిశలో మంచి ప్రయత్నంగా కనిపిస్తోంది. టీమ్ అంతా కొత్త ఎనర్జీతో పనిచేస్తున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది.రాజ్ బోను గారు కథ, స్క్రీన్ ప్లే మరియు దర్శకత్వం వహించడం చాలా ఆసక్తికరంగా ఉంది. ఆయన కథ చెప్పే విధానం ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని నమ్ముతున్నాను. రాము గారు ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించడం అభినందనీయం. మంచి కంటెంట్‌తో వస్తున్న ఈ సినిమా తప్పకుండా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను," అని తెలిపారు.ఈ చిత్రానికి రాజ్ బోను కథ, స్క్రీన్ ప్లే మరియు దర్శకత్వం వహిస్తున్నారు. రాము.ఎం నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సంగీతం రిషి.ఎం, సినిమాటోగ్రఫీ వేణు కొత్తకోట, ఎడిటింగ్ హారీష్ జె.ఆర్ కృష్ణ అందిస్తున్నారు.

# రాజస్థాన్ రాయల్ విక్టరీ

## కుప్పకూలిన చెన్నై బ్యాటింగ్
## వైభవ్ సూర్యవంశీ ధనాధన్



**గౌహతి:** ఐపీఎల్‌లో తొలి రెండు రోజుల్లో భారీ స్కోర్లు నమోదవగా, మూడో రోజు బౌలర్ల హవా నడిచింది. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సీఎస్‌కే ఉంచిన 128 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని 12.1 ఓవర్లలోనే అందుకుంది. ఈ ఐపీఎల్‌లో సెంటరాఫ్ అట్రాక్షన్‌గా ఉన్న 15ఏళ్ల యంగ్ డైనమైట్ వైభవ్ సూర్యవంశీ(17 బంతుల్లో 52) అందరి అంచనాలకు తగ్గట్లే మొదటి బంతి నుంచే బౌలర్లపై విరుచుకుపడ్డాడు. హెన్రీ వేసిన మొదటి ఓవర్లో ఫోర్, సిక్స్, ఫోర్‌తో ప్రారంభమైన వైభవ్ తుఫాన్....అలా అలా కొనసాగింది. ఖలీద్‌కు ఓ ఫోర్, హెన్రీకి మరో సిక్స్, కంబోజ్‌కు రెండుసిక్స్‌లు, ఓ ఫోర్... నూర్ ఆహ్మద్‌కు రెండు సిక్స్‌లు గిఫ్ట్‌గా ఇచ్చాడు. 15 బంతుల్లోనే మెరుపు హాఫ్ సెంచరీ సాధించారు. అందులో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు ఉన్నాయి. జైశ్వాల్‌తో కలిసి 6.2 ఓవర్లలోనే 75 రన్స్ అందించి అవుటయ్యాడు. మిగతా పనిని జైశ్వాల్(38 నాటౌట్), కెప్టెన్ రియాన్ పరాగ్ (14 నాటౌట్) పూర్తి చేశారు. సీఎస్‌కే బౌలర్లలో అన్షుల్ కంబోజ్‌కు రెండు వికెట్లు దక్కాయి.

అంతకుముందు రాజస్థాన్ రాయల్స్ బౌలర్ల ధాటికి సీఎస్‌కే బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కుప్పకూలింది. టాస్ గెలిచి తొలుత బౌలింగ్ చేసిన సీఎస్‌కేను 19.4 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌట్ చేసింది. తొలి బంతి నుంచే రాయల్స్ బౌలర్లను ఎదుర్కొనేందుకు సీఎస్‌కే బ్యాటర్లు తెగ ఇబ్బంది పడ్డారు. ఆరంభ ఓవర్లలో నండ్రే బర్గర్, జోఫ్రా ఆర్చర్ నిప్పులు చెరిగారు. రెండో ఓవర్ చివరి బంతికి తొలిసారి సంజూ శాంసన్(6)ను బర్గర్.. మూడో ఓవర్ చివరి బంతికి రుతురాజ్ గైక్వాడ్(6)ను ఆర్చర్ అద్భుతమైన బంతులతో క్లీన్ బౌల్డ్ చేశారు. యువ ఆటగాడు ఆయూష్ మాత్రేను బర్గర్ మరో అద్భుతమైన బంతితో డకౌట్ చేశాడు. ఆతర్వాత మాథ్యూ షార్ట్(2)ను సందీప్ శర్మ.. సర్ఫరాజ్ ఖాన్ (17), శివమ్‌దూబే(6)లను రవీంద్ర జడేజా ఒకే ఓవర్‌లో పెవిలియన్‌కు పంపారు. కార్తీక్ శర్మ(18)ను బ్రిజేశ్ శర్మ.. నూర్ అహ్మద్ (1)ను జోఫ్రా ఆర్చర్ ఔట్ చేశారు. మ్యాట్ హెన్రీ(5)ను రవి బిష్ణోయ్ పెవిలియన్‌కు పంపాడు.

చెన్నై ఇన్నింగ్స్‌లో ఓవర్టన్ చేసిన 43 పరుగులే అత్యధిక స్కోరు. అతను స్లాగ్ ఓవర్లలో చూపిన పోరాట పటిమతో సీఎస్‌కే 100 పరుగుల మార్కును దాటగలిగింది. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో ఆర్చర్, బర్గర్, రవీంద్ర జడేజా రెండేసి వికెట్ల చొప్పున.. బ్రిజేష్ శర్మ, సందీప్ శర్మ, రవి బిష్ణోయ్ తలో వికెట్ పడగొట్టారు. సీఎస్‌కే ఇన్నింగ్స్‌లో ముగ్గురు మాత్రమే రెండంకెల స్కోరు చేరారు.

# ఫిడే క్యాండిడేట్స్ టోర్నీలో ప్రజ్ఞానంద శుభారంభం



**ఫాపోస్(సైప్రస్):** ఫిడే క్యాండిడేట్స్ టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద శుభారంభం చేశాడు. మొదటి రౌండ్‌లో డచ్ ఆటగాడు అనీష్ గిరికి చెక్ పెడుతూ పూర్తిపాయింట్ సాధించాడు. తొలి రౌండ్ తర్వాత అఫాబియానో కరువానాతో కలిసి ప్రజ్ఞానంద సంయుక్తంగా ఆధిక్యంలో నిలిచారు. ఉత్కంఠభరితంగా సాగిన మొదటి రౌండ్‌లో అనీష్ గిరిని 51 ఎత్తుల్లో ప్రజ్ఞానంద చిత్తు చేశాడు. ఈ గెలుపుతో ప్రజ్ఞానంద ఒక పాయింట్ దక్కించుకున్నాడు. ప్రపంచ కప్‌ఛాంపియన్ సిందరోవ్ తన అద్భుతమైన వ్యూహాత్మక నైపుణ్యాన్ని ప్రదర్శించి రష్యాకు చెందిన ఆండ్రీ ఎసిపెంకోపై పైచేయి సాధించగా, టోర్నమెంట్‌కు ముందు ఫేవరెట్‌గా ఉన్న కరువానా తన తోటి అమెరికన్ హికారు నకమురాను ఆశ్చర్యపరిచాడు. ఈ డబుల్ రౌండ్‌రాబిన్ టోర్నమెంట్‌లో ఎనిమిది మంది ఆటగాళ్లు పోటీపడుతున్నారు. మహిళల విభాగంలో భారత జీఎంలు దివ్యా దేశ్‌ముఖ్, వైశాలి తొలి రౌండ్ గేమ్‌లు డ్రాగా ముగించారు. భారత గ్రాండ్‌మాస్టర్, మహిళల ప్రపంచ కప్ ఛాంపియన్ దివ్య దేశ్‌ముఖ్... కోనేరు హంపీ స్థానంలో చివరి నిమిషంలో వచ్చిన ఉక్రెయిన్‌కు చెందిన అన్నా ముజిచుక్‌తో డ్రా చేసుకోగా... ఆర్. వైశాలి కొన్ని ఉత్కంఠభరితమైన క్షణాలను తట్టుకుని కజకిస్తాన్‌కు చెందిన బిబిసారా అసాబాయేవాతో పాయింట్‌ను పంచుకుంది.




# గిల్, శ్రేయాస్ బిగ్ ఫైట్

## ఉత్కంఠ రేపుతున్న పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ పోరు

**పంజాబ్ కింగ్స్(అంచనా)**
ప్రభ్ సిమ్రాన్ సింగ్(వికెట్ కీపర్), ప్రియాంష్ ఆర్య, కూపర్ కొన్నోలీ, శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), మార్కస్ స్టోయినీస్, శశాంక్ సింగ్, ఒమర్జాయ్, హర్‌ప్రీత్ బ్రార్, మార్కో జాన్సెన్, అర్ష్‌దీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్.

**గుజరాత్ టైటాన్స్(అంచనా)**
శుభమన్ గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, జోస్ బట్లర్ (వికెట్ కీపర్), గ్లెన్ ఫిలిప్స్, వాషింగ్టన్ సుందర్, రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్, సాయి కిషోర్, జాసన్ హోల్డర్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ

**న్యూచండీఘడ్:** భారత్ అగ్రశ్రేణి బ్యాటర్లు శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ కెప్టెన్లుగా నేడు తొలి పరీక్ష ఎదుర్కోబోతున్నారు. చండీఘడ్ వేదికగా గత ఏడాది రన్నరప్ పంజాబ్ కింగ్స్‌తో గుజరాత్ టైటాన్స్ తలపడనుంది. ఈ మ్యాచ్‌లో సత్తా చాటాలని ఇద్దరూ ఉవ్విళ్లూరుతున్నారు. మరోసారి పరుగుల వరద పారే అవకాశం ఉన్న ఈ మ్యాచ్‌లో గెలిచి బోణీ చేసేదెవరనేది ఉత్కంఠ రేపుతోంది.

2022లో తమ తొలి సీజన్‌లోనే ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన గుజరాత్ టైటాన్స్... స్థిరంగా రాణిస్తోంది. గత ఏడాది ఎలిమినేటర్స్‌లో ముంబై ఇండియన్స్ చేతిలో ఓడి మూడో స్థానంలో నిలిచింది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్ టైటాన్స్ జట్టు సమతూకంగా ఉంది. గత ఏడాది పరుగుల వరద పారించిన సాయి సుదర్శన్, జోస్ బట్లర్, ఫ్లయింగ్ బర్డ్ గ్లెన్ ఫిలిప్స్, రాహుల్ తెవాటియా రూపంలో బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్ట్రయిక్ రేట్ మెరుగుపర్చుకోవడంపై దృష్టి సారించాడు. గిల్, సాయి సుదర్శన్ జోడీ గత సీజన్‌లో చక్కని ఆరంభాలు ఇచ్చింది.

**సూపర్ ఫామ్‌లో సుదర్శన్**

ముఖ్యంగా సాయి సుదర్శన్ 15 మ్యాచ్‌ల్లో ఆరు హాఫ్ సెంచరీలు, ఒక సెంచరీ సహా మొత్తం 759 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. గాయానికి ముందు దేశీయ క్రికెట్‌లోనూ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. గాయం నుంచి కోలుకుని సాయి సుదర్శన్ ఐపీఎల్‌కు అందుబాటులోకి రావడం గుజరాత్‌కు కలిసివచ్చే అంశం. ఇంగ్లాండ్ ప్లేయర్ జోస్ బట్లర్ క్రీజ్‌లో ఉన్నంత సేపు అతన్ని అడ్డుకోవడం కష్టమే. ఇక గ్లెన్ ఫిలిప్స్, వాషింగ్టన్ సుందర్, రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్, జాసన్ హోల్డర్ రూపంలో సూపర్ ఆల్‌రౌండర్ల అండ గుజరాత్‌కు ఉంది. అలాగే హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, హోల్డర్ రూపంలో పేస్ అటాక్... రషీద్‌ఖాన్, సుందర్ రూపంలో చక్కని స్పిన్ వేరియేషన్ ఉంది. వికెట్ కీపర్ బ్యాటర్ కుమార్ కుశాగ్ర బ్యాకప్‌గా ఉంటాడు.

**శ్రేయాస్ బ్యాటింగ్‌పైనే ఆశలు**

కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్సీలో పంజాబ్ కింగ్స్ గత ఏడాది ఫైనల్ చేరినా.. చివరి మెట్టుపై నిరాశపరుస్తూ రన్నరప్‌తోనే సరిపెట్టింది. అదే జోరును ఈ సీజన్‌లోనూ కొనసాగించాలన్న పట్టుదలతో బరిలోకి దిగుతున్నది. గత సీజన్‌లో కెప్టెన్‌గా శ్రేయాస్ జట్టును ముందుండి నడిపించాడు. 175కి పైగా స్ట్రైక్ రేట్‌తో 604 పరుగులు చేశాడు. పంజాబ్ జట్టు బలం దాని విధ్వంసకరమైన బ్యాటింగ్ లైనప్. ఐపీఎల్ 2025లో ప్రియాంష్ ఆర్య సంచలన తారగా నిలిచాడు. 17 మ్యాచ్‌ల్లో 179.24 స్ట్రైక్ రేట్‌తో 475 రన్స్ సాధించాడు. ప్రభ్‌సిమ్రాన్ సింగ్ జోడీగా మెరుపు ఆరంభాలు ఇచ్చారు. వీరిద్దరూ కలిసి 169 స్ట్రైక్ రేట్‌తో 1,024 పరుగులు సాధించారు. ఈ ఓపెనర్లు అదే ధాటి కొనసాగిస్తే పంజాబ్‌కు తిరుగుండదు. నెహాల్ వధేరా, శశాంక్ సింగ్‌లతో కూడిన మిడిర్ ఆర్డర్ పటిష్టంగా ఉంది. జోష్ ఇంగ్లిస్ స్థానంలో ఆస్ట్రేలియాకు చెందిన కూపర్ కానలీ రూపంలో పంజాబ్‌కు స్పెషలిస్ట్ బ్యాటర్ అందుబాటులోకి వచ్చాడు. వీరికి తోడుగా మార్కస్ స్టోయినీస్, ఒమర్జాయ్ ఉన్నారు. ముఖ్యంగా రషీద్ ఖాన్ నేతృత్వంలోని బలమైన స్పిన్ బౌలింగ్ దాడిని ఎదుర్కోవడంలో కీలకం కానుంది. ఇక బౌలింగ్ డిపార్ట్‌మెంట్‌కు వస్తే టీమిండియా ఓపెనింగ్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్, హర్‌ప్రీత్ బ్రార్, మార్కో జాన్సెన్, స్పెషలిస్ట్ స్పిన్నర్ చాహల్‌తో వైవిధ్యంగా ఉంది.

**హెడ్ టుహెడ్ రికార్డు**

పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ ముఖాముఖి రికార్డ్‌లో 3-3తో సమవుజ్జీగా ఉన్నాయి. గత సీజన్‌లో ఈ రెండు జట్ల మధ్య జరిగిన ఏకైక పోరులో పంజాబ్ కింగ్స్ 11 పరుగుల తేడాతో గెలుపొందింది.

**పిచ్, వెదర్ రిపోర్ట్**

గత ఏడాది న్యూ చండీగఢ్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు మాత్రమే సాధించిన పంజాబ్... ఈసారి తమ హోమ్ రికార్డ్‌ను మెరుగుపరుచుకోవాలని చూస్తోంది. ఈ పిచ్ 180 నుంచి 200 మధ్య పరుగులు నమోదయ్యే అవకాశం ఉంది. రెండో ఇన్నింగ్స్‌లో మంచు బౌలర్లకు ఇబ్బంది కలిగించే అవకాశం ఉన్నందున టాస్ నెగ్గి జట్టు మొదట బౌలింగ్ చేయడానికి మొగ్గు చూపే అవకాశం ఉంది.

# సినర్ ఖాతాలో వరుసగా రెండో టైటిల్



**మియామి:** ప్రపంచ నంబర్ టూ జానిక్ సినర్ ఖాతాలో మరో టైటిల్ చేరింది. పురుషుల సింగిల్స్ ఫైనల్లో జిరి లెహెకాను 6-4, 6-4 తేడాతో వరుస సెట్లలో ఓడించి మియామి మాస్టర్స్ ట్రోఫీ అందుకున్నాడు. ఇటీవలే ఇండియన్ వెల్స్ టైటిల్ నెగ్గిన జానిక్ సినర్‌కు ఇది వరుసగా రెండో ట్రోఫీ. 2024లో మయామిని గెలుచుకున్న సినర్... గత సంవత్సరం మూడు నెలల డోపింగ్ నిషేధం కారణంగా టోర్నీకి దూరమయ్యాడు. గత సంవత్సరం పారిస్‌లో సాధించిన విజయంతో మొదలుపెట్టి, ఇప్పుడు వరుసగా మూడు మాస్టర్స్ 1000 ఈవెంట్‌లను గెలుచుకున్నాడు. 2017లో రోజర్ ఫెదరర్ తర్వాత ప్రతిష్టాత్మక హార్డ్‌కోర్ట్ టైటిల్స్ క్లీన్ స్వీప్ చేసిన మొదటి ప్లేయర్‌గా, ఒక్క సెట్ కూడా కోల్పోకుండా ఈ ఘనత సాధించిన తొలి ఆటగాడిగా నిలిచాడు. 22వ ర్యాంక్ చెక్ ఆటగాడైన లెహెకా మొదటి సీర్వస్ బ్రేక్ చేసిన సినర్...తొలి సెట్‌ను 6-4తో నెగ్గి పైచేయి సాధించాడు. ఆతర్వాత వర్షం కురవడంతో 90 నిమిషాల పాటు ఆటకు అంతరాయం ఏర్పడింది. రెండో సెట్ మొదలైన తర్వాత సినర్ అదే జోరు కొనసాగించాడు. రెండో సెట్‌లో ఏకైక బ్రేక్ సాధించి 5-4తో ఆధిక్యంలోకి వచ్చిన సినర్ ఆర్వాతి సర్వీసును నిలబెట్టుకుని సెట్‌ను, మ్యాచ్‌ను, టైటిల్‌ను చేజిక్కించుకున్నాడు. ఇది తనకు చాలా ప్రత్యేకమైన క్షణమని మ్యాచ్ అనంతరం సినర్ అన్నాడు.

# పోలీస్ ఫుట్‌బాల్ :అసోం రైఫిల్స్ జట్ల జైత్రయాత్ర



**హైదరాబాద్, మార్చి 30(వార్త క్రీడా ప్రతినిధి):** అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో అసోం రైఫిల్స్ జట్లు విజయాలతోదూసుకుపోతున్నాయి. సోమవారం జరిగిన మ్యాచ్‌ల్లో అసోం రైఫిల్స్ పురుషులు, మహిళల జట్లు తమ ప్రత్యర్థి జట్లపై అలవోకగా గెలుపొందాయి. ఆర్టిలరీ గ్రౌండ్‌లో జరిగిన గ్రూప్-ఎఫ్ మ్యాచ్‌ను అసోం రైఫిల్స్ ఏకపక్షంగా ముగించింది. 6-0 గోల్స్ తేడాతో తెలంగాణను ఓడించింది. ఈ మ్యాచ్‌లోనూ తెలంగాణ పోలీస్ జట్టు ఆటతీరు నిరాశపరిచింది. తెలంగాణ రక్షణ పంక్తిని చెల్లాచెదురు చేస్తూ అసోం రైఫిల్ ఫార్వర్డు గోల్స్ వర్షం కురిపించారు. ఏకంగా ఆరు గోల్స్ సాధించారు. తెలంగాణ పోలీస్‌కు ఇది వరుసగా మూడో ఓటమి.

ఇతర మ్యాచ్‌ల్లో రాజస్థాన్ 8-0 గోల్స్‌తో చండీఘడ్‌పై, ఢిల్లీ 4-1తో కర్ణాటకపై, ఒడిషా 2-1తో సీఆర్‌పిఎఫ్‌పై, గుజరాత్ 4-1తో ఆంధ్రప్రదేశ్‌పై, ఉత్తరప్రదేశ్ 4-0తో ఆర్పీఎఫ్‌పై గెలుపొందాయి. బీహార్, అరుణాచల్ ప్రదేశ్ మ్యాచ్ 2-2తో... పంజాబ్, ఐటీబీపీ మ్యాచ్ 1-1తో.. మధ్యప్రదేశ్, ఎస్ఎస్‌బి 1-1 గోల్స్‌తో డ్రాగా ముగిశాయి. మహిళల విభాగంలో అసోం రైఫిల్స్ 4-0 గోల్స్‌తో ఒడిషాపై గెలుపొందగా, మణిపూర్ 2-1 గోల్స్‌తో తమిళనాడును ఓడించింది.




# దలాల్‌స్ట్రీట్ ఆల్‌టైమ్ లాస్

## బిఎస్ఇ కంపెనీల టర్నోవర్‌లో 9 లక్షల కోట్ల నష్టం

**ముంబయి, మార్చి 30:** దేశీయ మార్కెట్ సూచీలు వారం ప్రారంభంలోనే భారీ నష్టాలు చవిచూసాయి. దేశీయ, విదేశీ మార్కెట్ ధోరణులు,అ నిశ్చితులే ఈ పతనానికి కారణం అయ్యాయి. ఇప్పటికే ఇరాన్ అమెరికా ఉద్రిక్తతలు ఈనష్టాలను మరింతపెంచుతున్నాయి. ముడిచమురు ధరలు పెరుగుతుండటంతో ద్రవ్యోల్బణం ఆందోళన పెరిగింది. ఈపరిస్థితుల్లో రిస్క్ వద్దని ఇన్వెస్టర్లు విత్‌డ్రాచేస్తున్నారు. దీనితో అమ్మకాల ర్యాలీ కొనసాగింది. బిఎస్ఇ సెన్సెక్స్ 1635.67 పాయింట్లు పతనమై 71,947.55 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ కూడా 488.20 పాయింట్లు క్షీణించి 22,331.40 పాయింట్లకు చేరినట్లు స్పష్టం అయింది.

రెండు రోజుల ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 4.41శాతం, నిఫ్టీ 4.18శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్ఇలో నమోదిత కంపెనీల విలువలు రూ.9 లక్షలకోట్లు క్షీణించి మొత్తం కంపెనీల టర్నోవర్ రూ.4.12 లక్షలకోట్లకు తగ్గింది. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్‌సూచీ 2.51శాతం, 250 స్మాల్‌క్యాప్ సూచీ 2.57శాతంచొప్పున క్షీణించాయి. బిఎస్ఇలో 876షేర్లు మాత్రమే పెరిగితే 3563 కంపెనీలు దిగజారాయి. మొత్తం 161 కంపెనీలు ఎలాంటి మార్పులు లేకుండా కొనసాగాయి. 31వ తేదీ మహావీర్‌జయంతి సందర్భంగా మార్కెట్లకు సెలవుల్లోకి వెళతాయి. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు రికార్డుస్థాయిలో పతనమయ్యాయి. ఇంటర్ బ్యాంకు ఫారిన్ ఎక్స్ఛేంజి కౌంటర్‌లో భారత్ రూపాయి 95.22గా నమోదయింది. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ జైన్ ఐదు సెటిల్‌మెంట్లకుగాను రూ.1,48,497గా నమోదయింది. కమొడిటీ మారెనకట్లలో బ్రెంట్ ముడిచమురు మేనెల సెటిల్‌మెంట్లు 2.68డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 115.25 డాలర్లుగా కొనసాగాయి. కొత్తగా బిఎస్ఇలో లిస్ట్ అయిన సిఎంపిడి సంస్థ 154.05 వద్ద స్థిరపడింది. ఇష్యూధర 172గా ఉన్నా చివరకు అక్కడే సెటిల్ అయింది. బ్యాంకింగ్ స్టాక్స్ భారీగానష్టపోయాయి. నిఫ్టీ బ్యాంక్ సూచీ 3.82శాతం క్షీణించింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 6.55శాతం, కెనరా బ్యాంకు 5.21శాతం, బ్యాంక్ఆఫ్ బరోడా 5.07 శాతం, ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంకు 4.88శాతం, ఇండస్‌ఇడ్, ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు 4.86శాతం, 4.66శాతంగా క్షీణించాయి. యెస్ బ్యాంకు కూడా 4.64శాతం పంజాబ్‌నేషనల్ బ్యాంకు 4.12శాతం, ఎస్‌బిఐ 3.80, కోటక్ మహీంద్ర 3.59, ఫెడల్‌బ్యాంకు 3.34, యాక్సిస్‌బ్యాంకు 3.05, హెచ్‌డిఎఫ్‌సిబ్యాంకు 2.80, ఐసిఐసిఐబ్యాంకు 1.78శాతంచొప్పున క్షీణించాయి. అంతర్జాతీయంగా ధరలు పెరగడంతో దేశీయంగాఉన్న అల్యూమినియం కంపెనీల షేర్లు పెరిగాయి. నాక్ 4.14శాతం, హిందాల్కో 2.04శాతం చొప్పున పెరిగాయి. ఇక అర్బన్ కంపెనీ 3.49శాతం పెరిగింది. జూబిలియన్ ఫుడ్‌వర్క్స్ 4.23శాతం క్షీణిస్తే కెఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ 2.10శాతం పెరిగాయి. కోల్ ఇండియా షేర్లు 1.15శాతంపెరిగితే ఎన్విరో ఇన్‌ఫ్రా ఇంజనీర్స్ 1.92శాతం, దిలీప్ బిల్డ్‌కాన్ 0.19శాతం పెరిగాయి. సీగల్ ఇండియా 0.73శాతం చొప్పున పెరిగింది. రైల్‌టెల్‌కార్పొరేషన్ 5.51 శాతం, భెల్ 3.65శాతంచొప్పున క్షీణించాయి.

# జీవనకాల కనిష్టానికి భారత్ రూపాయి




**ముంబయి, మార్చి 30:** భారతీయ కరెన్సీ రూపాయి విలువ భారీగా పతనమవుతోంది. సోమవారం మరింత క్షీణించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మొదలైనప్పటి నుంచి వేగంగా పడిపోతూ వస్తోంది. వారం ప్రారంభంలో మరింత పతనమై సరికొత్త జీవనకాల కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ తొలిసారి 95మార్కును దాటింది. ఇంట్రాడేలో ఒక స్థాయిలో రూ.95.22 వద్ద కనిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడం, భౌగోళిక ఉద్రిక్తతలు రూపాయి విలువపై ఒత్తిడి పెంచుతున్నాయి.

రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చర్యలు చేపట్టినా క్షీణత ఆగకపోవడం గమనార్హం. ఆర్‌బీఐ మంత్రం పని చేయడం లేదని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్‌ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం గతనెల 28న మొదలైంది. అప్పటి నుంచి చూసుకుంటే రూపాయి విలువ దాదాపు4.1శాతం మేర పడిపోయింది. ఈనెల 27వ తేదీన తొలిసారి 94.82 వద్ద ఆల్ టైమ్‌ని తాకింది.

దీంతో రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ చర్యలు చేపట్టింది. ప్రతి రోజూ ట్రేడింగ్ ముగిసే నాటికి ఆన్‌షోర్ మార్కెట్లో బ్యాంకులు 100 మిలియన్ డాలర్ల వరకే ఓపెన్ పొజిషన్లు ఉంచుకునేలా కొత్త రూల్స్ తీసుకొచ్చింది. అంతకు ముందు ఈ పరిమితి 100 కోట్ల డాలర్ల వరకు ఉండేది. ఏప్రిల్ 10 నుంచి కొత్త రూల్స్ అమలులోకి రానున్నాయి. దీంతో సోమవారం ఉదయం రూపాయి విలువ కాస్త పుంజుకుంది. 128 పైసలు పుంజుకొని 93.57 వద్దకు పెరిగింది. మార్కెట్లు ముగిసే నాటికి మళ్లీ భారీగా పడిపోయింది. తొలిసారి 95 మార్కు దాటింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్ కు 115డాలర్లకు చేరింది. ముడి చమురు ధర పెరగడంతో మన దేశానికి దిగుమతి బిల్లుల భారం భారీగా పెరుగుతోంది.

మరోవైపు ఎగుమతులు బలహీనపడుతున్నందున కరెంట్ ఖాతా లోటు పెరిగేందుకు కారణమవుతోంది. ఫలితంగా డాలర్ విలువ పెరిగి రూపాయి మారకపు విలువ క్షీణిస్తోంది. మరోవైపు దేశీయ ఈక్విటీ మార్కెట్లో విదేశీ మదుపరులు తమ పెట్టుబడులు విత్‌డ్రా చేస్తున్నారు. దీనివల్లకూడా రూపాయి విలువ బలహీన పడేలా చేస్తోంది. దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ భారీగా పడిపోయాయి. సెన్సెక్స్ 1636 పాయింట్ల మేర నష్టపోయింది. నిఫ్టీ 50 ఇండెక్స్ 22,350 దిగువకు చేరుకుంది. ఇరాన్ యుద్ధం తీవ్రమవడం, చమురు ధరలు పెరగడం, విదేశీ పెట్టుబడులు తరలిపోవడం వంటి కారణాలతో మార్కెట్లు పడిపోతున్నాయని విశ్లేషకుల అంచనా.

# ఐఐపి సూచీకి తయారీ రంగం మద్దతు




**ముంబయి, మార్చి 30:** భారత్‌పారిశ్రామిక ఉత్పత్తి సూచీ ఫిబ్రవరిలో 5.2శాతంపెరిగింది. అంతకుముందునెలలో ఉన్న 4.8శాతంతో పోలిస్తే స్వల్పంగా పెరిగింది. ఉత్పత్తిరంగంలో తయారీ వృద్ధి చెందడమే ఇందుకు కారణమని కేంద్ర అర్థగణాంక శాఖ ప్రటించింది. తయారీ రంగ ఉత్పత్తి 6శాతంపెరిగింది. విద్యుత్ ఉత్పత్తి మందగించింది. 5.1శాతంనుంచి 2.3శాతానికి పడిపోయినా ఉత్పత్తిరంగం సూచీకి దన్నుగా నిలిచింది. ఇంటర్మీడియేట్ గూడ్స్ ఉత్పత్తి ఫిబ్రవరిలో 7.7శాతం నమోదయింది. అదే జనవరిలో 6.3శాతంనుంచి కొంతమేర పెరిగితే మౌలికవనరుల రంగ ఉత్పత్తుల వృద్ధి స్వల్పంగా ఉంది. 14.6శాతంనుంచి 11.2శాతం మాత్రమే నమోదయింది. ఇక వినియోగరంగంలో కొంతమెరుగుపడింది. వినియోగరంగ ఉత్పత్తుల తయారీ 7.2శాతంనుంచి 7.3శాతానికి పెరిగింది. ఐఐపి సూచీ వివరాలుచూస్తుంటే ఇరాన్‌యుద్ధం భారత్ ఉత్పత్తిరంగంపై ఎలాంటి ప్రభావంచూపించలేదని తెలుస్తోంది. అయితే వాణిజ్య ఎల్పీజీ సరఫరాను మాత్రం కొంత దెబ్బతీయడంతో కొన్ని ఫ్యాక్టరీల్లో ఉత్పత్తికి ఆటంకాలు ఎదురయ్యాయి. ప్రత్యేకించి ఎంఎస్ఎంఇ రంగాన్ని ఈ ఎల్పీజీ సరఫరా దెబ్బతీసిందని, భారతీయ పారిశ్రామికవేత్తల సంఘం ఛైర్మన్ కెఇ రఘునాథన్ అన్నారు. భారీ కార్పొరేషన్లుగా కాకుండా ఎంఎస్ఎంఇలు కేవలం స్వల్పమార్జిన్లతోనే కొనసాగుతాయి. ఇంధన వ్యయం పెరగడం, ఎల్పీజీ సరఫరా అంతంతమాత్రంగానే ఉండటం, వర్క్‌ఫోర్స్ తగ్గించుకోవాల్సి రావడంతోపాటు ఉత్పత్తిని కూడా తగ్గించుకున్నాయి.

# బడ్జెట్ అంచనాల్లో 80.4శాతం లోటు



**న్యూఢిల్లీ, మార్చి 30:** కేంద్ర ఆర్థికలోటు బడ్జెట్‌లో పొందుపరిచిన అంచనాల్లో80.4 శాతానికి చేరింది. మొదటి 11నెలలకాలంలో 80 శాతానికిపైగానమోదయినట్లు ఆర్థికశాఖ అంచనా వేసింది. రెవెన్యూ, వ్యయం మధ్య తేడా 12.53 లక్షల కోట్లుగా ఉంది. ఏప్రిల్‌నుంచి ఫిబ్రవరి వరకూ ఈ మొత్తం తేడా కనిపించింద.ఇ పూర్తి సంవత్సర టార్గెట్ రూ.15.58 లక్షలకోట్లుగా ఉంది. కాగ్ విడుదలచేసిన వారాంతపు డేటాలోనే ఈ వివరాలు వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్థికలోటు రూ.13.46 లక్షలకోట్లుగా ఉంది. నికర పన్నురాబడులు వేగం పుంజుకున్నాయి. సమిష్టిగా మొత్తం 21.45 లక్షలకోట్లకు చేరుతున్నాయి. వార్షిక టార్గెట్‌లో 80.2శాతం సాధించాయి. జనవరి వరకూ పన్నురాబడులు 78.3 శాతంగా ఉనానయి. నికర పన్ను వసూళ్ల 79.6 శాతంగా ఉన్నట్లు తేల్చింది. మూలధన వ్యయం రూ.9.29 లక్షలకోట్లుగా ఉంది. బడ్జెట్ టార్గెట్‌లో 84.8శాతంగా ఉంది. గతనెలవరకూ కూడా మూలధన వ్యయం 8.42లక్షలకోట్లుగా ఉంది. వార్షిక బడ్జెట్‌లో 76.8శాతం సాధించినట్లు వెల్లడించింది. ఇక కేంద్ర ద్రవ్యలోటు ఏప్రిల్ ఫిబ్రవరి నెలల కాలానికిగాను రూ.3.89 లక్షల కోట్లుగా ఉంది. వార్షిక టార్గెట్‌లో 73.8శాతంగా ఉంది. గత ఏడాది ఇదే టార్గెట్ బడ్జెట్ అంచనాల్లో 87.1శాతంగా ఉంది. మొదటి 11 నెలలకుగాను వ్యయం 40.44 లక్షల కోట్లుగా ఉంది. అంచనా బడ్జెట్‌లో 81.5శాతంగా ఉందని కాగ్ వెల్లడించింది. ఏప్రిల్ ఫిబ్రవరి మధ్యకాలంలో మొత్తం రాబడులు రూ.27.91 లక్షలకోట్లుగా ఉన్నాయి.

# ఐదుకంపెనీలుగా వేదాంత డీమెర్జర్




**ముంబయి, మార్చి 30:** ప్రముఖ మైనింగ్, మెటల్స్ దిగ్గజం వేదాంత కంపెనీ ఛైర్మన్ అనిల్ అగర్వాల్ వేదాంత గ్రూపులో భారీ డీమెర్జర్ ప్రక్రియను ధృవీకరించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ ప్రక్రియ ద్వారా వేదాంత లిమిటెడ్ ఐదు కొత్త స్వతంత్ర కంపెనీలుగా విడిపోనుందని తెలిపారు. నిజానికి ఈ డీమెర్జర్ ప్రక్రియ ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోను భారీగా పెంచనుంది. ప్రస్తుతం మీ దగ్గర వేదాంత లిమిటెడ్‌కు చెందిన ఒక్క షేరు ఉంటే, డీమెర్జర్ పూర్తయిన తర్వాత మీ వద్ద మొత్తం 6 షేర్లు ఉంటాయి. వ్యాపార కార్యకలాపాలను సరళీకృతం చేసేందుకు అనిల్ అగర్వాల్ వేదాంతను కింది ఐదు విభాగాలుగా విడగొడుతున్నట్లు తెలిపారు. వేదాంత అల్యూమినియం, వేదాంత ఆయిల్‌గ్యాస్ , వేదాంత స్టీల్ ఫెర్రస్ ఇనుము, ఉక్కు వ్యాపారం, వేదాంత బేస్ మెటల్స్ రాగి, జింక్ వంటి లోహాలు, వేదాంత పవర్ విద్యుత్ ఉత్పత్తి రంగాలుగా విభజించారు. ఈ ఐదు కంపెనీలకు మాతృ సంస్థ అయిన వేదాంత లిమిటెడ్ ఇకపై కేవలం పెట్టుబడులు, సెమీకండక్టర్ల వంటి భవిష్యత్ టెక్నాలజీ ప్రాజెక్టులపై మాత్రమే దృష్టి సారిస్తుంది.

2025 డిసెంబర్ నాటికి కంపెనీపై రూ.60,624 కోట్ల అప్పు ఉంది. వచ్చే మూడేళ్లలో సుమారు 300కోట్ల రుణాన్ని తగ్గించుకోవాలని అనిల్ అగర్వాల్ లక్ష్యంగా పెట్టుకున్నారు. విడిపోయిన కంపెనీలలో వాటాలను విక్రయించడం ద్వారా ఈ అప్పు తీర్చడం సులభమవుతుందని ఆయన అభిప్రాయపడుతున్నారని సమాచారం. ప్రస్తుతం ఉన్న2700 కోట్ల మార్కెట్ క్యాప్, ఐదు కంపెనీలు విడిపోయిన తర్వాత అంతకంటే ఎక్కువ విలువను సంతరించు కుంటుందని కంపెనీ ఆశిస్తోంది. ఇప్పటివరకు ఆయిల్, గ్యాస్, పవర్ వంటి అన్ని వ్యాపారాలన్నీ ఒకే గొడుగు కింద ఉండేవి. ఇకపై ఇన్వెస్టర్లు తమకు నచ్చిన రంగంలో పెట్టుబడి పెట్టే అవకాశం లభిస్తుంది. ప్రతి కంపెనీకి ప్రత్యేక బోర్డ్, యాజమాన్యం ఉండటం వల్ల నిర్ణయాలు వేగంగా జరిగి లాభాలు పెరిగే అవకాశం ఉంది. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే ఈ ప్రక్రియ వేదాంత ఇన్వెస్టర్లకు ఒక లాటరీ వంటిదని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. అప్పుల నుంచి విముక్తి పొంది, కొత్త కంపెనీలతో వేదాంత గ్రూప్.. మార్కెట్‌లో సరికొత్త రికార్డులు సృష్టిస్తుందో లేదో చూడాలి.

# ఆర్థిక వ్యవస్థలోకి ఆర్‌బిఐ 84,582 కోట్ల లిక్విడిటీ




**ముంబయి, మార్చి 30:** దేశ ఆర్థికవ్యవస్థలో నగదు లభ్యతను పెంచేందుకు ఆర్బీఐ కసరత్తులు షురూచేసింది. రిజర్వుబ్యాంకు నిర్వహించిన మొదటి 3 రోజుల విఆర్ఆర్ వేలంలో 50,001 కోట్లను ప్రవేశపెట్టింది. సోమవారం నిర్వహించిన ఈ వేలంలో కట్‌ఆఫ్ రేటు 5.34 శాతం కాగా, వెయిటెడ్ సగటు రేటు 5.44 శాతంగా ఉన్నట్లు ఆర్బీఐ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. తరువాత రోజు నిర్వహించిన మరో వేలంలో ఆర్బీఐ రూ.34,581 కోట్లను ప్రవేశపెట్టింది. ఈ వేలంలో కట్‌ఆఫ్ రేటు 5.26 శాతం, వెయిటెడ్ సగటు రేటు 5.30 శాతంగా నమోదైంది. మొదటి వేలంలో రూ.50,000 కోట్ల నోటిఫైడ్ మొత్తానికి వ్యతిరేకంగా రూ.57,287 కోట్ల బిడ్లు వచ్చినప్పటికీ, ఆమొత్తంలో 50వేల కోట్ల బిడ్లను మాత్రమే ఆర్బీఐ అంగీకరించింది. రెండో వేలంలో వచ్చిన బిడ్లు నోటిఫైడ్ మొత్తానికి తక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం, మార్చి 27 నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలో సుమారు రూ.1.27 లక్షల కోట్ల అదనపు లిక్విడిటీ ఉన్నట్లు అంచనా. గత కొన్ని రోజుల్లో, వివిధ కాలపరిమితుల విఆర్ఆర్ వేలంపాటల ద్వారా ఆర్బీఐ మొత్తం రూ.2,73,530 కోట్ల తాత్కాలిక నగదు లభ్యతను వ్యవస్థలోకి ప్రవేశపెట్టింది. 2026 జనవరి నుండి ప్రభుత్వ సెక్యూరిటీల ఓపెన్ మార్కెట్ కొనుగోళ్ల ద్వారా భారతీయ రిజర్వ్ బ్యాంకు రూ.3.50 లక్షల కోట్ల స్థిరమైన నగదు లభ్యతను బ్యాంకింగ్ వ్యవస్థలోకి ప్రవేశపెట్టింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.